
తెలంగాణ
తెలుగు జాతీయ దినపత్రిక
# తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం




సంపుటి :03, సంచిక :50 హైదరాబాద్: సంపాదకులు: గున్నాల అనిల్ రెడ్డి, శుక్రవారం ఆగస్టు 15, 2025, పేజీలు -12, వెల -5/-

Published from: Hyderabad, Rangareddy, Nizamabad, Adilabad, And Bhadradri Kothagudem, Vijayavada, Vishakapatnam, Kurnool, Anantapur

## ఆగస్టు 15 ప్రతి భారతీయుడికి
# గర్వకారణం

**రాజ్యాంగం, ప్రజాస్వామ్యం కంటే గొప్పది ఏదీ లేదు**
**ఉగ్రవాదంపై పోరాటానికి ఆపరేషన్ సిందూర్ నిదర్శనం**
**ఎలాంటి దాడినైనా ఎదుర్కొనేలా సాయుధదళాలు సిద్ధం**
**స్వావలంబన దేశంగా అవతరించే దిశగా భారత్**
**ద్రవ్యోల్బణం తగ్గుముఖం ..బలంగా ఆర్థిక వ్యవస్థ**
**స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలో రాష్ట్రపతి ముర్ము**



**న్యూఢిల్లీ,ఆగస్టు 14(తెలుగు-వెలుగు):** స్వావలంబన దేశంగా అవతరించే దిశగా భారత్ దృఢమైన విశ్వాసంతో ముందుకు సాగుతోందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టిందని, ఎగుమతులు పెరిగాయని, అన్ని కీలక సూచీలు దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని చూపిస్తున్నాయని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్రపతి ముర్ము జాతినుద్దేశించి ప్రసంగించారు. అలాగే దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దేశ ప్రజలను ఉద్దేశించి ముర్ము మాట్లాడుతూ.. ఆగస్టు 15 కేవలం స్వేచ్ఛా పండుగ మాత్రమే కాదని, ప్రతి భారతీయుడికి గర్వకారణమని అన్నారు. మన రాజ్యాంగం, ప్రజాస్వామ్యం కంటే గొప్పది ఏదీ లేదని అన్నారు. ప్రజాస్వామ్య మార్గంలో సవాళ్లు ఎదురైనప్పటికీ భారతదేశం విజయం సాధించిందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల వల్లే మిగతా2లో...

## వర్షాలపై అప్రమత్తంగా
# ఉండండి

**తక్షణ సహాయ చర్యలకు సిద్ధం కావాలి**
**సహాయక చర్యలకు జిల్లాకు కోటి విడుదల**
**రెవెన్యూశాఖ మంత్రి**




**హైదరాబాద్,ఆగస్టు 14(తెలుగు-వెలుగు):** వర్షాల వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి అన్నారు. తెలంగాణలో భారీ వర్షాలు, సహాయక చర్యలపై ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమీక్షలో సీఎస్ రామకృష్ణారావు పాల్గొన్నారు.

ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సహాయక చర్యల కోసం ప్రతి జిల్లాకు రూ.కోటి విడుదల చేస్తున్నట్లు- తెలిపారు. సెలవులో ఉన్న అధికారులు, సిబ్బందిని వెనక్కి పిలిపించాలని కోరారు. వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. వచ్చే 3 రోజుల్లో భారీ వర్షాల దృష్ట్యా జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. వివిధ జిల్లాల్లోని పరిస్థితి గురించి కలెక్టర్లను మంత్రి పొంగులేటి అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాల్లో చేపట్టాల్సిన రక్షణ చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. జీహెచ్ఎంసీలో మున్సిపల్, ట్రాఫిక్ విభాగాలు, మెట్రో వాటర్ బోర్డు సమన్వయంతో పని చేయాలన్నారు.మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు వాతావరణ శాఖ అధికారులు రెడ్ జోన్ హెచ్చరికలు జారీ చేశారు. ఈ జిల్లాల్లో అత్యంత భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. ఈ జిల్లాల్లో అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. మిగతా అన్ని జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు.

## 30 ఏళ్ల తర్వాత చరిత్ర
# తిరగరాశాం

**కష్టపడిన నేతలు, కార్యకర్తలకు అభినందనలు**
**జడ్పీటిసిల విజయంపై చంద్రబాబు హర్షం**



**అమరావతి, ఆగస్టు 14(తెలుగు-వెలుగు):** రెండు చోట్లా టీడీపీ ఘన విజయంపై సీఎం చంద్రబాబు స్పందించారు. కడప జిల్లా టీడీపీ నేతలంతా పులివెందుల విజయం పట్ల స్పందించాలని ఆయన కోరారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు జరిగాయని పేర్కొన్నారు. 30 ఏళ్ల తర్వాత చరిత్ర తిరగరాశామని ఆయన ఉద్ఘాటించారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు మిగతా2లో...



2లో

**సిఎం రేవంత్‌తో అందెశ్రీ, రాహుల్ సిప్లింగంజ్ భేటీ**

## ఇవిఎంలను తెచ్చిందే
# రాజీవ్ గాంధీ

**మీడియా సమావేశంలో రాహుల్ పై మండిపడ్డ ఎంపి రఘునందన్**



**హైదరాబాద్, 14(తెలుగు-వెలుగు):** దేశానికి ప్రతిపక్ష నేతగా ఉన్న వ్యక్తికి వ్యవస్థల మీద నమ్మకం లేకపోవడం దురదృష్టకరమని మెదక్ బిజెపి ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. హైదరాబాద్‌లోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాలెట్ పేపర్ కాదని మిగతా2లో...



2లో

**కాశ్మీర్ క్లౌడ్ బస్ట్‌లో 38 మంది మృత్యువాత**

**భారీ వర్షంతో పలువురికి తీవ్ర గాయాలు**
**సహాయక చర్యలకు దిగిన ఎన్‌డిఆర్ఎఫ్ దళాలు**



**పోలీస్‌లకు డిగ్రీ కనీస విద్యార్హత**

**డిగ్రీ పూర్తిచేయలేని వారికోసం అవకాశం**
**ఓపెన్ వర్సిటీతో తెలంగాణ పోలీస్ శాఖ ఒప్పంధం**

**హైదరాబాద్, 14(తెలుగు-వెలుగు):** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ-, తెలంగాణ పోలీసు మిగతా2లో...

## ఎన్నికల సంఘానికి
# గట్టి దెబ్బ

**తొలంగించిన 65లక్షల పేర్లనుప్రచురించండి**
**మరణించిన 22లక్షల మంది వివరాలు వెల్లడించండి**
**19వ తేదీలోపు వివరాలు ఇవ్వండి...22 నాటికి మాకు ఇవ్వండి**
**బీహార్‌లో ఓట్ల తొలగింపు వ్యవహారంపై విచారణ**
**ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు కీలక ఆదేశం**



**న్యూఢిల్లీ,ఆగస్టు 14(తెలుగు-వెలుగు):** ఓట్ల తొలగింపుపై తాము ఎవరికీ వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదని వాదించిన భారత ఎన్నికల సంఘానికి(ఈసీ) సుప్రీం బుధవారం గట్టి కౌంటర్ ఇచ్చింది. బీహార్‌లో ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మంది పేర్లను కారణాలు పేర్కొంటూ ఆగస్టు 19లోగా ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం ఈసీని ఆదేశించింది.ప్రతి ఓటరుకు అందుబా టులో ఉండేందుకు వీలుగా ఈ 65 లక్షల పేర్ల జాబితాను ముద్రించాలని కూడా ధర్మాసనం ఈసీని ఆదేశించింది. ఈసీ తప్పిదం వల్ల తమ పేర్లు ఓటర్ల జాబితాలో కోల్పోయిన వారు ఆధార్ కార్డుల కాపీని జతచేసి తమ క్లెయిమ్‌లు సమర్పి ంచవచ్చని కూడా సుప్రీంకోర్టు సూచించింది.

## మైనస్‌లోకి తెలంగాణ
# ద్రవ్యోల్బణం


- అస్తవ్యస్త ఆర్థిక విధానాలతోనే ఈ దుస్థితి
- ఆర్థిక కార్యకలాపాలు మందగించడమే కారణం
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కెటిఆర్, హరీష్ రావు



**హైదరాబాద్, 14(తెలుగు-వెలుగు):** వరుసగా రెండు నెలల పాటు తెలంగాణ ద్రవ్యోల్బణం మైనస్‌లోకి పోవడం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పతనానికి స్పష్టమైన నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలో తొమ్మిదేండ్ల పాటు-దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ రాష్ట్రం, కేవలం ఎనిమిది నెలల కాంగ్రెస్ పాలనలో ఆర్థికంగా చితికిపోయిందని మిగతా2లో...

**ఎప్పటికైనా అఖండ భారత్ ఏర్పాటు తప్పదు**

**అనివార్య పరిస్థితుల్లో ఆనాడు దేశ విభజన**
**కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ**




**నాగపూర్, 14(తెలుగు-వెలుగు):** అనివార్య పరిస్థితుల్లో ఆనాడు దేశ విభజన జరిగిందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. భారత్-పాకిస్థాన్‌లు విభజనను గుర్తుచేసుకుంటే.. అనివార్య పరిస్థితుల్లోనే నాడు దేశ విభజన జరిగిందని గుర్తించాలని మిగతా2లో...

# 30 ఏళ్ల తర్వాత చరిత్ర తిరగరాశాం

(మొదటి పేజీ తరువాయి)


జరిగాయి కాబట్టి.. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలకు 11 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. అలాగే ఒంటిమిట్ట గెలుపుపైనా హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎన్నికల్లో కష్టపడి టీడీపీకి ఘన విజయాన్ని సాధించిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు సీఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డి ఘన విజయం సాధించారు. 6,735 ఓట్ల మెజారిటీతో టీడీపీ అభ్యర్థి లతారెడ్డి గెలిచారు. ఈ ఘన విజయంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలో టీ–డీపీ అభ్యర్థి ఘన విజయంపై మంత్రులతో మాట్లాడారు. కడప జిల్లాలోని టీడీపీ నేతలంతా పులివెందుల విజయం పట్ల స్పందించాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. పులివెందుల కౌంటింగ్‌లో 30 ఏళ్ల తర్వాత ఓటు– వేశామని ఓటర్లు స్లిప్ పెట్టారని .. అంటే అక్కడ పరిస్థితులు ఎలా ఉన్నాయనేది ప్రజలు గమనించాలని సూచించారు. టీడీపీ నేతలు పులివెందుల విజయంపై ప్రజలను చైతన్యం చేసే విధంగా మాట్లాడాలని మార్గ నిర్దేశం చేశారు. పులివెందులలో జగన్ రెడ్డి అరాచకాల నుంచి ప్రజలు ఇప్పుడిప్పుడే బయట పడుతున్నారని నొక్కిచెప్పారు. 30 ఏళ్ల తర్వాత పులివెందుల ప్రజలు ఓటు వేశారనేది ఏపీలో ప్రజలకు తెలియచేయాలని సీఎం చంద్రబాబు చెప్పారు. ఎన్నికలు ప్రజాస్వామ్యయుతంగా జరిగాయని కూడా చెప్పాలని మంత్రులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశంచేశారు.

# మచైల్ మాత యాత్రలో అపశృతి: 22 మంది మృతి



**శ్రీనగర్: ఆగస్టు 14(తెలుగు–వెలుగు):** జమ్మూ కశ్మీర్ రాష్ట్రం మచైల్ మాత యాత్రలో అపశ్రుతి చోటు చేసుకుంది. వరదల్లో కొట్టుకొని పోయి 22 మంది మృతి చెందారు. కిష్త్వార్ జిల్లాలో కుంభ వృష్టితో మచైల్ మాత యాత్రకు వెళ్లే దారిలో భారీ వర్షం పడడంతో భక్తులు వరదల్లో కొట్టుకొనిపోయి 22 మంది మృతి చెందారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మచైల్ మాత యాత్రను వెళ్లే భక్తులను నిలిపివేశారు. 65 మందిని రెస్క్యూ టీమ్ కాపాడారు. జమ్ము కశ్మీర్ భారీ వర్షాలు కురవడంతో కొండ ప్రాంతాలలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

# సిఎం రేవంత్‌తో అందెశ్రీ, రాహుల్ సిప్లిగంజ్ భేటీ



**హైదరాబాద్,ఆగస్టు 14(తెలుగు–వెలుగు):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో ప్రముఖ కవి అందెశ్రీ, గాయకుడు రాహుల్ సిప్లింగంజ్‌లు వేర్వేరుగా కలిశారు. కేవలం మర్యాదపూర్వకంగానే కవి అందెశ్రీ,సింగర్ రాహుల్ సిప్లిగంజ్.÷–లు కలిశారు. వీరికి శాలువా కప్పి సిఎం అభినందించారు. ఇటీవల రాహుల్‌కు ప్రభుత్వం కోటి రూపాయల నజరానా ప్రకటించింది. అందెశ్రీ గీతం తెలంగాణ గీతంగా అలరారుతోంది.

# ఎప్పటికైనా అఖండ భారత్ ఏర్పాటు తప్పదు

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. ఏదో ఒకరోజు మళ్లీ అఖండ దేశంగా భారత్ మారుతుందని గడ్కరీ పేర్కొన్నారు. భారత్‌ను సూపర్ పవర్, విశ్వగురువుగా మార్చాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పిలుపునిచ్చారు. ప్రతి రంగంలో మనం బలంగా ఉంటేనే ప్రపంచం భారత్ మాట వింటుందన్నారు. నాగ్‌పుర్‌లో రాష్ట్ర నిర్మాణ్ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. అప్పట్లో భిన్నత్వంలో ఏకత్వం భావనతో భారత్ దూసుకెళ్తోందన్న ఆయన.. సాయుధ బలగాల పనితీరుపై ప్రశంసలు కురిపించారు. భారత్‌ను 5 ట్రిలియన్ డాలర్లతో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆత్మనిర్భరత సాధించడంతోపాటు– విశ్వగురువుగా భారత్ మార్చేందుకు కృషి చేయాలని గడ్కరీ పిలుపునిచ్చారు. ప్రతి రంగంలో భారత్ బలంగా ఉంటేనే ప్రపంచం మన మాట వింటుందన్నారు. ఆర్థికంగా, రక్షణ, సైన్స్ అండ్ –టె–క్నాలజీ, వ్యవసాయ, వాణిజ్య రంగాల్లో అగ్రగామిగా ఉండటంతోపాటు– ప్రతి పౌరుడు దేశభక్తితో ఉన్నప్పుడే 'విశ్వగురువు'గా మారుతుందన్నారు.

# పోలీస్‌లకు డిగ్రీ కనీస విద్యార్హత

(మొదటి పేజీ తరువాయి)



శాఖ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. దూరవిద్య విధానంలో కానిస్టేబుళ్లు డిగ్రీ చదివేందుకు వీలుగా యూనివర్సిటీ–, పోలీసు అధికారులు ఎంఓయూ చేసుకున్నారు. ఈ మేరకు ఒప్పంద పత్రాలను డీజీపీ జితేందర్, వర్సిటీ– ఉన్నతాధికారులు మార్చుకున్నారు. డిగ్రీ పూర్తికాని కానిస్టేబుళ్లు, ఏఎస్పైలకు దూరవిద్య విధానం అమలు చేయనున్నారు. కానిస్టేబుళ్లకు కోర్సు మెటీ–రియల్, స్టడీ సెంటర్ యాక్సెస్ ఇస్తామని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధికారులు తెలిపారు. దేశంలోనే తొలిసారిగా తెలంగాణా పోలీస్ డిపోర్ట్‌మెంట్‌లో విధులు నిర్వహిస్తున్న వారందరికీ గ్రాడ్యుయేషన్ ఉండాలని నిర్ణయించామని డీజీపీ జితేందర్ తెలిపారు. అందులోభాగంగా గురువారం హైదరాబాద్‌లో తెలంగాణా పోలీస్, బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీల మధ్య ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా డీజీపీ జితేందర్ మాట్లాడుతూ.. పోలీస్ డిపోర్ట్‌మెంట్‌లో 10వ తరగతి, ఇంటర్ చదివి గతంలో ఈ పోలీస్ శాఖలో చేరారని గుర్తు చేశారు. అయితే వారికి గ్రాడ్యుయేషన్ కల్పించాలని పోలీస్ శాఖ నిర్ణయం తీసుకుందన్నారు. వాని గ్రాడ్యుయేషన్ చేయించాలనే ఉద్దేశంతో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీతో ఒప్పందం కుదుర్చు కున్నామని వివరించారు. డిపార్ట్‌మెంట్‌లో దాదాపు కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్స్.. 30 వేల మంది గ్రాడ్యుయేషన్ పూర్తి చేయని వారు ఉన్నట్లు తాము గుర్తించామని పేర్కొన్నారు. వచ్చే ఐదేళ్లలో పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో అందరూ గ్రాడ్యుయేషన్ చేసిన వారిగా ఉండాలని తమ సంకల్పమని ఈ సందర్భంగా డీజీపీ జితేందర్ స్పష్టం చేశారు. ఇక అంబేద్కర్ యూనివర్సిటీ– వీసీ గంటా చక్రపాణి మాట్లాడుతూ.. దేశంలోని అన్ని రాష్ట్రాల పోలీస్ శాఖలకంటే.. మనం అన్ని రకాలుగా ఉత్తమ స్థానంలో ఉన్నామన్నారు. డీజీపీ జితేంద్రకి వచ్చిన అలోచనే ఇప్పుడు కార్యరూపం దాల్చిందని పేర్కొన్నారు. పోలీస్ శాఖలో ప్రస్తుతం వివిధ విభాగాల్లో, పలు పోస్టుల్లో పని చేస్తున్న వారిలో కొందరికి డిగ్రీ అర్హత లేదని తెలిపారు. పలు కారణాలతో డిగ్రీ చేయకపోవడం లేదా డిగ్రీ మధ్యలోనే ఆపేసిన వాళ్లు సైతం ఉన్నారని వివరించారు. అలాంటి వారికి మా యూనివర్సిటీ– ద్వారా ఓపెన్ డిగ్రీ చేసే అవకాశం కల్పిస్తున్నామన్నారు. అంతే కాకుండా.. వీళ్లకు అదనంగా పోలీసింగ్‌కి కావాల్సిన శిక్షణ సైతం అందిస్తామని తెలిపారు. ఒక వైపు విధులు నిర్వహిస్తూనే.. మరోవైపు చదువుకునే వెసులుబాటు– కల్పించనున్నామని తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలోని ట్రైనింగ్ సెంటర్లను తాము ఈ అభ్యర్థుల కోసం వినియోగించుకోనున్నామని వీసీ ఘంటా చక్రపాణి చెప్పారు.

# ఆగస్టు 15 ప్రతి భారతీయుడికి గర్వకారణం

(మొదటి పేజీ తరువాయి)

78 సంవత్సరాల క్రితం దేశానికి స్వేచ్ఛ వచ్చిందని అన్నారు. రాష్ట్రపతి ముర్ము ఇటీవల జరిగిన ఆపరేషన్ సింధూర్ గురించి తన ప్రసంగంలో ప్రస్తావించారు. ఉగ్రవాదంపై మానవాళి పోరాటానికి ఉదాహరణగా ఆపరేషన్ సింధూర్ చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. పహల్గాం దాడికి భారతదేశం తీసుకున్న నిర్ణయాత్మక, దృఢమైన ప్రతిస్ప ందన ఇదని, దీనితో మన సాయుధ దళా లు దేశాన్ని రక్షించడానికి ఏ పరిస్థితిని అయినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నా యని నిరూపించిందన్నారు. పహల్గాంలో అమాయక పౌరులపై జరిగిన ఉగ్రదాడిని అమానుషమైన, పిరికిపంద చర్యగా పేర్కొన్నారు. ఉగ్రవాదంపై మానవాళి పోరాటంలో 'ఆపరేషన్ సిందూర్ ఒక ఉదాహరణగా చరిత్రలో నిలిచిపోతుందని చెప్పారు. పహల్గాం ఉగ్రదాడిని దేశమంతా ముక్తకంఠంతో ఖండించింది. మనల్ని విభజించాలనుకునే వారికి దీటైన జవాబు ఇచ్చింది. 'ఆపరేషన్ సిందూర్' ద్వారా ఉగ్రమూకలకు గుణపాఠం నేర్పింది. దేశాన్ని కాపాడే విషయంలో మన సాయుధ బలగాలు ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాయని ఈ ఆపరేషన్ చాటి చెప్పింది. రక్షణ రంగంలో 'ఆత్మనిర్భర్ భారత్' కార్యక్రమం విజయానికి నిదర్శనంగా నిలిచింది. సుపరిపాలన, అవినీతిని సహించని విధానాలతో భవిష్యత్తు వైపు దేశం పయనిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో 6.5 శాతం జీడీపీ వృద్ధి రేటుతో.. ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోంది. కశ్మీర్ లోయలో రైలు మార్గంతో స్థానికంగా వాణిజ్యం, పర్యాటకం మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, ప్రతి వయోజన పౌరుడికి ఓటు– హక్కు ప్రసాదించిన ప్రజాస్వామ్య మార్గాన్ని మనం స్వీకరించామని గుర్తు చేశారు. దీని ద్వారా మన విధిని నిర్ణయించుకునే హక్కును మనమే ఇచ్చుకున్నామని అన్నారు. సవాళ్లు ఉన్నప్పటికీ, భారత ప్రజలు ప్రజాస్వామ్యాన్ని విజయవంతంగా స్వీకరించారని, మనకు రాజ్యాంగం, ప్రజాస్వామ్యం అన్నింటికంటే ముఖ్యమైనవి అన్నారు. ఆగస్టు 15 దేశ ప్రజల సమిష్టి జ్ఞాపకాలలో నిలిచిపోయే చారిత్రాత్మక తేదీ అని ఆమె పేర్కొన్నారు. సుదీర్ఘ వలస పాలనలో భారతీయులు తరతరాలుగా స్వేచ్ఛ గురించి కలలు కన్నారని అన్నారు. దేశంలోని ప్రతి మూల నుంచి ప్రజలందరూ విదేశీ పాలన సంకెళ్లను తెంచుకోవాలని శాంతియుత మార్గంలో పోరాడారని తెలిపారు. వారి పోరాటం అచంచల మైన ఆశావాదంతో నిండి ఉంది. ఇది స్వాతంత్య్రం తర్వాత కూడా మన అభివృద్ధిని నడిపించిందని అన్నారు. రేపు మనం త్రివర్ణ పతాకానికి వందనం చేస్తున్నప్పుడు 78 సంవత్సరాల క్రితం ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్య్రం తెచ్చిన త్యాగధనులందరికీ కూడా నివాళులు అర్పిస్తామని అన్నారు. శుభాంశు శుక్లా అంతరిక్ష ప్రయాణం.. ఒక తరాన్ని గొప్ప కలలు కనేలా ప్రేరేపించింది. అదేవిధంగా దేశ మానవసహిత అంతరిక్ష కార్యక్రమం 'గగన్‌యాన్'కు ఇది చాలా ఉపయోగకరంగా ఉంటు–ంది. మరోవైపు.. నూతన ఆత్మవిశ్వాసంతో మన యువత క్రీడల్లో తమదైన ముద్ర వేస్తున్నారు. ముఖ్యంగా చదరంగంలో మునుపెన్నడూ లేని విధంగా భారత్ ఆధిపత్యం చెలాయిస్తోంది. 'జాతీయ విద్యా విధానం– 2020' విస్తృత మార్పులు తీసుకొచ్చింది. దేశంలో ఆదాయ అసమానతలు తగ్గుతున్నాయి. ప్రాంతీయ అసమానతలు కూడా కనుమరుగవుతున్నాయి. సామాజిక సంక్షేమంతో కూడిన సమగ్ర ఆర్థిక వృద్ధి.. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగే దిశగా భారత్‌ను ముందుకు నడుపుతోందని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని.. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేసిన ప్రసంగం ఆలోచనాత్మకంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దేశ సమష్టి పురోగతిని, రాబోయే అవకాశాలను ప్రధానంగా ప్రస్తావించారని తెలిపారు. దేశ స్వాతంత్యం కోసం మహనీయులు చేసిన త్యాగా లను గుర్తుచేశార న్నారు. అదేవిధంగా.. దేశ నిర్మాణ ంలో ప్రతి పౌరుడు భాగస్వామికావాలని రాష్ట్రపతి పిలుపునిచ్చారని ప్రధాని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

# కాశ్మీర్ క్లౌడ్ బస్ట్‌లో 38 మంది మృత్యువాత

**● భారీ వర్షంతో పలువురికి తీవ్ర గాయాలు ● సహాయక చర్యలకు తిగిన ఎన్‌డిఆర్‌ఎఫ్ దళాలు**

**శ్రీనగర్: ఆగస్టు 14(తెలుగు–వెలుగు):** జమ్మూకాశ్మీర్ కిష్టావర్ జిల్లా పద్దార్ సబ్ డివిజన్ పరిధిలోని చిషోటీ–గ్రామ పరిసర ప్రాంతంలో గురువారం జరిగిన క్లౌడ బస్ట్‌లో 38 మంది మృత్యువాత పడ్డారని సమాచారం. ఈ సంఖ్య మరింత పెరగవచ్చని అంటన్నారు. మేఘ విస్ఫోటనం కారణంగా సంభవించిన మెరుపు వరదల తో 38 మంది మరణించారు. 75 మంది తీవ్రంగా గాయపడ్డారు. మాచైల్ మాతా యాత్ర మార్గంలో ఈ గ్రామం ఉండడంతో మృతుల సంఖ్య మరింతగా పెరగవచ్చని ప్రభుత్వ అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న జిల్లా యంత్రాంగం ఆ ప్రాంతానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టింది. ఇక క్షతగాత్రులను మెరుగైన వైద్య చికిత్స కోసం జిల్లా ప్రభుత్వాసుపత్రికి జిల్లా యంత్రాంగం తరలించింది. మరో 70 మందిని సహాయక బృందాలు రక్షించాయి. మేఘ విస్ఫోటనం అనంతరం చోటు– చేసుకున్న పరిణామాలపై గవర్నర్, సీఎంలతో కేంద్ర మంత్రి అమిత్ షా ఫోన్ చేసి మాట్లాడారు. అలాగే ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, భద్రతా దళాలు, పోలీసులు సంయుక్తంగా ఈ సహాయక చర్యల్లో పాల్గొన్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. అయితే ఈ వర్షాల కారణంగా మరణించిన వారి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కిష్టావర్ డిప్యూటీ– కమిషనర్ పంకజ్ కుమార్ శర్మ సహాయక చర్యలను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఈ ఘటనపై జమ్మూకాశ్మీర్ గవర్నర్ మనోజ్ సిన్హా స్పందించారు. భారీ వరద కారణంగా 12 మంది మరణించడంపై ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటు–ంబాలకు సానుభూతి తెలిపారు.



అలాగే సహాయక చర్యలు తీసుకోవాలంటూ పౌర, పోలీస్, ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ అధికారులకు గవర్నర్ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇంకోవైపు దేశ రాజధాని ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్‌లో ఎడతెరపి లేని భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ రోజు అంటే గురువారం ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో మరింతగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఇక హిమాచల్ ప్రదేశ్ అంతటా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రాష్ట్రంలో రుతుపవనాలు ప్రవేశించిన నాటి నుంచి ఇప్పటివరకూ 241మంది మరణించారని ఆ రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. వారంతా.. వర్షాధార విపత్తులతోనే మరణించారని వివరించింది.

# మైనస్‌లోకి తెలంగాణ ద్రవ్యోల్బణం

(మొదటి పేజీ తరువాయి)

తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న అస్తవ్యస్త ఆర్థిక విధానాలతోనే తెలంగాణకు ఈ దుస్థితి వచ్చిందని ఆరోపించారు. తెలంగాణ చరిత్రలో తొలిసారిగా జూన్, జులై నెలల్లో ద్రవ్యోల్బణం మైనస్‌లో నమోదైందన్నారు. జులైలో రాష్ట్ర ద్రవ్యోల్బణం -0.44శాతం ఉండగా, జాతీయ సగటు–2.10శాతంగా ఉందని గుర్తు చేశారు. జూన్‌లో రాష్ట్రంలో -0.93శాతంగా ఉంటే, దేశవ్యాప్తంగా 1.55శాతంగా ఉందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం తగ్గుదల మరింత తీవ్రంగా ఉందని కేటీఆర్ తెలిపారు. ద్రవ్యోల్బణం తగ్గడం సానుకూల సంకేతాలు కావన్న ఆయన.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఇది ప్రమాదకర సంకేతమని హెచ్చరించారు. ప్రజలు అత్యవసరాలకు మాత్రమే ఖర్చు చేస్తున్నారని, వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక రంగాలన్నీ స్తంభించిపోయాయన్నారు. కొత్త ఉద్యోగాల కల్పన లేకపోవడం, ఆర్థిక కార్యకలాపాలు మందగించడమే ఈ పరిస్థితికి కారణమన్న ఆర్థిక నిపుణుల సూచనలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక కార్యకలాపాలను పూర్తిగా నిర్వీర్యం చేసిందని కేటీ–ఆర్ మండిపడ్డారు. ఒకప్పుడు దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణ ఇప్పుడు తిరోగమనంలోకి వెళ్లడం బాధాకరమని.. క్లూలెస్ కాంగ్రెస్ పాలనలో శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థ నాశనమవుతోందని.. హోప్‌లెస్ గవర్నమెంట్, హోప్‌లెస్ గవర్నెన్స్ అంటూ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఆశలు చూపించి మోసం చేసిందని కేటీఆర్ విమర్శించారు. ఉద్యోగ కల్పనకు సంబంధించి ప్రభుత్వం దగ్గర ఎలాంటి స్పష్టమైన ప్రణాళిక లేదని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం ఐటీ–, ఫార్మా, రియల్ ఎస్టేట్ రంగాల్లో దూసుకెళ్లిందని, ఇప్పుడు ఆ రంగాలన్నీ కుదేలయ్యాయని ఆరోపించారు. ఆర్థిక వ్యవస్థను మళ్లీ గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం వెంటనే సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని కేటీ–ఆర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర భవిష్యత్తు అంధకారంలోకి పోకుండా ఉండడానికి తక్షణమే ఆర్థిక సంస్కరణలు, ఉద్యోగ కల్పన కార్యక్రమాలను ప్రభుత్వం ప్రారంభించాలని సూచించారు. లేకపోతే, తెలంగాణ ఆర్థిక భవిష్యత్తు మరింత దిగజారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రం మళ్లీ పురోగతి పథంలో నడవాలంటే, ప్రభుత్వం తన వైఫల్యాలను సరిదిద్దుకోవాలని కేటీ–ఆర్ హితవు పలికారు. అలాగే మాజీ మంత్రి హరీష్ రావు మరోసారి కాంగ్రెస్ సర్కార్‌పై ఫైర్ అయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి ఆర్థిక నిర్వహణలో వైఫల్యం చెందారని.. ఆయన ఆరోపించారు. రాష్ట్రం ప్రమాదకర ద్రవ్యోల్బణ స్థాయిలోకి ప్రవేశించిందని తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ వరుసగా రెండో నెల కూడా ద్రవ్యోల్బణంలోకి జారుకుందని హరీష్ రావు చెప్పుకొచ్చారు. ఆర్థిక వ్యవస్థ రివర్స్ గేర్‌లో ఉందనడానికి ఇది ప్రమాదకరమైన సంకేతమని తెలిపారు. డిమాండ్ కుప్పకూలిపోతున్నా.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పక్క నుండి చూస్తోందని విమర్శించారు. ఆరోగ్యకరమైన వృద్ధిని నిర్ధారించడానికి భారత రిజర్వ్ బ్యాంక్ కూడా ద్రవ్యోల్బణాన్ని 2–6శాతం మధ్య ఉంచాలని లక్ష్యంగా పెట్టు–కుందని సూచించారు. కానీ తెలంగాణ ఇప్పుడు 0 శాతం కంటే తక్కువగా ఉందని వివరించారు. గ్రామీణ, పట్టణ ద్రవ్యోల్బణం జూన్‌లో –0.93 శాతం ఉంటే.. జూలైలో –0.44 శాతానికి కు పడిపోయిందని పేర్కొన్నారు. ఇది విజయం కాదు.. ఇది ఆర్థిక రెడ్ అలర్ట్ ఆయన స్పష్టం చేశారు.

# ఇవిఎంలను తెచ్చిందే రాజీవ్ గాంధీ

(మొదటి పేజీ తరువాయి)

ఆ నాటి రాజీవ్‌గాంధీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహించింది. రాయ్‌బరేలిలో రాహుల్ రాజీనామా చేయాలి. రాహుల్ రాజీనామా చేస్తే బ్యాలెట్ ద్వారా ఎన్నిక నిర్వహిస్తామని అన్నారు. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, తెలంగాణ, కర్ణాటకలో కాంగ్రెస్ గెలిస్తే ఈవీఎంలు పనిచేసినట్టు–. బిహార్‌లో ఓడిపోతారు కాబట్టి ఈవీఎంలు పనిచేయడం లేదంటున్నారు. ఈవీఎంలను తెచ్చిందే రాజీవ్‌గాంధీ. రాహుల్‌గాంధీ గెలిచిన రాయ్‌బరేలిలో 2లక్షల ఓట్లు అనుమానంగా కనిపిస్తున్నాయి. అక్కడ దొంగ ఓట్లతో గెలిచారు..రాహుల్ ఎన్నికను రద్దు చేయాలని కోరబోతున్నామని అన్నారు. రాయబరేలి రాజీనామా చేసి బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికకు సిద్ధమా? అని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ప్రశ్నించారు. మొదట్లో బీజేపీ ఈవీఎంలను వ్యతిరేకించింది.. కానీ శాస్త్రీయ అధ్యయనం చేసిన తర్వాత ఈవీఎంలకి మద్దతు ఇచ్చామన్నారు. కాంగ్రెస్ గెలిస్తే ఈవీఎంలు కరెక్ట్.. ఓడితే రాంగ్ అంటున్నారు.. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేస్తే కేసీఆర్ ఎట్లా ఓడిపోతారు. బంగ్లాదేశ్, భారత్ సరిహద్దు ప్రాంతాల్లో గోడ కట్టాలన్న ప్రతిపాదనను మమత బెనర్జీ తిరస్కరించారు. సరిహద్దు గోడ లేకపోవడం వల్లే బెంగాల్ ద్వారా చొరబాటు దారులు దేశంలోకి ప్రవేశిస్తున్నారు. కేటీఆర్‌కు ఎండదెబ్బ కొట్టి తిక్కతిక్కగా మాట్లాడుతున్నారు. కోర్టు తీర్పులు భాజపాకి ఎందుకు చెంప పెట్టు అవుతాయి. ఎమ్మెల్సీల రద్దుపై తుది తీర్పు ఉంది. తుది తీర్పు వచ్చాక చెంప దెబ్బ ఎవరికి తగులుతుందో చూద్దాం అని రఘునందన్‌రావు అన్నారు. తన నియోజకవర్గంలో కూడా రోహింగ్యలకి ఓటు ఇచ్చారన్నారు. ఫారిన్ ఆర్గనైజేషన్ లు ఏజెన్సీలు దేశ ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నం చేస్తున్నాయని.. ఫండింగ్ చేస్తున్నాయన్నారు. దొంగ ఓట్లతో గెలిచారని కోర్టు చెబితే ఇందిరా గాంధీ ముఖం చూపించలేక కొంగు కప్పుకొని పోయిందని విమర్శించారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు బ్యాలెట్ పేపర్‌తో నిర్వహించాలని సూచించారు.

తెలంగాణ తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం
శుక్రవారం, 15 ఆగస్టు 2025




## త్రివర్ణ పతాకంతో సాయిబాబా అలంకరణ



**తెలుగు-వెలుగు,తూ.గో.జిల్లా బ్యూరో(అనపర్తి):** అనపర్తి పాత ఊర్లోని బాల రాజేశ్వరి పీఠంలో కొలువుదీరిన షిరిడి సాయిబాబా ని 79 వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించికుని ఆకుపచ్చ, తెలుపు, కాషాయం మూడు రంగుల క్లాతులు ఉపయోగించి ప్రత్యేక అలంకరణ గావించి విగ్రహా మకర తోరణానికి జెండాలు అమర్చి తన దేశ భక్తిని రెడ్డి సతీష్ చాటు కున్నారు. పలువురు సాయిబాబాను దర్శించుకుని మువ్వన్నెల జెండా తో అలంకరించిన రెడ్డి సతీష్ ని అభినందించారు.

## వివాహా వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



**కొండాపూర్ ఆగస్టు 14 తెలుగు వెలుగు ప్రతినిధి:** మండలం బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాణిక్యప్రభు కూతురి వివాహ మహొత్సవంలో పాల్గొని నూతన వధువు వరులను ఆశీర్వదించిన సంగారెడ్డి శాసనసభ్యులు చింత ప్రభాకర్.. ఎమ్మెల్యే వెంట మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లత విజేందర్ రెడ్డి, కొండాపూర్ మండల పార్టీ అధ్యక్షులు విట్టల్, మల్లేశం, అంజిరెడ్డి తదితరులు ఉన్నారు..

## ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించిన సీడీసీ చైర్మన్ రామ్ రెడ్డి



**సదాశివపేట ఆగస్టు 14 తెలుగు వెలుగు ప్రతినిధి:** మండలంలోని కంబాలపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించిన సీడీసీ చైర్మన్ రామ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డ నుంచి ఇప్పటివరకు ఏ ఒక్క ఆమి కూడావిడువకుండా ఒక్కొక్కఆమినివిడతలవారుగా నెరవేరుస్తుందని చెప్పారు గతంలో 10 సంవత్సరాలు మాటల గారడి తప్ప ఏ ఒక్క ఆమి కూడా నెరవేర్చని బిఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పుడు శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజల కోసం పనిచేస్తుందని చెప్పారు కంబాలపల్లి గ్రామంలో గౌండ్ల నరేందర్ బేబామ్మ ఇల్లు నిర్మాణం ప్రారంభించడం జరిగింది.

## షాద్ నగర్ మున్సిపల్ పీఠాన్ని బీసీలకే ఇవ్వాలి

### - బీసీ జేఏసీ నాయకుడు టీజీ శ్రీనివాస్ డిమాండ్



షాద్ నగర్ మున్సిపల్ పీఠాన్ని బీసీలకే ఇవ్వాలనీ షాద్ నగర్ బీసీ జేఏసీ నాయకుడు టీజీ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో టీజీ శ్రీనివాస్ పేర్కొంటూ.. షాద్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మరియు గ్రంథాలయ సంస్థ చైర్మన్ లను ఓసీలకు ఇచ్చారనీ ఇప్పుడు మున్సిపల్ చైర్మన్ విషయంలో మాత్రం బీసీలకే అవకాశం ఇవ్వాలనీ ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు పెద్దపీట వేస్తుందని 42% బీసీలకే రిజర్వేషన్ ప్రాథమికత ఇచ్చిందని దీని దృష్టిలో పెట్టుకొని మున్సిపల్ పీఠాన్ని సైతం బీసీలకు అప్పుజెప్పాలని బడుగు బలహీన వర్గాలకు రాజకీయ సముచిత న్యాయం చేయాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు..

# జడ్పిటిసి స్థానాల్లో విజయం సాధించిన సందర్భంగా హర్షం



**తెలుగు - వెలుగు,తూ.గో.జిల్లా బ్యూరో (అనపర్తి):** నాలుగేళ్లలో మనమే అధికారంలోకి వస్తామను కుంటున్న దురహంకారి కి పులివెందుల ప్రజలు తమ తీర్పుతో బుద్ధి చెప్పారని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విమర్శించారు. గురువారంపులివెందుల,ఒంటిమిట్టలో కూటమి అభ్యర్థులు జెడ్పిటీసి ఎన్నికల్లో ఘన విజయం సాధించిన సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అనపర్తి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ నల్లమిల్లి మనోజ్ రెడ్డి కేక్ కట్ చేసి హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ పులివెందుల ప్రజల్ని స్వేచ్ఛగా ఓట్లు వేయనిస్తే ఫలితం ఏ విధంగా ఉంటుందో జడ్పిటిసి ఎన్నికల ఫలితాలతో తేటతెల్లమయిందని పేర్కొన్నారు. అదే విధంగా ఎమ్మెల్యే ఇంకా పలు అంశాలు ప్రస్తావిస్తూ అనేక విమర్శలు చేశారు. ఈ కార్యక్రమంలో అనపర్తి మండల టిడిపి అధ్యక్షులు, సొసైటీ చైర్మన్ కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (దత్తుడు శ్రీను), కుతుకులూరు సొసైటీ చైర్మన్ నల్లమిల్లి సుబ్బారెడ్డి, మల్లిడి ఆదినారాయణ రెడ్డి, మల్లిడి కృష్ణారెడ్డి, ప్రసాద్ రెడ్డి, తాడి గంగిరెడ్డి, కర్రి శేషారత్నం, మామిడిశెట్టి శ్రీను,సబ్బెళ్ళ సత్య, బాబురావు ఇంకా పెద్ద ఎత్తున కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాలరాజ్ అంటే నాకు ఎంతో అభిమానం..

**నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి**

**షాద్ నగర్‌లో ఎంపీ డాక్టర్ మల్లురవి సందడి**

**షాద్ నగర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండ్రాతి బాలరాజ్ గౌడ్ ను కలుసుకున్న మల్లు**





షాద్ నగర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండ్రాతి బాలరాజ్ గౌడ్ ను నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, డిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు కలుసుకున్నారు. షాద్ నగర్ బైపాస్ జాతీయ రహదారిపై రేపు బాలరాజు గౌడ్ స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా ప్రారంభించబోయే నూతన కార్యాలయానికి సంబంధించి రేపు కార్యక్రమంలో పాల్గొనేందుకు వస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈరోజు స్నేహపూర్వకంగా బాలరాజ్ గౌడ్ ను కలిసి ఆశీర్వదించి వెళ్తున్నట్లు మల్లు రవి తెలిపారు. బలరాజ్ గౌడ్ రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా ఎంతో ఎత్తుకు ఎదగాలని బాలరాజ్ గౌడ్ అంటే తనకు ఎంతో అభిమానం అని మొదటి నుండి తన వెంట నడిచిన నాయకుల్లో బాలరాజ్ గౌడ్ ఎంతో ముఖ్యుడని మల్లురవి కొనియాడారు. బాలరాజ్ గౌడ్ రాజకీయ అభ్యున్నతికి తన వంతు సహకారం అధిష్టాన పరంగా ఎల్లవేళలా ఉంటాయని మల్లు రవి తెలిపారు. రేపటి కార్యక్రమానికి తను వీలు చూసుకుని వస్తానని బాలరాజ్ గౌడ్ కు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిల్కమర్రి రవీందర్ రెడ్డి, సర్పంచ్ లలితా మోహన్ నాయక్, అమర్నాథ్ రెడ్డి, శంకర్ నాయక్, తులసీరామ్, ఈశ్వర్ నాయక్, పుల్లారెడ్డి, రాజీవ్ గౌడ్, పాండు, బూర్గుల చింటూ, శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు డాక్టర్ మల్లురవిని కలుసుకొని సన్మానించి ఆహ్వానించారు..

# పేదింటి పెళ్లికి సహాయం

**పుస్తె మెట్టెలు అందించిన బీసీ సేన జిల్లా అధ్యక్షులు :- సదర్ శ్రీను**

నందిగామలో గల ఎపురి లక్ష్మమ్మ రమేష్ దంపతుల కూతురు రాజ్యలక్ష్మీ వివాహానికి తన వంతు సహాయంగా పుస్తె మెట్టెలు అందించిన నందిగామ మండల్ యువ నాయకులు బిసి సేన జిల్లా అధ్యక్షులు సదర్ శ్రీను యాదవ్ ఎంతో మంది పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్న సదర్ శ్రీను..



# 108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవం



**సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం ఆగస్టు 14 తెలుగు వెలుగు ప్రతినిధి:** బోర్పట్ల గ్రామానికి చెందిన బేగారిసుజాత 26 సంవత్సరాలు భర్త బ్యాగరి నాగరాజు గురువారం ఏడు గంటల 28 నిమిషాలకు సుజాతకు పురిటి నొప్పులు రావడంతో 108 అంబులెన్స్ కు సమాచారం అందించారు ఆ సమయంలోఆసమయంలో కంది అంబులెన్స్ లో ఉన్న 108 సిబ్బంది ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ చిరంజీవి పైలెట్ రంజిత్ వీళ్ళు తక్షణమే స్పందించి అక్కడికి చేరుకొని సుజాతను కుటుంబ సభ్యులను అంబులెన్స్ లోకి తీసుకొని ఆసుపత్రికి తరలించే మార్గమధ్యంలో సుజాతకు తీవ్రమైన పురిటి నొప్పులు ఎక్కువ రావడంతో అరబిందో కంపెనీ దగ్గర 108 అంబులెన్స్ లోనే ప్రసవించి మగ బిడ్డకు జన్మనిచ్చారు తల్లి మరియు బిడ్డ క్షేమంగా ఉన్నారు తల్లికి మరియు బిడ్డకు అంబులెన్స్ లో వైద్యం చేసుకుంటూ వీరిని సంగారెడ్డి మాతా శిశు సంరక్షణ కేంద్రం కు తరలించారు ఆసుపత్రిలోని వైద్య సిబ్బంది మరియు కుటుంబ సభ్యులు 108 సిబ్బంది ఈఎంటి చిరంజీవికి పైలట్ రంజిత్ కు కృతజ్ఞతలు తెలిపారు

# 79వ స్వాతంత్ర్య దినోత్స వేడుకలకు సర్వం సిద్ధం..

- **రేపు ఉ: 9:30 గంటలకు జాతీయ జండాను ఆవిష్కరించనున్న వైద్య, ఆరోగ్యశాఖ మాత్యులు సి.దామోదర రాజనర్సింహ**
- **పరేడ్ గ్రౌండ్స్ లో ఏర్పాట్లను, సిబ్బంది పరేడ్ ప్రాక్టీస్ ను పరిశీలించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్**








**సంగారెడ్డి జిల్లా ఆగస్టు 14 తెలుగు వెలుగు ప్రతినిధి:** 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ ను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేయడం జరిగిందని, ఈ సందర్భంగా సిబ్బంది పరేడ్ ప్రాక్టీస్ ను ఎస్పీ పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరేడ్ గ్రౌండ్స్ ను జాగిలాలతో, బాంబ్ స్క్వాడ్లతో తనిఖీలు చేయిస్తూ.. అన్నిరకాల భద్రతపరమైన చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మాత్యులు సి.దామోదర రాజనర్సింహ ప్రధాన అతిథిగా హాజరై జాతీయ జండాను ఆవిష్కరించనున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్ వివరించారు.

# పేదల కష్టాలు తెలిసినటువంటి వ్యక్తి వీర్లపల్లి శంకర్

- **మయస్తెనియా గ్రావిస్ వ్యాధితో బాధపడుతున్నా లింగారెడ్డిగూడ వాసి ఎం.డి పకీర్ పాషా కు చేయూత**
- **మొత్తం 5 లక్షల ఎల్ఓసిని మంజూరు చేయించిన ఎమ్మెల్యే**
- **ధన్యవాదాలు తెలిపిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా శ్రీకాంత్ రెడ్డి మరియు కుటుంబ సభ్యులు**



పేదల ఆరోగ్యమే తమ ప్రభుత్వానికి ప్రధానమని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూక్ నగర్ మండలం లింగారెడ్డి గూడా గ్రామ నివాసి ఎండి పకీర్ పాషా మయస్తెనియా గ్రావిస్ అనే వ్యాధితో బాధపడుతు న్నాడు. ఈ విషయాన్ని ఫరూక్నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా శ్రీకాంత్ రెడ్డి ద్వారా తెలుసుకున్నటువంటి షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అతని వైద్య ఖర్చుల నిమిత్తం హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్లో వైద్యము నిమిత్తం మొత్తం రెండు విడతలుగా 5 లక్షల ఎల్ఓసిని మంజూరు చేయించడం జరిగింది. ఈ ఎల్. ఓ. సి.ని లింగారెడ్డి గూడా గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురేష్ గౌడ్, సీనియర్ నాయకులు శ్రీధర్ గౌడ్ నిమ్స్ హాస్పిటల్ కి వెళ్లి అతనికి ఎల్.ఓ.సి ని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఫకీర్ పాష కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే శంకర్ గారికి మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు


# కొలువు ఒకచోట - పని ఒకచోట!

## అక్రమ డిప్యుటేషన్లను రద్దు చేయాలి

**పేద విద్యార్థులు అంటే విద్యాధికారులకు విలువేలేదు!**

**డిప్యుటేషన్ పై వెళ్లిన ఉపాధ్యాయులను వెంటనే వెనక్కి పిలవాలి...**

**- బిజెపి కొందుర్గు మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి.**



కొందుర్గు మండలంలో ఉన్నచోట కొలువును వదిలి ఇతర ప్రదేశాలకు డిప్యూటేషన్ పై వెళ్లిన ఉపాధ్యాయులను వెంటనే తిరిగి వెనక్కి రప్పించేలా జిల్లా, మండల విద్యాధికారులు చర్యలు చేపట్టాలని బిజెపి కొందుర్గు మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి అన్నారు. మండలంలో నలుగురు ఉపాధ్యాయులు డిప్యూటేషన్ పై వెళ్లడంవల్ల మారుమూల గ్రామాలయిన చెరుకుపల్లి, ఆగిర్యాల, ఉమ్మెంతాల, లక్ష్మీదేవునిపల్లి నిరుపేద విద్యార్థులకు ఉపాధ్యాయులు లేక తీవ్ర నష్టం వాటిల్లుతుందని అన్నారు. విద్యాధికారులు సైతం డిప్యూటేషన్ పై వెళ్లే ఉపాధ్యాయులకు సహకరించడం బాధాకరమని అన్నారు. పేద విద్యార్థులంటే కనీస కనికరం లేని విద్యాధికారులకు కనువిప్పు కలగాలని, ఆయా పాఠశాలలలో తమ పిల్లలు ఉంటే ఉపాధ్యాయులను ఇలా బదిలీ చేస్తారా ప్రశ్నించారు. చెరుకుపల్లి గ్రామంలో ఉన్నది పూర్తిగా దళిత పిల్లలేనని, ప్రస్తుతం అక్కడ ఉన్న మరో ఉపాధ్యాయుడు అనారోగ్య కారణాల చేత ఇబ్బందులు పడుతున్నారని, ఆరోగ్యం సహకరించకపోయినా విద్యార్థులకు న్యాయం చేస్తున్నారని, ఉన్న ఉపాధ్యాయురాలిని వేరే ప్రాంతానికి పంపడం దళిత విద్యార్థులకు అన్యాయం చేయడమేనని అన్నారు. డిప్యూటేషన్ పై వెళ్లిన ఉపాధ్యాయులను వెంటనే రప్పించకపోతే ఆయా గ్రామాల విద్యార్థుల చేత జిల్లా విద్యాధికారి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాశాఖకు మంత్రిని కేటాయించకుండా, విద్యా వ్యవస్థ పై నియంత్రణ లేకుండా, విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారని, పేద విద్యార్థులకు అన్యాయం జరిగితే బిజెపి చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు..

# అయ్యవారిపల్లి వాగు వద్ద పరిస్థితి సమీక్షించిన ఎంపీడీవో బన్సీలాల్

**అధికార బృందం, గ్రామస్తులతో పరిస్థితి పై సమీక్ష**

**వాగు ఎవరు దాటవద్దని సూచించిన ఎంపీడీవో**

**యువ నాయకుడు భరత సింహారెడ్డి ఆధ్వర్యంలో యువకుల పహారా**






రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం అయ్యవారిపల్లి గ్రామ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అధికారులు చర్యలు చేపట్టారు. షాద్ నగర్ అయ్యవారిపల్లి గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించాయి. వాగు కుదిరితిగా ప్రవహిస్తున్నడంతో ఫరూక్ నగర్ మండల ఎంపీడీవో బన్సీలాల్ ఆధ్వర్యంలో గ్రామ సెక్రెటరీలు ముజఫర్నిసా బేగం, జైపాల్ రెడ్డి తదితరులు భారీకేట్లు ఏర్పాటు చేసి గ్రామస్తులకు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల ప్రజలు వాగు దాటవద్దని ఎంపీడీవో బసీలాల్ గ్రామస్తులకు సూచించారు. అయ్యవారిపల్లి గ్రామ నాయకుడు భరత్ సింహారెడ్డి తదితర గ్రామ నాయకులు యువకులతో ఎంపీడీవో బన్సీలాల్ మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామ నాయకుడు భరత్ సింహారెడ్డి మాట్లాడుతూ భారీ గేట్లు ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు ఎవరు ఎటువైపు రారని వాగు దాటకుండా యువకులు కూడా ఇక్కడ చొరవ చూపుతారని తెలిపారు. వాగు వచ్చినప్పుడల్లా ఆయా గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతాయని త్వరలోనే పరిష్కారం లభిస్తే బ్రిడ్జి నిర్మాణం పూర్తి అవుతుందని భరత్ సింహారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు..

# విద్యార్థులకు సాంకేతిక విద్య ప్రాధాన్యత ఎంతో ముఖ్యం: జనసేన నేత ముమ్మారెడ్డి ప్రేమ కుమార్



**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** విద్యార్థులకు సాంకేతిక విద్య ప్రాధాన్యత ఎంతో ముఖ్యమనీ దీనిద్వారా విద్యార్థులు మరింత రాణిస్తారని కూకట్పల్లి జనసేన పార్టీ కంటెస్టెంట్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ పేర్కొన్నారు. గురువారం కెపిహెచ్బి కాలనీలో సన్ ఎక్స్ టెక్నాలజీస్ కోచింగ్ సెంటర్ నో లాంఛనంగా ప్రేమ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సాంకేతిక విద్య ప్రాధాన్యతపై తన అభిప్రాయాలను పరుస్తూ ప్రతి ఒక్కరికి సాంకేతిక విద్య అవసరం అన్నారు. నేటి యువత కంప్యూటర్, సాఫ్ట్వేర్ రంగంలో నైపుణ్యం సంపాదించి సమాజానికి ఉపయోగపడాలని పిలుపునిచ్చారు.అలాగే ఈ కార్యక్రమంలో ప్రాంతీయ విద్యార్థులు తల్లిదండ్రులు విస్తృతంగా పాల్గొన్నారు. కోచింగ్ సెంటర్లో వివిధ సాంకేతిక కోర్సులు, ప్రోగ్రామింగ్ భాషలు, కెరీర్ మార్గదర్శక శిక్షణ అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులతో స్నేహపూర్వకంగా చర్చలు జరిపి, వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో కోచింగ్ సెంటర్ నిర్వాహకులు ఆడబల షణ్ముఖ, జనసేన నాయకులు వేముల మహేష్, పోలేబోయిన శ్రీనివాస్, పులగం సుబ్బు, వీరమహిళలు తదితరులు పాల్గొన్నారు.



# రాయికల్ గ్రామ భద్రతకు కొత్త అడుగు

**రూ. 2 లక్షలతో సీసీ కెమెరాల ఏర్పాటు**

**సీసీ కెమెరాలను ప్రారంభించిన షాద్ నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ**

**గ్రామ భద్రత కోసం ముందడుగు వేసిన రాయికల్ శ్రీనివాస్**

**హైవే పక్కన ఉన్న రాయికల్లో భద్రతా చర్యలు బలోపేతం..**





రాయికల్ గ్రామంలో ఇటీవల వరుసగా జరిగిన దొంగతనాల ఘటనలతో గ్రామ ప్రజల్లో భయాందోళన వాతావరణం నెలకొన్నది. ఈ పరిస్థితిని గమనించిన గ్రామానికి ఎల్లప్పుడూ అండగా నిలిచే గ్రామ నివాసి కాంగ్రెస్ యువ నాయకులు రాయికల్ శ్రీనివాస్, స్వయంగా రూ. 2,00,000 వ్యయంతో గ్రామమంతా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమం నేడు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా షాద్నగర్ ఎసిపి లక్ష్మీనారాయణ, సిఐ విజయ్కుమార్ గారు విచ్చేసి ప్రారంభోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. "హైవే పక్కన ఉన్న రాయికల్ గ్రామం ఎల్లప్పుడూ రద్దీగా ఉండడం వల్ల భద్రతా చర్యలు అత్యవసరం. సీసీ కెమెరాలు నేరాలను అరికట్టడంలో, నేరస్థులను గుర్తించడంలో కీలకపాత్ర పోషిస్తాయి" అని పేర్కొన్నారు.గ్రామ ప్రజల తరపున, గ్రామ భద్రత కోసం విశేషంగా సహకరించిన రాయికల్ శ్రీనివాస్ గారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆశన్న గౌడ్, మాజీ సర్పంచ్ దిద్దుల కృష్ణయ్య, మాజీ సర్పంచ్ పాండు నాయక్, మహిళా సంఘం నాయకురాలు యశోదమ్మ మరియు వాళ్ళ బృందం, ఎర్రోళ్ల యాదయ్య , మహమ్మద్ సమద్, వార్డు మెంబర్ మెకానిక్ శంకరయ్య, ఒళ్ళు శేఖర్ రెడ్డి, కుమ్మరి జంగయ్య, దారమోని వెంకటయ్య, నూకల రామచంద్రయ్య, పాండు గౌడ్, బాసుపల్లి యాదయ్య, బ్యాగరి యాదగిరి, బ్యాగరి చిన్నయ్య, మాసగళ్ల చెన్నయ్య, బంగ్లకాడి శ్రీనివాస్, గడ్డపు కృష్ణయ్య, డీజే వేణు, బాలు, ప్రశాంత్, సందీప్, అభి, కారోబర్ యాదయ్య, పాషా, బాసుపల్లి సత్యం తదితరులు పాల్గొన్నారు..

# డబుల్ బెడ్ రూమ్ డంపు యార్డును పరిశీలించిన కాంగ్రెస్

**త్వరలోనే ఎమ్మెల్యే శుభవార్త చెప్తారంటూ ప్రకటన**



రాజ్యమా ఉలిక్కిపడు అనే శీర్షికతో రాసిన వార్తలపై కాంగ్రెస్ నాయకులు స్పందించారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ సోలిపూర్ గ్రామంలో డబల్ బెడ్ రూమ్ పక్కన ఉన్న డంపింగ్ యార్డ్ త్వరలో శాశ్వత పరిష్కారానికి షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషి చేస్తున్నట్లు నాయకులు ప్రకటించారు. బుధవారం సోలిపూర్ గ్రామ శివారులో గల డపింగ్ యార్డ్ మున్సిపల్ కమిషనర్ సునీతతో పరిశీలించిన మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బాబర్ అలీ ఖాన్,సీనియర్ నాయకులు రఘు నాయక్, అగ్గనూర్ బస్వం, చెంది తిరుపతి రెడ్డి, మహమ్మద్ ఇబ్రహీం సర్వర్ పాషా, గోపాల్ నాయక్,అనిల్ జంగారి రవి, ఇస్తాక్, తదితరులు ఉన్నారు. త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం లభించబోతుందని అదేవిధంగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కూడా ప్రారంభించబోతున్నట్లు తెలిపారు.

# అధిక వర్షం పడితే రాకపోకలు నిలిచిపోతున్న కొందుర్గు - గంగన్న గూడెం రహదారి

**బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి ప్రజల భద్రతకు భరోసా కల్పించండి..**



గంగానగూడెం - కొందుర్గు రహదారిపై జనం రాకపోకలు ఆగిపోతున్నాయి. వాగు పొంగిపొర్లగానే రాకపోకలు పూర్తిగా నిలిచిపోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ఎన్నో ఏళ్లుగా ఈ వాగుపై బ్రిడ్జి నిర్మిస్తామని అనేక మంది పాలకులు హామీ ఇచ్చినా, ఇప్పటికీ పనులు పూర్తి కాలేదు.వర్షపు నీరు బలంగా వచ్చి రోడ్డును చెడగొట్టింది. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి, వాహనదారులు ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణించాల్సి వస్తోంది.రోజూ ప్రమాద భయాందోళనలతో వెళ్లాల్సి వస్తోంది. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు పాఠశాలకు, రైతులు తమ పొలాలకు, అనారోగ్య బాధితులు ఆసుపత్రులకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.ప్రతిసారీ వాగు పొంగితే మేము ఇరుక్కుపోతున్నాం. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ కూడా రావడం కష్టమవుతోంది అని గ్రామస్థులు గోడు వెల్లబోసుకుంటున్నారు. ఈ సమస్యపై పలు మార్లు అధికారులకు విజ్ఞప్తులు చేసినా ఫలితం లేకపోవడంతో ప్రజలు విసుగు చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు కదిలి, వర్షాకాలం మరింత తీవ్రతరమయ్యే లోపే బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రతి ఎన్నికల్లో హామీలు ఇస్తారు. వాగ్దానం నెరవేరుస్తలేరని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కానీ వర్షం వస్తే మేము మళ్లీ ఇరుక్కుపోతాం. ఇంకెంతకాలం మాకు ఈ దుస్థితి .. అని పెద్దలు ప్రశ్నిస్తున్నారు. తక్షణమే చర్యలు తీసుకోకపోతే తీవ్ర ఆందోళనలు చేపట్టే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

# కొంపల్లిలో వివాహ వేడుకల్లో పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు...



**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** కొంపల్లి లోని పి. ఎస్ .ఆర్ కన్వెన్షన్ సెంటర్ లో జరిగిన వివాహ వేడుకలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొన్నారు. మిత్రుడు గడ్డం వెంకటరమణారెడ్డి,లత దంపతుల కుమార్తె స్ఫూర్తి రెడ్డి, అల్లుడు సంకేత్ రెడ్డిల వివాహ వేడుకలో వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని నూతన వధూవరులను అభినందించి ఆశీర్వదించారు.

# ఆల్విన్ కాలనీలోని వెంకట పాపయ్య నగర్లో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పర్యటన...



**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని వెంకటపాపయ్య నగర్ లో సీసీ రోడ్డు నిర్మాణం పెండింగులో ఉందని కాలనీ వాసులు డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకురాగా కార్పొరేటర్ కాలనీలో గురువారం పర్యటించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణం కొరకు సాంక్షన్ లో పెట్టడం జరిగిందనీ కాబట్టి నిధులు మంజూరైన వెంటనే సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడకుండా యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, కాలనీ అధ్యక్షులు జనార్ధన్ రావు, పోశెట్టిగౌడ్, రమేష్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్లైన్ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జారె



**తెలుగు వెలుగు ప్రతినిధి, అశ్వారావుపేట:** అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలోని దమ్మపేట మండలంలోని అంకంపాలెం పంచాయతీ ఎర్రగుంపు గ్రామంలో నూతనంగా మంజూరైన విద్యుత్ లైన్ పనులను నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ శంకుస్థాపన చేశారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే జారె కొబ్బరి కాయ కొట్టి పనులను ప్రారంభించారు. ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్శాఖ ఎడిఇ బి వెంకటేశ్వర్లు, సబ్ ఇంజనీర్ వెంకట్, ఎఇ సాయి కిరణ్, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.




తెలంగాణ తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం
శుక్రవారం, 15 ఆగస్టు 2025



# షాద్ నగర్ మున్సిపల్ పీఠం ఈసారి ఎవరిదీ

- బీసీ నినాదం పనిచేస్తుందా లేదా
- అన్ని పార్టీలు బీసీలకే ప్రాధాన్యత నిస్తాయా
- లేక బీసీ కార్డు మాత్రమే వాడుకుంటాయా
- ముందుగా ఏ పార్టీ మున్సిపల్ పీఠం బీసీకే అని ప్రకటిస్తుంది..
- గతంలో రెండు సార్లు జనరల్ వచ్చినా 2014 - 2019లో బీసీ లకే ప్రాధాన్యత ఇచ్చిన రెండు ప్రధాన పార్టీలు!




రాష్ట్రంలో సాగుతున్న బీసీ మంత్రం మన షాద్ నగర్ మున్సిపాలిటీ పిఠంకు కూడా పనిచేస్తుందా అంటే అవును అనే చెప్పాలి. షాద్ నగర్ లో ఈ మధ్య కాలంలో బీసీ నినాదం, బీసీ సేనా మహిళా కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతున్నాయి. షాద్ నగర్ మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుండి ఇక్కడ 2014 మొదటి సారి మున్సిపల్ ఛైర్మెన్ జనరల్ కు కేటాయించారు. కానీ మెజార్టీ బీసీ ఓటర్లను దృష్టిలో ఉంచుకొని అప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారం మెజార్టీ కౌన్సిలర్లు కాంగ్రెస్ గెలిచారు. అపుడు ఉన్న అదినాయకులు బీసీ వర్గంకు చెందిన వ్యక్తి అగ్గనూర్ విశ్వంకు కేటాయించారు. అలాగే 2019లో జనరల్ కేటాయిస్తే అపుడు కూడా టీఆర్ఎస్ బీసీ నాయకుడు నరేందర్ కే పట్టం కట్టారు. ఇలా రెండు పార్టీలు కూడా జనరల్ కు కేటాయించిన సిటును బీసీలకు పట్టం కట్టారు. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన నడుస్తుంది మరి కొత్తగా 42% బీసీలకు రిజర్వేషన్ అని జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఒక దశలో అసెంబ్లీ సాక్షిగా బిల్లు కూడా ప్రవేశ పెట్టారు. ఢిల్లీలో ధర్నాలు కూడా చేస్తున్నారు. ఇది ఎంత వరకు సాధ్య సాధ్యలు అనేది వేచి చూడాలి. గతంలో బిఆర్ఎస్ మరియు కాంగ్రెస్ అదినాయకులు ఇద్దరు మున్సిపాలిటీ ఎలక్షన్ కు ముందే ఒక క్లారిటీ ఇచ్చేసారు. ఏది వచ్చిన బీసీలకే ఇస్తానని మాట నిలబెట్టుకున్నారు. మరి రాష్ట్రంలో ఇప్పుడు బీసీ నినాదం జోరుగా నడుస్తుంది. మరి షాద్ నగర్ మున్సిపాలిటీలో అటు అధికార పక్షం మార్కెట్ ఛైర్మెన్ పదవి జనరల్ కేటాయించారు. మరియు మున్సిపాలిటీ పీఠం ఎవరికో అని బీసీలు మరోసారి ఆశగా ఎదురు చుస్తునారు. షాద్ నగర్ లో అధికార పక్షం, ప్రతి పక్షం కూడా ఎంతో మంది బీసీ నాయకులు పార్టీ విధేయతగా మరి పార్టీ కోసం అహర్నిశలు పార్టీ వెన్నంటే ఉన్నారు. అధికార పార్టీ అధికారంలో లేనప్పటి నుండి నేటి వరకు పార్టీని నమ్ముకొని మున్సిపాలిటీ తమ భవితవ్యం ఏంటో అని ఎదురు చుస్తునారు. అధికారం కోల్పోయిన ప్రతి పక్షం అయినా పార్టీలో కూడా ఎంతో మంది బీసీ నాయకులు ఎదురు చుస్తునారు. జనరల్ కు కేటాయిస్తే మరి ఎంతో మంది బీసీ నాయకులు మొదటి నుండి పార్టీని నమ్ముకొని పనిచేసే నాయకుల పరిస్థితి ఎంటి ఇది ఇలా ఉంటే మొదటి నుండి పార్టీకీ కట్టుబడి విధేయత పనిచేస్తదా లేదా అని వేచి చూడాలి. ఒకవేళ మున్సిపాలిటీలో ఎ రిజర్వేషన్ కేటాయించినా బీసీ లకు మున్సిపల్ పీఠం అని చెప్పె, అనవాయితీ ఈసారి కూడా ఉంటదా ఉండదా బీసీల మీద ఎవరికీ ఎంత ప్రేమ అనేది ఈ మున్సిపాలిటీ పీఠం పై కూర్చునే వారి పైన ఆధారపఢీ ఉంటది. బీసీల మీద ప్రేమ ఒక పేపర్లలో లేదా టివి ఛానల్లకే పరిమితమా లేదా ఆచారణలో పెడతారా వేచి చూద్దాం



## ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవ ఏర్పాట్ల పర్యవేక్షణ

**తెలుగువెలుగు ప్రతినిధి, అశ్వారావుపేట:** అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వ విజయ్ బాబు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజులు జిల్లా స్థాయి ఉన్నతాధికారులతో కలిసి 21న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి చంద్రుగొండ మండలం బెండాలపాడు గ్రామంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమం కోసం సభాప్రాంగణం, వసతులు, భద్రతా చర్యలు, ప్రజా సౌకర్యాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.



---

## మనిషి ప్రాణాలను కాపాడే గొప్ప సేవ రక్తదానం





**తెలుగు వెలుగు ప్రతినిధి, అశ్వారావుపేట:** అనే భావంతో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ గారి ఆధ్వర్యంలో అశ్వారావుపేట ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించారు ఈ శిబిరంలో స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన యువకులు మహిళలు ప్రజా ప్రతినిధులు రక్తం దానం చేసి రక్తదానం మహాదానం అని నిరూపించారు. ఈ కార్యక్రమం ద్వారా సేకరించిన రక్తాన్ని ఆసుపత్రి రక్తనిధిలో భద్రపరిచి అత్యవసర సమయాల్లో పేదలు ప్రమాదంలో గాయపడిన వారు ప్రసవ సమయంలో అవసరం ఉన్న తల్లులకు ఉచితంగా అందించనున్నట్టు ఆసుపత్రి వైద్యులు తెలిపారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ గారు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానమని ఒక్క బాటిల్ రక్తం ముగ్గురికి ప్రాణం పోస్తుందన్నారు ప్రతి ఆరోగ్యవంతుడూ సంవత్సరానికి కనీసం ఒకసారి రక్తదానం చేస్తే ఎవరూ రక్తం కోసం ఇబ్బందులు పడరని చెప్పారు అలాగే ఇలాంటి సేవా కార్యక్రమాలలో ముందుకు రావాలని అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు ఈ క్రమంలోనే ఆసుపత్రిలో నూతన డిజిటల్ ఎక్స్ రే యూనిట్ ను ప్రారంభించారు ఈ కార్యక్రమంలో మండల నాయకులు వైద్య సిబ్బంది స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే 24 గంటలు మరింత అప్రమత్తంగా ఉండాలి

- భారీ వర్షాల వల్ల ప్రాణ నష్టం, ఆస్తి నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు మంత్రులు పొంగులేటి, తుమ్మల , సీ.ఎస్ తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్ష




**సంగారెడ్డి జిల్లా ఆగస్టు 14 తెలుగు వెలుగు ప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అంతటా అప్రమత్తంగా ఉండాలని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు తో కలిసి గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రులు ఆయా జిల్లాల కలెక్టర్ లు, పోలీస్ కమిషనర్ లు, ఎస్పీలతో వరద పరిస్థితులపై సమీక్ష జరిపారు. భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తున్నందున ఎక్కడ కూడా ప్రాణ నష్టం, ఆస్తి నష్టం సంభవించకుండా, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగానే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రులు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు వీలుగా అన్ని జిల్లాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించడం జరిగిందన్నారు.అవసరమైన చోట ఈ నిధులను వెచ్చించాలని, ఇంకనూ అవసరమైతే నిధులు కేటాయిస్తామని, నిధుల సమస్య ఎంతమాత్రం లేదని స్పష్టం చేశారు. గడచిన మూడు రోజుల్లో కొన్ని ప్రాంతాల్లో ఊహించిన దానికంటే ఎక్కువ, మరికొన్ని ప్రాంతాల్లో తక్కువ వర్షపాతం నమోదైందని వీటిని దృష్టిలో పెట్టుకొని వచ్చే రోజుల్లో తగిన జాగ్రత్చలుతీసుకోవాలన్నారు. సహాయక చర్యలు పర్యవేక్షించేందుకు గాను ఉమ్మడి పది జిల్లాలకు సీనియర్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించడం జరిగిందని తెలిపారు. సెలవులో ఉన్న అధికారులు, సిబ్బంది సెలవులను రద్దు చేసి వెనక్కు పిలిపించాలని, వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ప్రాంతాలలో చేపట్టవలసిన రక్షణ చర్యల గురించి ఆదేశాలు జారీ చేశారు. రైల్వే లైన్లు, లోలెవెల్ బ్రిడ్జీలు, కాజ్‌వేలు, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి వర్షం నీరు నిల్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యంగా లోలెవెల్ బ్రిడ్జీల దగ్గర పోలీసు సిబ్బందిని నియమించాలని సూచించారు. అంటువ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే త్రాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చిన్న చిన్న వర్షాలు 200 మిల్లీమీటర్లకే బ్యాక్ వాటర్ వల్ల అక్కడున్న ప్రజలను తరలించవలసి వస్తుందని దీనికి శాశ్వత పరిష్కారం కోసం అక్కడున్నవారిని తరలించి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కలెక్టర్లకు సూచించారు. వర్షాలకు విద్యుత్ వైర్లుతెగిపోయినట్లైతే, తక్షణమే విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని, రోడ్లు తెగిపోయినచోటప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా ట్రాఫిక్ అంతరాయం లేకుండా, సాధారణ జన జీవనానికి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరా పై ప్రత్యేక దృష్టి సారించాలని, తాగునీరు కలుషితం కాకుండా పర్యవేక్షణ చేయాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పని చేస్తూ భారీ వర్ష పరిస్థితిని సమర్ధవంతంగాఎదుర్కోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రావీణ్య మాట్లాడుతూలి ... జిల్లాలో సాధారణ స్థాయిలోనే వర్షాలు కురుస్తున్నాయని, గురువారం ఉదయం సగటున 3.9 ఏం .ఏం వర్షపాతం నమోదైందని మంత్రులు, సీ.ఎస్ దృష్టికి తెచ్చారు. జిల్లాలో పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని, అయినప్పటికీ రానున్న 24 గంటల పాటు భారీ వర్ష సూచన దృష్ట్యా అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేశామని, ఎలాంటి పరిస్థితి తలెత్తిన సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది సన్నద్ధమై ఉన్నారని తెలిపారు. ఇప్పటికే అధికారులు, సిబ్బంది సెలవులను రద్దు చేశామని, ముందస్తుగా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు గురువారం సెలవు ప్రకటించినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల ల ప్రభుత్వ అధికారులు సిబ్బంది అందరూ కార్యస్తానాలలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. జిల్లాస్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కంట్రోల్ రూమ్ గురించిన సమాచారం విస్తృతస్థాయిలో ప్రచారం చేసి ప్రజలకు ఎక్కడైనా వర్షాల కారణంగా ఇబ్బందులు సమస్యలు తలెత్తిన వెంటనే కంట్రోల్ రూమ్ 08455 276155 కు ఫోన్ చేసి చెప్తే సమస్య పరిష్కరించేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ముందుజాగ్రత్తగానారాయణఖేడ్ జహీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని రోడ్డు సౌకర్యం సరిగా లేని మారుమూల ప్రాంతాలకు చెందిన గర్భిణీ స్త్రీలను ముందు జాగ్రత్తగా ఆసుపత్రులకు తరలించి సాంద్ర చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ, విద్యుత్ నీటిపారుదల శాఖ వైద్య ఆరోగ్యశాఖ పోలీస్ శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తూ పరిస్థితులు తక్షణ పరిస్థితులకు అనుగుణంగా సహాయక చర్యలు చేపట్టడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) చంద్రశేఖర్ , సంబంధిత శాఖ ల అధికారులు పాల్గొన్నారు .

## ఆలేరు నియోజకవర్గ పెన్షన్ దారుల నియోజకవర్గ సదస్సు విజయవంతం

**యాదాద్రి భువనగిరి ఆగస్టు 14:** యాదాద్రి ఆలేరు చేయూత పెన్షన్ దారుల నియోజకవర్గ సదస్సు విజయవంతం. అనంతరం పేద వర్గాల ఆశాజ్యోతి వికలాంగుల హక్కుల పోరాట సమితి (విహెచ్పీఎస్), చేయూత పెన్షన్ దారుల హక్కుల పోరాట సమితి (సిపిహెచ్పీఎస్),ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగతో ఎమ్మార్పియస్ జిల్లా ఇంచార్జీ బిర్రు మహేందర్ మాదిగ,ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ,ఎమ్మార్పియస్ తొలితరం నేత జాతీయ నాయకులు కందుల శంకర్ మాదిగ,ఎమ్మార్పియస్ జిల్లా అధ్యక్షులు దుబ్బ రామకృష్ణ మాదిగ,ఎమ్మార్పియస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్ మాదిగ,ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి సందేల శ్రీనివాస్ మాదిగ,సీనియర్ నాయకులు బెంజిమెన్ తదితరులు పాల్గొన్నారు



## లంబాడీ హక్కుల పోరాట సమితి,గిరిజన విద్యార్థి సంఘం నూతన మండల కమిటీ ఎన్నిక




**యాదాద్రి భువనగిరి ఆగస్టు 14:** యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండల కేంద్రంలో లంబాడి హక్కుల పోరాట సమితి మరియు గిరిజన విద్యార్థి సంఘం మరియు లంబాడి హక్కుల పోరాట సమితి యువజన విభాగం నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షులుగా ఇస్లావత్ క్రిష్ణ నాయక్ ని,మరియు గిరిజన విద్యార్థి సంఘం మండల అధ్యక్షులు దేవేందర్ నాయక్ మరియు లంబాడి హక్కుల పోరాట సమితి యువజన విభాగం మండల అధ్యక్షులు మాలోత్ పరమేష్ , ఎల్హెచ్పిఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మలోత్ నరేష్ నాయక్, ఉపాధ్యక్షులు వడ్త్యా భాస్కర్ నాయక్, ప్రధాన కార్యదర్శి ధీరావత్ స్వామి, కార్యదర్శి రాహుల్ నాయక్,యువజన విభాగం ధీరావత్ అవినాష్ ఉపాధ్యక్షులు, మేఘవత్ శ్రీకాంత్ వర్కింగ్ ప్రెసిడెంట్, మలోత్ జేతిరామ్ ప్రధాన కార్యదర్శి, గిరిజన విద్యార్థి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ధీరావత్ జయరాం నాయక్, ధీరావత్ నర్సింహ ప్రధాన కార్యదర్శిగా నియామక పత్రాన్ని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్య సంతోష్ నాయక్ అందజేశారు. ఈ కార్యక్రమంలో భవిష్యత్తు కార్యచరణని, డిమాండ్ ను చర్చించడం జరిగింది.ఈ కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు ధీరావత్ రవి నాయక్, రాష్ట్ర కార్యదర్శి శ్రీహరి నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు లింగ నాయక్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శేఖర్ నాయక్, ఎల్హెచ్పిఎస్ రమేష్ నాయక్,జి వి ఎస్ జిల్లా నాయకులు అరుణ్ నాయక్, దేవేందర్ నాయక్, హరి మోహన్ నాయక్,పండు నాయక్, భాస్కర్ నాయక్, వెంకట్ నాయక్ మేడ్చల్, రాజు నాయక్, రమేష్ నాయక్,రాజు, శ్రీను, రమేష్, కోటి, నను, రాహుల్, సంజయ్, జేతురం,తిరుపతి,నరసింహ, నరేష్ నాయక్, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం



# మనసుతో బతికే మా మంచి మనిషి నర్సిరెడ్డి!




**-అమరయ్య, అడవిపాలెం(సీనియర్ జర్నలిస్ట్)**

1984 మే 13.. మా ఊరు అడవిపాలెం.. ఉమ్మడి ప్రకాశం జిల్లా సంతమాగులూరు మండలం.. వెల్లలచెరువు దగ్గర బస్ దిగి నాలుగైదు కిలోమీటర్లు కాళ్లకి పని చెబితేగాని ఆ ఊరు రాదు. మట్టి రోడ్డు, మండు వేసవి. పొద్దున పదింటికే ఎండ చిటపటలాడుతోంది. గతుకుల రోడ్డుపై ఓ పెద్దాయన స్కూటర్ వెనక సీట్లో కూర్చొని అడవిపాలెం చేరారు. పాల నురగలాంటి తెల్లటి లూజు, లూజు లాల్చీ పైజమా.. మెళ్లో రంగూన్ రౌడీ మాదిరి రంగురంగుల మఫ్లర్, ఓ చెంపపై కందిగింజంత పుట్టుమచ్చ, సంకలో నల్లటి బ్యాగు, అందులో ఓ రేడియో.. ఆ భారీకాయాన్ని చూసి ఈయనెవరో పెద్ద మనిషేలెమ్మని నలుగురైదుగురు మా ఊరోళ్లు ఎదురెళ్లి.. రండి, రండంటూ తీసుకొచ్చి పెళ్లి పందిరి కింద ఓ పాత ఇనప కుర్చీలో కూర్చోబెట్టారు. అసలు పేరు చెప్పకుండా ఈ ఉపోద్ఘాతం ఏమిటనేగా మీ సందేహం. చెబుతా..ఆ పెద్ద మనిషే యన్నం వెంకట నర్సిరెడ్డి (వెంకట అంటే ఊరుకోరు, వేంకట అనాలంటారు). మా ఊర్నుంచి నరసరావుపేటకు పోతుంటే మొగదల్లో ఉప్పలపాడు వస్తుంది. ఆ ఊరికి మూడు పదుల ఏళ్లపాటు సర్పంచ్. ఆ ఊళ్లో ఆయన చెప్పిందే వేదం. ఈ మనిషి రోడ్డు మీద బస్ దిగి బజార్లో నడుస్తుంటే ఇళ్ల ముందు అరుగుల మీద కూర్చున్నోళ్ళు లేచి నిల్చునే రోజులవి.పైగా, మాజీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డికి, ఆయన సోదరుడు వెంగళరెడ్డికి, ఆయన వారసుడు కాసు కృష్ణారెడ్డికి తల్లో నాలుకలా ఉండేవారు. గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్. వసుధా కాంగ్రెస్ వాది. కమ్యూనిస్టులంటే వ్యతిరేకత లేదు గాని పొరపాటున కూడా వాళ్లకి ఓటేసి ఉండడు. మహాకవి శ్రీ.శ్రీ. మొదలు కృష్ణశాస్త్రి వరకు అందర్నీ అరివీరభయంకరంగా చదివిన వారు. నెహ్రూ అనుచరుడేమో సోవియెట్ యూనియన్ పట్ల సానుకూలత ఉండేది. అటువంటి ఉన్నతుడు.. తాళీ మంత్రతంత్రాలు లేని నా కమ్యూనిస్టు పెళ్లికి వచ్చారు. మా ఆనందరావు మాస్టారు, వాళ్ల పిల్లల్లో రెండోవాడైన నా చెలికాడు శ్రీధర్, అతని తమ్ముడు అలక్ చంద్రుడు, మిత్రుడు బాషా వస్తూ ఏల్చూరు నుంచి తెచ్చిన ఎర్రజెండాలు కట్టిన తాటాకు పందిరి కింద మట్టిమరస దిబ్బపై వేసిన ఎగుడు దిగుడు కుర్చీలో కూర్చొని.. "మీరందరూ భలే విచిత్రమైన వాళ్లయ్యా.. నీదేమో కమ్యూనిస్టు పెళ్లా!, మీ తమ్ముడిదేమో (గోవిందయ్య) మంత్రాల పెళ్లా!" అని మందహాసంతో ఓ చురకేశారు. "నువ్వేమో గాని ఒకే రోజు రెండు రకాల పెళ్లికి ఒప్పుకున్నాడే మీ నాన్న రత్తయ్య గొప్పోడయ్యా" అంటూ పొగడ్డంతో.. మురిసిపోవడం ఆ మట్టిమనిషిని వంతైంది."పోన్లే.. కమ్యూనిస్టనిపించుకున్నావ్" అంటూ, పెళ్లి పెద్దలుగా వచ్చిన నరసరావుపేట వాసి, హేతువాది ఎస్వీ రావును, నరసరావుపేట మున్సిపల్ వైస్ ఛైర్మన్ వై.చెంచయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి, మా ఊరివాసి, మేమందరం మామయ్య అని పిలిచే గోగినేని సూర్యంను పలకరించి కుశలాలు కనుక్కున్నారు. ఇంతలో మా అందరి బంధువు, ఉమ్మడి స్నేహితుడు టి. నరసింహారావును పిలిచి.. "మొత్తానికి విశాలాంధ్ర అమరయ్యని తోడల్లుణ్ణి చేసుకున్నావన్న మాట".. అంటూ ఓ చెణుకు విసిరాడు. వాళ్లిద్దరి మధ్య బోలెడంత దోస్తానా ఉండడంతో వేరెవ్వరూ వాళ్ల మాటల మధ్యలోకి దూర్లేదు.పెళ్లి తంతు ముగిసింది. ఆయన తిండి తిన్నాడో లేదో నేను చూడకుండానే వచ్చిన స్కూటర్ మీద వెళ్లిపోయారు. మా బాబూరావు (విశాలాంధ్ర), మా మామ రఘురామిరెడ్డి, మిత్రులు విజయరావు, ప్రభాకర్ కి ఏమైనా చెప్పారో లేదో మరి. ఇక్కడ సీన్ కట్ చేస్తే..మే 14.. ఉదయం 11 గంటలు దాటిన తర్వాత మేమందరం రెండు జీపుల్లో మా అత్తగారి ఊరు పెదపాలెం బయల్దేరాం. ఉప్పలపాడు దగ్గరికొచ్చే సరికి పెళ్లికొడుకు ముందున్న జీప్ నేరుగా నరసరావుపేట పోకుండా ఆ ఊళ్లోకి మళ్లింది. దాన్ని రెండోది కూడా ఫాలో అయింది. ఈ రెండు జీపులు ఓ పెద్ద మిద్దె ముందు ఆగాయి. ఏమైందా అనుకునే లోపు ఆ ఇంట్లోంచి ఆజానుబాహుడైన నర్సిరెడ్డి గారు ఎదురొచ్చి మమ్మల్ని ఇంట్లోకి తీసుకెళ్లడంతో విషయం అప్పుడర్థమైంది. మా తోడల్లుడైన నరసింహారావుకి ఈ విషయం ముందే తెలుసని, నర్సిరెడ్డి గారింట్లో మధ్యాహ్న భోజనం చేసి ఎండ చల్లబడ్డాక పెదపాలెం వెళతామని.. ఈ భోజన కార్యక్రమాన్ని వాళ్లిద్దరూ ముందే ఫిక్స్ చేశారట. ఆ ఇంటి మహాలక్ష్మి గారి చేతివంట.. ముద్దపప్పు, మామిడికాయ పచ్చడి, చారెడు నెయ్యి, పప్పుచారు, గడ్డ పెరుగు.. ఆ మోస్తరుగా తిండి తిన్న తర్వాత అందరూ ఆవలింతలు మొదలు పెట్టారు. నట్టింట్లో చాపలేసుకుని పడుకుని ఓ కునుకు తీశారు. పొద్దుగూకుతున్న వేళ జీపుల్లో మా ప్రయాణం మళ్లీ మొదలైంది. పెదపాలెం చేరేపాటికి చీకటైంది. ఇదంతా ఎందుకంటే.. నర్సిరెడ్డి గారి హృదయం ఎంత గొప్పదో, ఎంతటి ఉదాత్తుడో, సౌమ్యుడో చెప్పడానికే. మంచి చదువరి. జ్ఞాన సంపన్నుడు. అంతమాత్రాన ఆయన అందరికీ మంచివాడు కావాలన్న రూలేమీ లేదు. అలా ఉండాలనుకోవడం కూడా భ్రమే. నర్సిరెడ్డి గారితో నా పరిచయం 1980ల నాటిది. నేనప్పటికి జర్నలిస్టును కాను. ఆయన గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్. నేను గుంటూరు ఓవర్ బ్రిడ్జి పక్కనుండే విశాలాంధ్ర బుక్ హౌస్ లో సేల్స్ మెన్. పుస్తకానికి పాఠకునికి ఉండే బంధం మాది. ఆయన నరసరావుపేటలో రైలెక్కి గుంటూరు స్టేషన్ లో దిగి ఎవరెవర్నో పలకరించి సాయంత్రానికి విశాలాంధ్రకి చేరతారు. వస్తూనే తానో ఛైర్మన్ అని కూడా చూడకుండా ఓ స్టూలు మీద కూర్చుని ఆ పుస్తకం ఈపుస్తకం తిరగేస్తాడు.ఆ మహాకవి ఇలా అన్నాడు.. ఈ కవి ఇలా ఉన్నాడంటూ.. ఎందరెందర్నో జ్ఞాపకం చేస్తాడు. ఏవేవో గుర్తు చేస్తాడు. ఠక్కున తన సంచిలో రేడియో తీసి.. ఇది కాసు బ్రహ్మానందరెడ్డి గారు జపాన్ వెళ్లినపుడు నా కోసం తెచ్చిన పాకెట్ రేడియో.. అని చెబుతూ వార్తలు పెడతాడు. ఈలోగా విశాలాంధ్ర మేనేజర్ బాబూరావు వస్తే సరే సరి, లేకుంటే టీ తెప్పిస్తే తాగుతాడు. రైలు టైం అయిందని లేచి వెళ్లిపోతాడు. ఆయన గుంటూరంటూ వస్తే విశాలాంధ్ర బుక్ హౌస్ కి రాకుండా పోయింది చాలా తక్కువే.ఆయన్ని మా అందరికీ పరిచయం చేసిన వాడు టి. నరసింహారావు. గ్రంథాలయ సంస్థ ఉద్యోగి. ఆ తర్వాత సూపరింటెండెంట్ అయ్యారు. ఓ ఉద్యోగికి ఈ ఛైర్మన్ కి ఇంత సావాసం ఏమిటా అని ఆశ్చర్యపోయే వాళ్లం. అదే నర్సిరెడ్డి గారి ఔన్నత్యం. మనుషుల్ని, మనసుల్ని చదివిన వారు. సహృదయుడు. భారతదేశంలో పుట్టిన ప్రతి ఒక్కరూ ఏదో ఒక కులంలో పుట్టాల్సిందే. అంతమాత్రాన ఆ జాడ్యాలను అంటించుకోవాల్సిన పని లేదు. నర్సిరెడ్డి ఆ విధంగా మాకు ఆత్మీయుడు. కులాలకు, మతాలకు అతీతుడు. మనుషుల్ని నమ్మకపోతే మానుల్ని నమ్ముతామా అంటారు. 1972 నుంచి 1982 వరకు పదేళ్ల పాటు జిల్లా గ్రంథాలయ సంస్థకు ఛైర్మన్ గా ఉన్న కాలంలో ఉప్పలపాడు యువకులెందరెందరికో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు చూపించిన వారు.నిజానికి ఆయనకు పదవున్న కాలంలో విశాలాంధ్ర హవా కూడా నడిచిందనే చెప్పాలి. అయితే మా స్నేహసంబంధాలు వ్యాపారపరమైనవి కావు. హృదయసంబంధమైనవి. అందువల్లే ఆయనకు పదవి లేకపోయినా మా అనుబంధం కొనసాగుతోంది. మేమేమీ నిరంతరం మాట్లాడుకోం. అయినా మా స్నేహం మిగిలే ఉంది. ఒకరి మనసుల్లో ఒకరం ఉంటాం. ఒకర్నొకరు అర్థం చేసుకోగలుగుతాం. కీళ్ల నొప్పులతో బాధ పడుతున్నా, కదలలేని స్థితిలో ఉన్నా ఆయనకు గుర్తొచ్చినప్పుడు ఆయనో.. మాకు గుర్తొచ్చినపుడు మేమో పలకరించుకుంటుంటాం. బాగోగులు కనుక్కుంటుంటాం. ఆయన నిజంగానే ఆలిండియా రేడియో లాంటి వారు. ఆయన చెప్పింది వినడమే తప్ప నేను చెప్పేదేమీ ఉండదు. సీరియస్ జోక్స్ చెబుతారు. బాపూ రమణల సాంగత్యం ఎలా సాగిందో, వాళ్లు ఎలాంటి సినిమాలు తీశారో వివరిస్తాడు. నాకవి ఎప్పుడు విన్నా కొత్తగానే ఉంటాయి.ఒకసారి గుర్రం జాషువా ప్రస్తావన వచ్చింది. ఇక ఆయన సత్య హరిశ్చంద్ర నాటకంలోని కాటిసీను దాకా వెళ్లిపోయారు. చివర్లో లోహితాసుడు ఓ పద్యం పాడి చనిపోయే సీనది. ఆ క్యారెక్టర్ తాను పాడాల్సిన పాట పాడి కిందపడి పోతాడు. ఇంతలో ఆడియన్స్ లోని ఎవరో వన్స్ మోర్ అన్నారట. అప్పుడా నాటక ప్రయోక్త.. అయ్యా, లోహితాసుడు చనిపోయాడు, వన్స్ మోర్ అంటే మళ్లీ పాడలేడు అని చెప్పి సముదాయించాలని చూశారట. దానికా ప్రేక్షకుడు ఒప్పుకోకుండా.. చచ్చినోడు చచ్చినట్టు లేచి చచ్చినట్టు పాడి చచ్చినట్టు చావమన్నాట్ట.. ఈ జోక్ నర్సిరెడ్డి గారు చెప్పడం నేను కడుపుబ్బా నవ్వడం.. ఇలా ఉంటాయి ఆయన వేసే జోకులు. ఆయన చెప్పే ప్రతిదీ ఓ ఆణిముత్యమే. ఓ జ్ఞాపకమే. జీవితాన్ని కాచిపోసిన వాడు కావడం వల్ల జనసామాన్యానికి వంటబట్టే విషయాల్నే చెబుతుంటారు తప్ప లల్లాయి కబుర్లు కాదు. **లండన్‌లో శ్రీ.శ్రీ. పాట.. నర్సిరెడ్డి చేతిలో క్యాసెట్..**మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీ.శ్రీ)అన్నా, మహా రచయిత విశ్వనాథ సత్యనారాయణఅన్నా నర్సిరెడ్డికి మహాఇష్టం. శ్రీశ్రీ కవిత్వం ఆయన నాలుక మీదనే ఉంటుంది. శ్రీశ్రీ షష్టి పూర్తి మహోత్సవానికి బరంపురం కూడా వెళ్లివచ్చినట్టు అనేక సార్లు చెప్పారు. ఆయనతో దిగిన ఫోటో ఇప్పటికీ నర్సిరెడ్డి గారింట వేలాడుతుంటోంది. చేతిలో సిగరెట్ పట్టుకున్న శ్రీశ్రీతో ఈయన ఒదిగిన విద్యార్థిలా కనపడుతుంటారు. అలాంటి శ్రీ.శ్రీ. ఓసారి లండన్ వెళ్లారు. అక్కడ ఆయన మిత్రబృందం ఓ రోజు శ్రీశ్రీతో 'మహాప్రస్థానం' పుస్తకంలోని కవితలన్నింటినీ గానం చేయించారు. ఎన్ని గంటలు పట్టిందో తెలియదు గాని దాన్ని క్యాసెట్ గా తయారు చేసి మహాప్రస్థానం పుస్తకంతో పాటు ఓ బ్రహ్మాండమైన భరిణెలా ఉండే అట్టపెట్టెలో పెట్టి అమ్మకానికి పెట్టారు. నాకు గుర్తున్న వరకు క్యాసెట్ కూడిన ఆ మహాప్రస్థానం భరిణె ధర ఆ రోజుల్లోనే 750 రూపాయలనుకుంటా. దాన్ని వచ్చీ రావడంతోనే కొన్న మొదటి వ్యక్తి నర్సిరెడ్డి గారు. ఆ క్యాసెట్ ను చూసి ఎంత ముచ్చట పడిపోయే వారో.. ఆ క్యాసెట్ తీసి తన వద్ద ఎల్లప్పుడూ ఉండే టూ ఇన్ వన్ రేడియో కమ్ టేప్ రికార్డర్ లో పెట్టి వినిపించడం ఆయన అలవాటు. ఇది శ్రీశ్రీ సొంత గొంతండీ అని అందరికీ చెబుతుంటారు. అలాగే విశ్వనాథ సత్యనారాయణ గారి వేయి పడగలు నవల గురించి కూడా.. జమిందారీ వ్యవస్థ పతనావస్థను విశ్వనాథ సత్యనారాయణ ఓ రేంజ్ లో చెబితే దాన్ని మరింత వివరిస్తారు నర్సిరెడ్డిగారు.సాహిత్యం అంటే చెవి కోసుకునే ఆయన ప్రేమాస్పదుడు. అటు మితవాద ఇటు తీవ్రవాద కవుల్ని, వ్యక్తుల్ని ఆరాధించే ఔదార్యం ఆయనలో ఉంది. ఆయనతో కలిసి ఓసారి విశాఖపట్నంలో జరిగిన గ్రంథాలయ వారోత్సవాలకో, మరో కార్యక్రమానికో విశాఖపట్నం వెళ్లిన గుర్తుంది. రైల్లో మా ప్రయాణం. విశాఖపట్నంలో ఓ పెద్ద హోటల్లో బస. ఆయన తనకు తెలిసిన వారికెవరికో చెబితే వాళ్లు కారు పంపించారు. మరెవరికో చెబితే విశాఖపట్నం పోర్టు చూపించారు. విశాఖపట్నం జగదాంబ సెంటర్ లోని విశాలాంధ్ర బుక్ షాపు మీదుగా ఆర్కే బీచ్ చూసుకుని వచ్చేవాళ్లం. అలా మూడు రోజులు ఆయనతో కలిసి గడిపే అవకాశం దక్కింది. గదికి చేరిన తర్వాత ఆయన ఎక్కడెక్కడి కవుల్నో, రచనల్నో కోట్ చేస్తుండేవారు. సాహిత్య కృషిలో విశాఖపట్నం ఎంత అద్వితీయ పాత్ర పోషించిందో చెప్పేవారు. గురజాడ, శ్రీ.శ్రీ. పురిపండా అప్పలస్వామి, చాసో లాంటి వాళ్లంటే ఆయనకు పిచ్చి ప్రేమ. ఇలా తనకు తెలిసింది నలుగురికి చెప్పి సంబరపడుతుంటారు. **ఎంత ఎదిగినా ఒదిగి ఉండడం ఆయన లక్షణం...**ఏ కారణం వల్లనో నర్సిరెడ్డి ఎక్కువ చదువుకోలేదు. ఐదో తరగతితోనే ముగించారు. ఎప్పుడైనా ఆయన్ని ఈ విషయం అడిగితే మా స్కూలు హెడ్మాస్టర్ ఆరో తరగతిలో సీటు ఇవ్వకపోవడం వల్లే నేను ఈ మాత్రమైనా చదివానని చమత్కరిస్తారు. ఆరో తరగతిలో చేరడానికి వెళితే ఆ హెడ్మాస్టరు ఎవరో కుదరదన్నాడట. దాంతో ఆయన నరసరావుపేటలోని లైబ్రరీకి వెళ్లి రోజూకో పుస్తకం పూర్తి చేసి వచ్చేవాడట. సగటున 500 పేజీలు చదివానని ఆయన చెప్పినట్టు గుర్తు. అటువంటి వ్యక్తిని కాసు వెంగళరెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థకు ఛైర్మన్ గా నియమిస్తే సభ్యులుగా అవధానులు, అష్టావధానులు, సంస్కృత పండితులు, మహా కవులు ఉండేవారట. వారిలో జమ్మలమడుగు మాధవరాయ శర్మ, ప్రసాదరాయ కులపతి, డాక్టర్ పరుచూరి లాంటి వాళ్లందెరో ఉండేవారట. "నిజానికి వాళ్ల ముందు నోరు విప్పే అర్హత కూడా లేని నేనేమో ఛైర్మన్. వాళ్లేమో సభ్యులు. ఇదే కదా వైచిత్రీ. అందుకనే నేను వాళ్లున్నా లేకున్నా ఆ ఛైర్మన్ సీట్లో కూడా కూర్చోలేదు. పొరపాటున నేను ఆ సీట్లో కూర్చుంటే ఆ అహంకారం, పొగరు నా తలకెక్కడ ఎక్కుతుందోనని.. ఆ పక్కనే కుర్చీ వేసుకుని కూర్చొనే వాణ్ణి. మా ఉద్యోగులు కొందరు ఆ సీట్లో కూర్చుని మా జీతాల బిల్లుపైనైనా సంతకమైనా పెట్టండయ్యా అనే వారు. నా మనసు అంగీకరించేది కాదు" అని నర్సిరెడ్డి గారు చెబుతుంటే నాకు మతిపోయింది.తిన్నంటి వాసాలు లెక్కించే వాళ్లు, అక్షరాలు రాని నిరక్షరకుక్షులు నానా హంగామా చేస్తూ ఎడాపెడా అధికారాన్ని చెలాయిస్తూ డాబు, దర్పాన్ని ప్రదర్శించే రోజుల్లో.. ఇలాంటి సున్నిత మనస్కులు, వినమ్రులు, ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండే ఇలాంటి వాళ్లను చూడగలమా!. "నాకు ఆస్తి ఉంది గాని అక్షరం లేదుగా" అనేంతటి అక్షర ప్రేమికుణ్ణి, నిరాడంబరుణ్ణి చూడగలమా చదువున్నా సంస్కారం లేని మనుషులు మసలుతున్న కాలంలో నర్సిరెడ్డి లాంటి వ్యక్తులు మహా అరుదు.నర్సిరెడ్డికి తగ్గవాడే ఆయన కుమారుడు కూడా. కన్నవారి ఇష్టాలను గ్రహించిన వాడు. ఇక నర్సిరెడ్డి గారి సోదరి. డొక్కా సీతమ్మ తరహాలోనే ఆయన అక్క కూడా ఈయన పిలిచిన వారందరికీ వండి వడ్డించడం ఇష్టం. అతిథులు ఆనందంగా తింటుంటే తినకుండానే తను కడుపు నిండి పోయినట్లు భావించే సగటు పల్లెటూరు మనిషి ఆమె. నర్సిరెడ్డి గారు మంచి భోజన ప్రియుడు కూడా. నేను ఒక బిర్యానీని పూర్తిగా తినలేని రోజుల్లో ఆయన ఒకటి అవలీలగా తినేసి.. మీరేం కుర్రాళ్లండీ, ఒక్క బిర్యానీ కూడా తినలేరా అని ఆట పట్టించేవారు. ఇలా ఆయనతో ఎన్నో అనుభవాలు..1986లో నేను విశాలాంధ్ర బుక్ షాప్ వదిలి విశాఖపట్నం ఆంధ్రభూమిలో సబ్ ఎడిటర్ గిరీ వెలగబెట్టడానికి వెళ్లా. ఈ ఉద్యోగం ఇప్పించింది కూడా మా విశాలాంధ్ర బాబూరావే. మా ఇద్దరికీ ఉమ్మడి మిత్రుడే. ఆ తర్వాత పొట్టకూటి కోసం విజయవాడ, తిరుపతి, మళ్లీ విజయవాడ ఇలా కాలికిబలపం కట్టుకుని తిరిగా. చాలా కాలం ఆయన్ను కలవలేదు. అంతమాత్రన నేను ఆయన్ను గాని ఆయన నన్ను గాని మర్చిపోలేదు.2002లోనో 2003లోనో నేను గుంటూరు ఆంధ్రప్రభలో ఉండగా ఆ యజమానికి మాకు పడక ఉద్యోగం మానేయాల్సి వచ్చింది. కష్ట కాలంలోనే కదా మనుషుల తీరు బయటపడేది. నేను నమ్మినవాళ్లు, అప్పటి దాకా ఆహాఓహో అంటూ తెగ మెచ్చుకున్న వాళ్లు చాలా మంది- వీడెక్కడ ఏమడుగుతాడోనని మొహం చాటేసిన రోజులవి. సరిగ్గా ఆ సమయంలో ఓ రోజు సాయంత్రం నర్సిరెడ్డి గారు ఫోన్ చేసి "చేసిన బాకీలు తీర్చడం కోసం ఓ ఎకరం అమ్ముతున్నా, ఏమైనా డబ్బులు కావాలంటే చెప్పండి.. మొహమాట పడొద్దు.. అప్పేలే.." అన్నప్పుడు నా మనసు వికలమైంది. నా బాధలు ఈయనకు ఎలా తెలిశాయబ్బా అని ఆశ్చర్యపోయా. నా కోసం ఇంకొకర్ని బలి పెట్టడం నాకిష్టం ఉండదు. 'అంత అవసరం లేదు సర్, అవసరం ఉన్నప్పుడు కచ్చితంగా అడుగుతా..' అని నేనప్పుడు 'అప్పు తీసుకోవడానికి ఆత్మాభిమానం, మంచితనం అడ్డుకాకూడదు. తిరిగి తీర్చడానికే సిగ్గుపడాలంటూ' ఋణానందలహరి పుస్తకంలోని ముళ్లపూడి వెంకట రమణ రాసిన జోక్ చెప్పి చమత్కరించారు. ఆ మనిషికి నాకు ఏ బంధం ఉందని నన్ను ఆ మాట అడిగాడు అని తలచుకున్నప్పుడల్లా మనసు మూగబోతుంటుంది. అలా కాలగమనంలో నేను హైదరాబాద్ వచ్చి ఆగా.. ఆయన ఉప్పలపాడులో ఆగారు. సెల్ ఫోన్ల కాలం కదా. రోజువారీ జీవన పోరాటంలో నేను మునిగి తేలుతుంటే ఆయనెప్పుడో హఠాత్తుగా ఫోన్ చేసి.. అమరయ్య గారేనా!.. ఎలా ఉన్నారు పిల్లలెంతమంది, ఏం చేస్తున్నారు మీ ఊరి వైపు రావడం లేదా మా ఊరి మీదుగానే కదండీ మీ ఊరికి పోవాలి, ఒకసారి మీ విడిది ఇంటికి వచ్చి వెళ్లండి, అని అడిగేవారు. ఎన్ని సార్లు ఫోన్ చేసినా ఇవే ప్రశ్నలు, అదే ఆహ్వానం.. చెట్టుకొకరు, పుట్టకొకరవుతున్న కాలంతో పాటు మా ఊరితోనూ మూలాలు తెగిపోయే పరిస్థితి దాపురించింది. మా అమ్మా,నాన్న ఇద్దరూ కన్నుమూశారు. ఆత్మీయతలు, అనుబంధాలు, మమకారాలు ఆర్థికంతో ముడిపడ్డాయి. సొంతూరితో రాకపోకలు సన్నగిల్లాయి. అయినా మా ఇద్దరి మధ్య ఉన్న ఈ సన్నని దారం తెగకుండా ఇంతదూరం లాక్కొచ్చాం. గత 10,15 ఏళ్లలో ఒకట్రెండు సార్లు నేను ఉప్పలపాడు వెళ్లి పలకరించి వచ్చా. ఆ తర్వాత మళ్లీ కలవలేదు. ఫోన్లలోనే యోగక్షేమాలు నడిచాయి. ఈ మధ్య మోకాళ్ల నొప్పులు బాగా ఎక్కువయ్యాయని, ఎక్కడికైనా కదలాలంటే తోడు లేందే కుదరడం లేదని చెప్పారు. **2025 జనవరి 12.. సంక్రాంతి సందడి..** గుంటూరులో వాసిరెడ్డి సీతాదేవి రాసిన 'మట్టిమనిషి' నవలను సాహితీ మిత్రుడు వల్లూరి శివప్రసాద్ నాటకీకరించి వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ప్రదర్శిస్తున్నారని, తప్పకుండా రమ్మని మా మిత్రుడు, పెదకూరపాడు వాసి కొమ్మాలపాటి శరచ్చంద్ర జ్యోతిశ్రీ చెబితే నేనూ, ప్రజానాట్యమండలి నాయకుడు రాజేశ్వరరావు, నా మిత్రుడు గొర్రెపాటి రమేష్ చంద్రబాబు కార్లో బయలుదేరి వచ్చాం.సాయంత్రం 7 గంటలకు నాటకం. ఎందుకో మనసు పీకింది. నేను నా మనసులో మాట రమేష్ గారికి చెబితే.. అదెంత పని, పోయొద్దాం పద.. అన్నారు. పొద్దున 8 గంటల ప్రాంతంలో కారు పేరేచర్ల దాటిన తర్వాత నర్సిరెడ్డి గారికి ఫోన్ చేసి ఉప్పలపాడు వస్తున్నానని, ఓ అరగంట సేపు మీతో గడిపి వెళతామన్నా. 9 గంటల ప్రాంతంలో ఆ ఇంటికి చేరాం. అరచేతుల తెల్లచొక్కా, తెల్లప్యాంటు వేసుకుని .. ఋషి పుంగవుని మాదిరి చెక్క కుర్చీలో కూర్చొని ఉన్నారు. చూపు మందగించినట్టుంది. దగ్గరకు పోయేంత వరకు గుర్తుపట్టలేదు. ఎందరెందరికో ఉద్యోగాలు, మరెంతమందికో జ్ఞానం పంచిన మనిషి- మహాభారత గాథలో చెప్పినట్టు అస్త్రశస్త్రాలు వదిలేసిన కర్ణుడి వలే వడలినట్టు- కనిపిస్తున్నారు."సార్, బాగున్నారా" అంటూ నా మిత్రుడు రమేశ్ ని పరిచయం చేశా. "మా అమరయ్యేనా.. ఏం మార్లేదు, మీసాలు పెంచారంటూ", నా చేతిని తన చేతిలోకి తీసుకుని ఓ ఆత్మీయ పరామర్శ చేశారు. ఆ స్పర్శలో ఎన్ని భావాలు మెదిలాయో మా ఇద్దరికే అర్థమవుతుంది. పేరు పేరునా అందరి బాగోగులు అడిగారు. బాబూరావును, కొండయ్యను, శ్రీధర్ ను, నరసింహారావును గుర్తుచేశారు. ధ్యానులకు జ్ఞాన జగతిలో మైమరచిపోవడం ఇష్టమంటారు కదా. అలా తాను కూర్చున్న చోటు నుంచి లేచి తన ఇంటి గోడకు వేలాడుతున్న స్వాతంత్ర్య సమరయోధుల్నీ, మహాకవులతో తాను తీయించుకున్న ఫోటోలను, సేకరించిన పుస్తకాలను చూపారు. నేను రాసిన "భారతీయ జర్నలిజం ధృవతార మానికొండ చలపతిరావు" పుస్తకాన్ని ఆయన చేతికిచ్చా. 'విశాలాంధ్రలో పుస్తకాలమ్మిన మా అమరయ్య పుస్తకాలు రాసే స్థాయికి ఎదిగారండీ' అంటూ.. ఒకింత సంబరపడుతూ నా మిత్రుడి వైపు చూడడం ఓ మధుర జ్ఞాపకం. మనుషులంటే ఆయనకెంత ప్రేమో అర్థమవుతుంది.ఇప్పుడాయన వయసు 80 ఏళ్లు. పాత గురుతులు మసకబారుతున్నాయి. మనసు ఊహాలోకంలో విహరిస్తోంది. మాటలు ముద్దబారుతున్నాయి. ఆయన అభిరుచులకు తగినట్లుంచడానికి కుమారుడు ఇష్టంతో కష్టపడుతున్నాడు. మంచితనం పరిడవిల్లుతోంది. ఇంతలో టీ వచ్చింది. నలుగురం తాగాం. నేను విడిది చేసిన ఇంటి స్థానంలో కొత్త డాబా కళకళలాడుతోంది. మా పాత జ్ఞాపకాల దొంతర కదలాడింది. సరిగ్గా అప్పుడు.. "మన అనుభవాలన్నింటినీ కలిపి ఓ మంచి వ్యాసం రాయడం మర్చిపోవద్దు.. అన్నీ నోట్ చేసుకుని మరీ రాయండంటూ"నే.. జర్నలిస్టుకి నేను చెప్పడమేమిటంటూ ఓ చమక్కు విసిరారు.ప్రస్తుత లెక్క ప్రకారం భారతీయ పురుషుని సగటు ఆయుర్దాయం 72 ఏళ్లు. నర్సిరెడ్డి గారికి ఇప్పుడు 80 ఏళ్లు. సంప్రదాయాల పట్ల విశ్వాసం ఉన్న వాళ్లు- 77 ఏళ్ల, 7 నెలల, 7 రోజులు పూర్తి చేసుకున్న వారికి- భీమ్ రథారోహణం లేదా భీమ రథ శాంతి చేస్తుంటారు. అదే 80 ఏళ్లు పూర్తి చేసుకుని 81లోకి ప్రవేశించే వారికి సహస్ర పూర్ణ చంద్రోదయ పూజ చేస్తుంటారు. ఒక వ్యక్తి తన జీవిత కాలంలో 1000వ పౌర్ణమిని పూర్తి చేయడమే ఈ పూజ విశిష్టత. భారతదేశంలో ఇది 81వ సంవత్సరంలో వస్తుంది. ఇదో ప్రత్యేక సందర్భం.వృద్ధాప్యంలో మానసిక, శారీరక బలాన్ని పెంచడానికి ఇలాంటి కార్యక్రమాన్ని నర్సిరెడ్డి గారి కుటుంబ సభ్యులు నిర్వహించాలనుకోవడం అభినందనీయం. ఈ సందర్భంగా నన్ను ఓ వ్యాసం రాయమని స్వయంగా నర్సిరెడ్డి గారే కోరడం- ఆయన మనసులో నాకున్న స్థానానికి నిదర్శనం. అందుకు వారికి కృతజ్ఞతలు. నర్సిరెడ్డి గారు నిండు నూరేళ్లు సంపూర్ణ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనసారా కోరుకుంటున్నా. మనసుతో బతికినంత కాలం మనుషులకు మరణాలు ఉండవు. అటువంటి వారిలో మా యన్నం వెంకట నర్సిరెడ్డి గారొకరని గర్వంగా చెప్పుకుంటా!

# ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పటిష్ట భద్రత ఏర్పాట్లు



**కడప ఆగస్టు 14:-** పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పిటిసి ఉప ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో గురువారం స్థానిక మౌలానా ఆజాద్ ఉర్దూ పాలిటెక్నిక్ కళాశాల కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. జిల్లా ఎస్.పి ఇ.జి అశోక్ కుమార్ కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించి బందోబస్తును పర్యవేక్షించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద, పరిసర ప్రాంతాలలో అత్యాధునిక డి.జె.ఐ మాట్రిక్స్ డ్రోన్ కెమెరాతో పాటు సి.సి కెమెరాలతో నిఘా ఉంచారు. జిల్లా ఎస్.పి స్వయంగా డ్రోన్ ఎగురవేసి కవరేజ్ ఏరియా ను విహంగ వీక్షణం ద్వారా పరిశీలించారు. అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని పోలీస్ అధికారులు, సిబ్బందికి సూచించారు. జిల్లా ఎస్.పి వెంట స్పెషల్ బ్రాంచ్ డి.ఎస్.పి ఎన్.సుధాకర్, ఏ.ఆర్ డి.ఎస్.పి శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ దారెడ్డి భాస్కర్ రెడ్డి, పోలీస్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

# విశిష్ట సేవలకు గుర్తింపుగా ఇచ్చే ప్రతిష్టాత్మక సేవాపతకానికి సి.సి.ఎస్ ఎస్.ఐ ప్రకాష్ రావు ఎంపిక

● అభినందించిన జిల్లా ఎస్.పి ఇ.జి అశోక్ కుమార్



**కడప ఆగస్టు 14:-** శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ అధికారులు, సిబ్బంది చేస్తున్న సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం అందించే ప్రతిష్టాత్మక విశిష్ట సేవా పతకాన్ని కడప సి.సి.ఎస్ ఎస్.ఐ బి.ప్రకాష్ రావు కు ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి ఇ.జి అశోక్ కుమార్ ఎస్.ఐ ప్రకాష్ రావు ను ప్రత్యేకంగా అభినందించారు. బి.ప్రకాష్ రావు 1984 వ సంవత్సరంలో జిల్లా పోలీస్ శాఖలో కానిస్టేబుల్ గా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలో పులివెందుల, మైదుకూరు, మన్నూరు, ప్రొద్దుటూరు, కడప ట్రాఫిక్, కడప వన్ టౌన్ తదితర పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వర్తించి ఉన్నతాధికారుల ప్రశంశలు పొందారు. అంకిత భావం తో విధులు నిర్వర్తించినందుకు తన సర్వీస్ లో మొత్తం 45 నగదు రివార్డులు, 38 జి.ఎస్.ఈ లను ఉన్నతాధికారుల నుండి అందుకున్నారు.

# రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి: అధ్యక్షులు లయన్ పసుపులేటి శ్యామ్




**రాయచోటి ఆగస్టు 14:-** లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో వంగిమళ్ళ సుబ్బరాయుడు కి గుండె సంబంధిత వ్యాధితో ఇబ్బంది పడుతూ రక్తం అవసరమని తెలిసిన వెంటనే లయన్స్ క్లబ్ సభ్యులు దాత తిరుమల అనిల్ కుమార్కి తెలిపిన వెంటనే వారు రాయచోటిలోని శ్రీ దీప బ్లడ్ సెంటర్ నందు రక్తదానం చేయడం జరిగిందని అధ్యక్షులు పసుపులేటి శ్యామ్ తెలిపారు. అనంతరం దాత తిరుమల అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అవసరానికి రక్తదానం చేయాలని అలాగే నాలుగు నెలలకు ఒకసారి రక్తదానం ఇవ్వడానికి తను ఎప్పుడు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లయన్ వి.హరీష్ చంద్ర శ్రీ దీప బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

# బీహార్ రాష్ట్రం తరహాలో పులివెందుల ఒంటిమిట్ట జడ్పిటిసి ఉపఎన్నికలు

● వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి




**కడప ఆగస్టు 14:-** రాష్ట్రంలో ఎన్నో జెడ్పీటీసీ స్థానాలు ఖాళీగా ఉన్నా ఎంపిక చేసుకుని కొన్ని స్థానాలకే ఎన్నికలు జరిపారని అలాగే ఈ ఎన్నికలు బీహార్ రాష్ట్రం హాలో పులివెందుల జడ్పిటిసి ఉప ఎన్నికలు జరిగాయని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. గురువారం ఈ సందర్భంగా కడప నగరంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూబీహార్ రాష్ట్ర తరహాలో పులివెందుల జడ్పిటిసి ఉపఎన్నిక జరిగింది. ఆయుధాలను చూపి ప్రజలను బెదిరించి ఎన్నికల్లో రిగ్గింగ్ కు పాల్పడ్డారన్నారు. ఎన్నికల్లో కలెక్టర్ సమక్షంలోనే దొంగ ఓట్లు వేశారు. అదే ఫోటోను నారా లోకేష్ ప్రజాస్వామ్యం గెలిచిందని ట్వీట్ చేసారు. అక్కడే అర్థం అయింది ఎంత దారుణంగా ప్రజాస్వామ్యం ఖూనీ చేశారని. ప్రజలను ఓటు వేసేందుకు వస్తుంటే బయటకు రాకుండా పోలీసులు అడ్డుకున్నారన్నారు. ఈ ఎన్నికలను రద్దు చేసి కేంద్ర బలగాలతో తిరిగి నిర్వహించాలి. టీడీపీ నేతలు సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రజలను మభ్య పెడుతూ అప్రజాస్వామికంగా ఎన్నికలు జరిపి సంబరాలా చేసుకోవడం ఆశాస్వదంగా ఉందన్నారు.

## కామ్రేడ్ శివన్న కుటుంబాన్ని సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పరామర్శ



**ఉరవకొండ ఆగస్టు 14:-** ఈనెల 6వ తేదీన అనారోగ్యంతో మరణించిన సిపిఐ పార్టీ ఉరవకొండ నియోజకవర్గం సీనియర్ నాయకులు కామ్రేడ్ శివన్న ఇంటిని గురువారం సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ సందర్శించి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. శివన్న మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. శివన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కేశవరెడ్డి, పార్టీ నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జున, నాయకులు సుల్తాన్, సంగప్ప, చిరంజీవి పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యం గెలిచింది టిడిపి అభ్యర్థులు విజయం సాధించారు

● టిడిపి ఇన్చార్జి మంత్రి సవిత



**కడప ఆగస్టు 14:-** పులివెందుల, ఒంటిమిట్ట జడ్పిటిసి ఎన్నికల్లో ప్రజాస్వామ్యం గెలిచిందని, టిడిపి అభ్యర్థులు భారీ మెజార్టీ సాధించారని జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత పేర్కొన్నారు. గురువారం హెూటల్ హరిప్రియలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పులివెందులలో 40 ఏళ్లుగా స్థానిక ఎన్నికల్లో వైయస్ కుటుంబం దోచుకోవడం దాచుకోవడం ద్వారా భయపెట్టి గెలిచేదని తెలిపారు. పులివెందులలో బీటెక్ రవి ధైర్యంగా తన భార్యని ఎన్నికల్లో నిలబెట్టారని చెప్పారు. అదే నమ్మకంతో కూటమి సహకారంతో ఆమె భారీ మెజార్టీతో గెలిచిందని పేర్కొన్నారు. ఇంటింటికి వెళ్లి ధైర్యంగా ఓట్లు వేయమని ప్రజలకు చెప్పడంతో వారు ధైర్యంగా వచ్చి ప్రజాస్వామ్యబద్ధంగా ఓటును మొదటిసారి వేశారని తెలిపారు. అవినాష్ రెడ్డి ఇంటింటికి వచ్చి ఓటు వేయమని సేవ్ డెమోక్రసీ అడుగుతుంటే ప్రజలు నవ్వుకున్నారని గుర్తు చేశారు. జగన్మోహన్ రెడ్డి, అవినాష్ రెడ్డి గెలవమని తెలుసుకుని 4 రోజులు నుంచి డ్రామాలాడుతూ ఎన్నికలు రద్దు చేయాలంటున్నారని విమర్శించారు. రెండు స్థానాలు రీపోలింగ్ అన్నారు, మళ్లీ రీపోలింగ్ జరిపారని పపేర్కొన్నారు. ఇప్పుడు ఎన్నికలను రద్దు చేయాలని అంటున్నారని తెలిపారు. ప్రజలే వైసిపి ప్రభుత్వాన్ని బైకాట్ చేస్తున్నారనే విషయం జగన్ మోహన్ రెడ్డి తెలుసుకోవాలని చెప్పారు. పులివెందులలో గెలిచిన జగన్మోహన్ రెడ్డి ఏ రోజు కూడా పులివెందులను పట్టించుకున్న పాపానపోలేదని పేర్కొన్నారు. గతంలో బీటెక్ రవి గెలిచారని, ఇప్పుడు తన భార్యను గెలిపించుకున్నారని తెలిపారు. రోడ్డు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ జడ్పిటిసి ఎన్నికల విజయం మాయువ నాయకుడు లోకేష్ కు బహుమతిగా ఇస్తున్నామని చెప్పారు. భయపెట్టి గెలిచిన ఎన్నికల స్థాయి నుంచి ప్రజాస్వామ్య పద్ధతిలో గెలిచి చూపించామని పేర్కొన్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ పులివెందులలో క్రూయల్ డెమోక్రసీ నుంచి రియల్ డెమోక్రసీ వచ్చిందని తెలిపారు. వైసిపి అరాచక పాలన, నిధుల దోపిడీతో మా కూటమి పోరాట ఫలితం చంద్రబాబు, మోడీ అభివృద్ధి వల్లే పులివెందుల విజయం అన్నారు. అవినాష్ రెడ్డి, భారతి దగ్గరుండే వివేకానంద రెడ్డిని హత్య చేయించి, పోలీసులను నోరు మూయించిన విషయం బయటకు వచ్చాయని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో ఓడిపోయిన వైయస్ కుటుంబానికి సిగ్గుండాలని పేర్కొన్నారు. మళ్లీ మా ప్రభుత్వం వస్తుంది ఏదో పొడుస్తానని విర్ర వీగుతున్నారని, కలలో కూడా జరగదని హితవు పలికారు. మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి మాట్లాడుతూ ఇది ప్రజా విజయం, జిల్లాలో అందరూ సహకరించారని తెలిపారు. విజయానికి ప్రధానంగా నాలుగు కారణాలు ఉన్నాయని చెప్పారు. చంద్రబాబు సుపరిపాలన, పులివెందులలో ఈరోజు కూడా ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసిన పరిస్థితి లేదని పేర్కొన్నారు. ప్రజలు స్వేచ్ఛగా వచ్చి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. వారికి డిపాజిట్ కూడా రాలేదని చెప్పారు. వైయస్ కుటుంబం దారుణంగా పులివెందులను పట్టిపీడిస్తోందని, వచ్చే ఎన్నికల్లో కూడా స్వేచ్ఛగా వచ్చి ఓట్లు వేసి వైసిపిని తీవ్రమైన పదజాలంతో దూషించి ఓడిస్తామని పేర్కొన్నారు. అది వింటే జగన్ మోహన్ రెడ్డి ఆత్మహత్య చేసుకుంటారని తెలిపారు. టిడిపి పోలీసు బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వైసిపి రాష్ట్రంలో కనుమరుగడం ఖాయమని చెప్పారు. పులివెందుల జడ్పిటిసిగా ఎన్నికైన లతా రెడ్డి మాట్లాడు తూ అందరి సహకారంతో విజయం సాధించాలని పేర్కొన్నారు. అనంతరం లతారెడ్డిని అభినందించారు. సమావేశంలో ఎమ్మెల్యే పుత్త చైతన్య రెడ్డి, హరిప్రసాద్, రిత్విక్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

# గాంధీజీ కలలు కన్నా గ్రామ స్వరాజ్య స్థాపనే ధ్యేయంగా పని చేయాలి

● అవినీతికి ఆస్కారం లేకుండా పాలన సాగించాలి ● ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నిరుపేదలకు పారదర్శకంగా అందే టట్లు చూడాలి ● పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ప్రభుత్వాలు పని చేయాలి ● స్వాతంత్ర్య సమరయోధులు పెడబల్లె బాల యల్లారెడ్డి

**చెన్నూరు ఆగస్టు 14 :-** కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపనే ధ్యేయంగా పనిచేయాలని, అప్పుడే గ్రామా లలోని ప్రజలు స్వేచ్ఛాయుతంగా పచ్చని పంటల తో పశు సంపదతో చల్లగా ఉంటారని స్వాతంత్ర్య సమరయోధులు పెడ బల్లె బాల యల్లారెడ్డి అన్నారు, గురువారం ఆయన తన నివాసంలో " మనజనప్రగతి,, ప్రతినిధి తో మాట్లాడుతూ, 79 ఏళ్ల స్వతంత్ర భారత వనిలో నేటికీ పేదరికం పెళ్లబుకుతోందని దీనిని అధిగమించాలంటే గాంధీజీ కలలు కన్నా గ్రామ స్వరాజ్యం తోనే సాధ్యమని ఆయన అన్నారు, ఇప్పటికే ప్రభుత్వాలు పేదరిక నిర్మూలనకు ఎన్నో పథకాలు తీసుకురావడం జరిగిందని ఆయన తెలిపారు, ఇప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశన పయనిస్తున్నాయని, ఇప్పటికే రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలు తీసుకురావడం సంతోషకరమన్నారు, ఈ పథకాలు పేదరిక నిర్మూలనకు ఎంతో దోహదపడతాయని భావిస్తున్నట్లు ఆయన తెలిపారు, 104 ఏళ్లలో కూడా ఇంకా తన పనులు తాను చేసుకుంటున్నానని ఆయన తెలిపారు, స్వాతంత్ర్య ఉద్యమంలో దేశం పైన ప్రేమతో తెల్ల దొరలపై తాము చేసిన పోరాటాలతో జైలు శిక్ష అనుభవించడం జరిగిందన్నారు, ఆరోజుల్లో తెల్ల దొరల ఆగడాల కు హద్దే లేదని, వారి ఆగడాలు అరికట్టడంలో యువకుడిగా తన వంతు పాత్ర పోషించడం జరిగిందని ఆయన తెలిపారు, భరతమాత పై ఉన్న అపారమైన ప్రేమతో, భక్తితో అప్పుడు యువకుల మైన మేము సమయతమై చెన్నూరు- కొండపేట మధ్య ఉన్న పెన్నా నది లో లెవెల్ కాజ్వేని తెల్లదొరలు దాటకుండా పగలగొట్టడం జరిగిందన్నారు, దీంతో అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం తమ పై కేసు నమోదు చేసి జైల్లో ఉంచడం జరిగిందన్నారు,

**జిల్లాలో బ్రతికి ఉన్న ఏకైక వ్యక్తిని:-** స్వతంత్ర సమరయోధులలో జిల్లాలో తానొక్కడినే బ్రతికి ఉన్నానని ప్రస్తుతం నా వయసు(104) సంవత్సరాలని పెడబల్లె బాల యల్లారెడ్డి అన్నారు, అందుకే మరింత గౌరవం దక్కిందని ఆజాతిక అమృత్ మహెూత్సవాలలో భాగంగా తనకు జిల్లా అధికారుల తో పాటు, ప్రజా ప్రతినిధులు కూడా ఘనంగా సత్కరించడం జరిగిందని తెలిపారు,



**మహిళా సాధికార దిశగా సాగాలి:-** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాధికారత దిశగా పయనించాలని మహిళలు అన్ని రంగాలలో ముందుకు వస్తే దేశ అభ్యున్నతికి ఎంతో దోహద పడుతుందని ఆయన తెలియజేశారు, మహిళలు విద్యా, ఆర్థిక స్వాలంబన లభించినట్లయితే తమ కుటుంబమే కాకుండా, సమాజ శ్రేయస్సు కూడా బాగుంటుందని ఆయన అన్నారు,

**అవినీతికి ఆస్కారం లేకుండా, పేదరిక నిర్మూలన కు పాటుపడాలి** ప్రజలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని అవినీతి రహిత పాలన అందించాలని, అలాగే కుల మతాలకు, పార్టీలకు అతీతంగా ప్రతి పేదవానికి సంక్షేమ ఫలాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లయితే, పేదరిక నిర్మూలన అంతం మొందించినట్లు అవుతుందని ఆయన అన్నారు, దీంతో భారతదేశం ఆర్థికంగా అన్నిరంగాల్లో ప్రపంచ దేశాల్లో మొదటి స్థానంలో ఉంటుందని, ఆయన అభిప్రాయపడ్డారు, భిన్న మతాలు, విభిన్న సంస్కృతులు కలగలిపిన భారతదేశం లో లేనటువంటి సంస్కృతులు, సంప్రదాయాలు కలిగిన కూడా అందరి సుఖశాంతుల తో విరజల్లుతున్న గొప్ప బావజాలమున్న దేశం నా దేశమని ఆయన తెలిపారు.

# రాహుల్ గాంధీ గల్లి లీడర్ కాదు "ఎంపీ"

● ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఇర్ఫాన్ బాషా




**ప్రొద్దుటూరు ఆగష్టు 14:-** రాహుల్ గాంధీ గల్లి లీడర్ కాదు అతను ఒక "ఎంపీ" అని ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఇర్ఫాన్ బాషా తెలిపారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి బుధవారం రాహుల్ గాంధీ మీద చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. ముఖ్యమంత్రిగా పని చేసిన వారు రాజకీయ సంప్రదాయాలు తెలిసిన వారు ఇలా మాట్లాడడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. మాణిక్యం టాగోర్ ని వాడు వీడు అని సంబోధించడం ఎంత వరకు సబబన్నారు. ఆయన ఒక పార్లమెంట్ సభ్యుడని, ఇలా సంబోధించడం మీ విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. వోట్ చోరీ ను నిరసిస్తూ పార్లమెంటు ఆవరణలో అన్ని పార్టీలకు చెందిన ఎంపీ లు నిరసన తెలియ చేస్తుంటే వైకాపా ఎంపీలు ఎందుకు పాల్గొదెనలేదని ప్రశ్నించారు. ఈ రోజుకు కూడా ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హెూదా ఇవ్వాలని కట్టుబడి ఉన్న పార్టీ కాంగ్రెస్ పార్టీ కావాలో లేకుంటే మూడో సారి అధికారంలో వచ్చి కూడా ప్రత్యేక హెూదా ఇవ్వని బీజేపీ కావాలో ప్రజలకు తెలియచేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాలకు ఎవరు ముందుకు వస్తే వారికీ మద్దతు ఇస్తామని జగన్ మోహన్ రెడ్డి చెప్పిన మాటలు గుర్తు చేస్తూ, వైసీపీ తమ వైఖరేంటో ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2029లో ఎవరికి మద్దతిస్తారో ప్రధాన మంత్రిగా ఎవరికి చూడాలని అనుకుంటున్నారో ప్రజలకు తెలియచేయాలన్నారు. 2029 లో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హెూదాతో పాటు అనేక రకాలుగా రాష్ట్రాన్ని అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ చేస్తుందని స్పష్టం చేశారు

# టైక్వాండో విజేతలకు అభినందించిన పాఠశాల యాజమాన్యం

● ప్రిన్సిపాల్ జోసెఫ్ డేవిడ్

**కర్నూలు ఆగస్టు 14:-** టైక్వాండో పోటీల్లో గెలుపొందిన తమ పాఠశా లలో చదువుతూ గెలుపొందిన విజేతలకు పాఠశాల యాజమాన్యం అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూగురువారం ఉదయం టైక్వాండో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు జిల్లా స్థాయి టైక్వాండో పోటీలలో పాల్గొని పథకాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో సన్మానం సభ ఏర్పాటు చేసి మెడల్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎడిఫై స్కూల్ ప్రిన్సిపాల్ జోసెఫ్ డేవిడ్ మాట్లాడుతూ కె ఆత్య వెయిట్ 41 కేజీ,ఏజీ 12 బ్రాంచ్ మెడల్ వై కార్తిక వెయిట్ ఏజీ 11 వెయిట్ 33 కేజీ బ్రాంచ్ మెడల్ సి రిత్తన్య ఏజీ11 వెయిట్ వెయిట్ 35 కేజీ బ్రాంచ్ మెడల్ కే.తార అనన్య, ఏజీ 8 వెయిట్ 30 కేజీ సిల్వర్ మెడల్ ఎన్ జశ్విత ఏజీ11వెయిట్ 30 కేజీ బ్రాస్ మెడల్ ఈనెల 13 తారీకు డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ అవుట్డోర్ స్టేడియం నిర్వహించారు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



తెలంగాణ తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం

# కాంగ్రెస్‌పై జగన్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదం

### పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి

**వేంపల్లె ఆగస్టు 14 :–**కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడు హాట్ లైన్ లో మాట్లాడుకొంటూ ఉంటారని అందువలన ఆంధ్రాలో జరిగే దొంగ ఓట్లపై రాహుల్ గాంధీ మాట్లాడడం లేదని అసలు కాంగ్రెస్ ఒక పార్టీయేనా అని వైసీపీ పార్టీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి వ్యాఖ్యానించడం హాస్యాస్పదం ,అవివేకం ,అజ్ఞానమని పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో బిజెపి అంటే బాబు, జె అంటే జగన్, పి అంటే పవన్ అన్న విషయం నిజమేనని తులసి రెడ్డి ఎద్దేవా చేశారు. బిజెపి చేతిలో ముగ్గురు నాయకులైన చంద్రబాబు నాయుడు, జగన్మోహన్ రెడ్డి, పవన్ కళ్యాణ్ ఈ ముగ్గురు నాయకులు నరేంద్ర మోడీ ,అమిత్ షా చేతిలో కీలుబొమ్మలు ,కబాలీలని తులసి రెడ్డి ధ్వజమెత్తారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీకి ప్రధాన రాజకీయ ప్రత్యర్థి పార్టీ బిజెపి అన్నారు. అటువంటి బిజెపి నాయకత్వంలో ఉన్నటువంటి ఎన్ డిఏలో తెలుగుదేశం పార్టీ భాగస్వామి అన్నారు. అటువంటి చంద్రబాబు నాయుడుతో రాహుల్ గాంధీ హాట్ లైన్ లో మాట్లాడుతారని జగన్ మోహన్ రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. జగన్ రెడ్డి అబద్ధం చెప్పినా అతికినట్టు ఉండాలని సూచించారు. బొంకరా బొంకరా పోలిగా అంటే టంగుటూరి మిరియాలు తాటికాయంత అన్నట్లుంది జగన్ మోహన్ రెడ్డి వైఖరి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అది ఒక పార్టీనేనా అని జగన్ మోహన్ రెడ్డి వ్యాఖ్యానించడం గర్హనీయమని తులసి రెడ్డి అన్నారు. 140 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం కలిగిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. అలాంటి పార్టీని విమర్శించడం సరికాదని చెప్పారు. ఈ దేశానికి స్వాతంత్రం తెచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. రవి అస్తమించని బ్రిటి సామ్రాజ్యాధినేతలను భారతదేశపు పొలిమేరల నుండి తరిమికొట్టి భారతమాత దాస్య శృంఖలాలు చేధించిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. జాతి పిత మహాత్మా గాంధీ, శాంతి దూత జవహర్ లాల్ నెహ్రూ,విప్లవ నేత నేతాజీ సుభాష్ చంద్రబోస్, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్, ఉక్కు మహిళ ఇందిరమ్మ, నీలం సంజీవరెడ్డి ,త్యాగశీలి సోనియమ్మ లాంటి ప్రపంచ నాయకులు నాయకత్వం వహించిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. స్వాతంత్రం వచ్చినప్పటి నుండి 78 సంవత్సరాల లో ఆంధ్రప్రదేశ్‌ను 52 సంవత్సరాల పాటు కాంగ్రెస్ పరిపాలించిందని చెప్పారు. 21 సంవత్సరాలు పాటు తెలుగుదేశం ,కేవలం ఐదు సంవత్సరాలు మాత్రమే వైసీపీ పార్టీ పరిపాలించిందని తెలిపారు. జగన్ మోహన్ రెడ్డి తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కూడ కాంగ్రెస్ పార్టీ నుండే ముఖ్యమంత్రి అయినట్లు చెప్పారు. జగన్ మోహన్ రెడ్డి రాజకీయ ప్రస్థానం కూడ కాంగ్రెస్ పార్టీతోనే ప్రారంభం అయ్యిందని విషయాన్ని జగన్ రెడ్డి గుర్తు పెట్టుకోవాలని హితవు పలికారు. అటువంటి కాంగ్రెస్ పార్టీని పట్టుకొని జగన్ అవాకులు చవాకులు పేలడం శోచనీయం అన్నారు. ఆకాశం మీద ఉమ్మివేస్తే అది తిరిగి తమ ముఖాన్ని పడుతుంది అన్న నగ్న సత్యాన్ని జగన్ రెడ్డి గ్రహించాలని చెప్పారు.



# ప్రతి గ్రామంలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

### • జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

**కర్నూలు ఆగస్టు 14:–** ప్రతి గ్రామంలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు.జిల్లాలో గత 77 సంవత్సరాల నుండి రహదారి సౌకర్యం లేని 14 గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించిన ముఖ్యమంత్రి కు, ఉప ముఖ్యమంత్రి కి, జిల్లా కలెక్టర్ కి గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సంబంధిత గ్రామాల ప్రజలు, పంచాయతీ రాజ్ శాఖ ఇంజనీర్లు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలో కనీస మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా రోడ్లు లేని గ్రామాలకు రోడ్లు వేయించాలన్న ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో రూ.120 కోట్లతో గ్రామాల్లో అంతర్గత రోడ్లు, కాలువలు, అప్రోచ్ రోడ్ల నిర్మాణాలను చేపట్టడం జరిగిందన్నారు.ఈ నేపథ్యంలో జిల్లాలో రోడ్డు లేని గ్రామాలు ఎన్ని ఉన్నాయి అని సర్వే నిర్వహించామని కలెక్టర్ తెలిపారు.గత 77 ఏళ్లుగా రోడ్డు సౌకర్యం లేని గ్రామాలు 27 ఉన్నట్లు సర్వే లో తేలిందన్నారు.అదే విధంగా ఎంపీ, ఎమ్మెల్యే లు కూడా ఈ అంశాన్ని తన దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు.ఇందులో 14 గ్రామాలకు మొదటి విడతలో రోడ్లు వేశామన్నారు. ఆలూరు మండలం మొలగవల్లి కొట్టాల, ఆస్పరి మండలం చెన్నంపల్లి,



అట్టేకల్, గోనెగండ్ల మండలం గుళ్ళమొరుసు, కర్నూలు మండలం బావాపురం, కోడుమూరు మండలం బైనాదొడ్డి, పత్తికొండ మండలం కురువులదొడ్డి, దేవకుంట, తుగ్గలి మండలం హుస్సేనాపురం, గూడూరు మండలం పొన్నెకల్, వెల్దుర్తి మండలం చిన్నకొలుములపల్లి, హొళగుంద మండలం హొన్నూర్ కొట్టాల, నెరణికి, కడ్లమాగి గ్రామాల్లో రూ.18 కోట్లతో 20 కిలోమీటర్ల మేరకు రోడ్లు వేశామని కలెక్టర్ తెలిపారు. ఇందులో ఇప్పటివరకు 10 గ్రామాల్లో రోడ్ల నిర్మాణం పనులు పూర్తయిందని, మిగిలిన 4 గ్రామాల్లో పురోగతిలో ఉన్నాయని, వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మిగిలిన 13 గ్రామాల్లో కూడా ఫేజ్ 2 కింద రోడ్ల నిర్మాణం చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఎన్నో ఏళ్లుగా రోడ్లు లేని గ్రామాలకు రోడ్లు వేయించినందుకు ముఖ్యమంత్రి లకు, ఉప ముఖ్యమంత్రి మనమందరం కృతజ్ఞత తెలియచేయాలన్నారు.గత ఏడాది పల్లె పండుగ కార్యక్రమంలో 100 శాతం రోడ్ల పనులు పూర్తి చేసి కర్నూలు జిల్లా మొదటి స్థానంలో నిలవడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.జిల్లాలో ఈ ఏడాది 8 వేల 500 ఫాం పాండ్ లను నిర్మిస్తున్నామని, రైతులు తమ పొలాల్లో 3 లేదా 5 సెంట్లలో ఫామ్ పాండ్ లు ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.వీటి ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకుని, పంటలు సాగు చేసుకోవడానికి వీలుగా ఉంటుందన్నారు. అదే విధంగా మూగ జీవాల కొరకు 400 నీటి తొట్టెలను కూడా ఏర్పాటు చేశామని, పశువుల కొరకు గోకులం లను కూడా నిర్మించడం జరిగిందని, వీటన్నిటిని రైతుకు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.ఇవి కాకుండా మిషన్ పాట్ హోల్ పథకం కింద ఆర్ అండ్ బి శాఖ ద్వారా ప్రధాన రహదారుల్లో ఏర్పడిన గుంతలను పూడ్చి వేయడం జరిగిందన్నారు.ఇంకా మిగిలిన రోడ్ల మరమ్మతులు, నిర్మాణాలకు కూడా ప్రభుత్వం నిధులు మంజూరు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.14 గ్రామాల నుండి హాజరైన ప్రజలలో కొంతమంది ఎంజిఎన్ఆర్ఈజిఎస్ కింద లేని రోడ్లు, బోర్ వెల్స్, శ్మశాన వాటికలు లాంటివి ఏర్పాటు చేయాలని తన దృష్టికి తీసుకొని రావడం జరిగిందని, సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి ఏర్పాటుకు కూడ తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.ఎన్నో ఏళ్లుగా రోడ్డు సౌకర్యం లేని తమ గ్రామాలకు రోడ్డు సౌకర్యం ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి, జిల్లా కలెక్టర్ కు,సంబంధిత గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం 14 గ్రామాల ప్రజలు జిల్లా కలెక్టర్ గారిని ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో డ్వామా పిడి వెంకటరమణయ్య, ఇంచార్జి పంచాయతీ రాజ్ ఎస్ మాదన్న, రిటైర్డ్ పంచాయతీ రాజ్ ఎస్ఈ రామచంద్రారెడ్డి, డి ఈ శ్రీనివాసులు, ఇంజనీర్ లు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సాయి ఇంజనీరింగ్ ఇంజనీరింగ్ విద్య - ఉద్యోగ మార్కెట్‌లో అవకాశాలు అంశంపై అవగాహన

**రాయచోటి ఆగస్టు 14:** అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం నాడు ఇంజనీరింగ్ ఉద్యోగ మార్కెట్లో అవకాశాలు– సవాళ్లు మరియు విజయానికి మార్గాలు అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ కే. కళ్యాణి రాధ, ప్రొఫెసర్ మరియు హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్, జేఎన్టీయూ, అనంతపూర్ రిసోర్స్ పర్సన్ గా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఇంజనీరింగ్ రంగం వేగంగా మారిపోతున్న పరిసరాల్లో, విద్యార్థులు మరియు యువ ఇంజనీర్లు సరైన దిశలో ప్రయాణించడం అత్యంత అవసరం అని, సాంకేతికతలో జరుగుతున్న వేగవంతమైన మార్పులు, పరిశ్రమలలో ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ వంటి కొత్త ధోరణులు ఇంజనీరింగ్ ఉద్యోగ మార్కెట్‌ను మలుపు తిప్పుతున్నాయని అభిప్రాయపడ్డారు.ఉద్యోగ మార్కెట్‌లో గత దశాబ్దంలో ఐటి, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్ వంటి సాంప్రదాయ విభాగాలతో పాటు డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, రోబోటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (IoT) వంటి కొత్త విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు విస్తరిస్తున్నాయని,అయితే పోటీ కూడా పెరుగుతున్న సందర్భంగా కంపెనీలు కేవలం డిగ్రీ లేదా సర్టిఫికేట్ కాకుండా, సమస్య




పరిష్కార నైపుణ్యం, ఆవిష్కరణ దృష్టి, జట్టు సహకారం, మరియు నిరంతర విద్యా దృక్పథాన్ని ఎక్కువగా విలువ ఇస్తున్నాయి అని వివరించారు. ఉద్యోగ అన్వేషణలో విజయం సాధించడానికిప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌లు (Python, Java, C++), CAD టూల్స్, సిమ్యులేషన్ సాఫ్ట్‌వేర్‌లు, మరియు డేటా అనలిటిక్స్‌లో ప్రావీణ్యం సంపాదించాలనిసర్టిఫికేషన్ కోర్సు చేయడం ద్వారా మార్కెట్లో ప్రత్యేకతను చాటుకుని విద్యార్థి దశలోనే పరిశ్రమలో ఇంటర్న్‌షిప్ చేయడం ద్వారా వాస్తవ ప్రాజెక్టులు, వర్క్ కల్చర్, మరియు ప్రొఫెషనల్ నెట్వర్కింగ్‌కి పరిచయం కలుగుతుందని అభిప్రాయపడ్డారు.సాఫ్ట్ స్కిల్స్ కమ్యూనికేషన్, లీడర్‌షిప్, టైమ్ మేనేజ్‌మెంట్, మరియు ప్రెజెంటేషన్ స్కిల్స్‌ను అభివృద్ధి చేయడం ద్వారా ఇంటర్వ్యూలో ప్రత్యేక గుర్తింపు సాధించవచ్చు అని అభిప్రాయపడ్డారు.నెట్వర్కింగ్ మరియు ప్రొఫెషనల్ ప్లాట్‌ఫారమ్స్,LinkedIn, GitHub, ResearchGate% వంటి ప్లాట్‌ఫారమ్‌లలో ప్రొఫైల్‌ను అప్డేట్ చేయడం, ప్రాజెక్టులు షేర్ చేయడం, పరిశ్రమ నిపుణులతో కనెక్ట్ అవ్వడం వల్ల అవకాశాలు పెరుగుతాయని వివరించారునిరంతర అభ్యాసం ద్వారాకొత్త సాంకేతికతలు, టూల్స్, మరియు పరిశ్రమ ధోరణులపై నిరంతరం అవగాహన పెంచుకోవాలని సూచించారు.ఆన్‌లైన్ కోర్సులు (Coursera, edX, NPTEL, Udemy) ద్వారా కొత్త నైపుణ్యాలు అలవర్చుకోవాలని.ఉద్యోగ మార్కెట్‌లో కఠినమైన పోటీ, గ్లోబల్ ఆర్థిక మార్పులు, మరియు సాంకేతిక పరిణామాల వేగం వంటి అంశాలు సవాళ్లు అయినప్పటికీ, సరైన వ్యూహం, క్రమశిక్షణ, మరియు అనువర్తన శక్తి ఉంటే యువ ఇంజనీర్లు విజయాన్ని వివరించారు.ఇంజనీరింగ్ విద్యార్థులు కేవలం డిగ్రీతో ఆగిపోకుండా, నిరంతర అభ్యాసం, ప్రాక్టికల్ అనుభవం, మరియు వ్యక్తిత్వ వికాసం ద్వారా తమ కెరీర్‌కి బలమైన పునాది వేయాలి. ప్రస్తుత పరిస్థితుల్లో, "సాంకేతికతతో పాటు మన నైపుణ్యాలు కూడా అప్‌డేట్ అవుతూ ఉండాలి" అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. బాలాజీ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి.వెంకటరమణ,వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# లోక కళ్యాణకారుడు శ్రీకృష్ణుడు

**ప్రొద్దుటూరు ఆగష్టు 14:–** లోక కళ్యాణకారుడు శ్రీకృష్ణుడు అని ఓం శాంతి భవన్ నిర్వాహకురాలు బ్రహ్మకుమారీ శాంత తెలిపారు. గురువారం స్థానిక విజయనగరం వీధిలోని ఓం శాంతి భవనంలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకలలో పలువురు చిన్నారులు రాధా కృష్ణులు లక్ష్మీనారాయణులు వేషాలను ధరించారు. బ్రహ్మకుమారీలు జ్యోతులను వెలిగించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీకృష్ణుడు దుష్ట శిక్షణ శిష్ట రక్షణ అన్న గీతోపదేశంతో మానవాళికి దశ దిశ నిర్దేశం చేశారన్నారు. రాజనీతి, సామాజిక, ఆధ్యాత్మిక క్షేత్రాలలో పరాకాష్ట పొందిన ప్రతిభాశాలి అయినందున జన్మతోనే శ్రీకృష్ణుడు గాయన యోగ్యుడుఐ సంపూర్ణ నిర్వికారుడిగా, మర్యాద పురుషోత్తమునిగా, సర్వ గుణ సంపన్నుడిగా కీర్తింపబడుతున్న ఏకైక వ్యక్తి శ్రీకృష్ణుడే అని



అన్నారు. ద్రౌపదీమానం కాపాడిన శ్రీకృష్ణున్ని నేటి యువతరం ఆదర్శంగా తీసుకుని స్త్రీలను గౌరవించాలని, కుచేలుడ్ని దారిద్ర్యం నుండి సౌభాగ్యవంతుణ్ణి చేసిన కృష్ణుడు కుచేలుడి కలిమిని నేటి యువతరం ఆదర్శంగా తీసుకుని సనాతన విలువలను కాపాడాలన్నారు. శ్రీకృష్ణుడు సత్యయుగపు ప్రథమ యువరాజు అని, కలియుగంలోని కల్మషాలను హరించి పుణ్యాల్ని ప్రసాదించే పర్వదినాన్ని కృష్ణాష్టమిగా, గోకులాష్టమిగా, అష్టమరోహినిగా జరుపుకుంటారన్నారు కృష్ణుడు గోపికలు రాస్ చేసి, విజయాన్ని, లక్ష్యాన్ని చేరటానికి ప్రతీకగా చిన్నారి కృష్ణులు ఉట్టి కొట్టారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యల్లో మహిళలు పాల్గొన్నారు.

# వివాహ వేడుకల్లో బిజీబిజీగా ఎమ్మెల్యే



**దేవనకొండ, పత్తికొండ ఆగస్టు 14:–** పత్తికొండ నియోజకవర్గం లోని పలు వివాహ కార్యక్రమాల్లో పతికొండ ఎమ్మెల్యే కే. ఈ.శ్యామ్ కుమార్ బిజీబిజీగా కనిపించారు. గురువారం పలు వివాహ కార్యక్రమాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కే .ఈ.శ్యామ్ కుమార్ పత్తికొండ సొసైటీ చైర్మన్ చందోలి రంగప్ప కుమార్తె వివాహం చక్రాల గ్రామంలో,సత్యనారాయణ శెట్టి (వెంకటేశ్వర ట్రేడర్స్) కుమారుని వివాహం పత్తికొండ రమ్య రిసార్ట్ లో, మేకల ఓబులప్ప కుమారుని వివాహం పెండేకల్లు గ్రామంలో, రంగడు వివాహం కోయిలకొండ గ్రామంలోవడ్డే యాగంటి, కుమార్తె వివాహం ఎల్ బండ బ్రహ్మగూడ క్షేత్రం,తూర్పునాటి విష్ణువర్ధన్. కుమార్తె వివాహం రంగా ఫంక్షన్ హాల్ డోన్ లో,బి.ఎల్ల స్వామి కుమారుని వివాహం ఎస్ హెచ్ ఎర్రగుడి లో,కోసిగి రామాంజనేయులు గారి కుమారుని వివాహం రాతన గ్రామంలోఉప్పర వెంకటేశ్వర్లు కుమార్తె (ఐ న్యూస్ )రిసెప్షన్ పత్తికొండ టిటిడి కళ్యాణమండపం నందుపాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించడమైనది.

# స్వాతంత్ర్య ఫలాలు అందరికీ అందాలి

### - 79వ స్వాతంత్ర్య దినోత్సవశుభాకాంక్షలు తెలిపిన వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి




**రాయచోటి ఆగస్టు 14 :–** స్వాతంత్ర్యపు సమరయోధుల అడుగుజాడల్లో ప్రతి ఒక్కరమూ నడచి దేశాభివృద్ధికి కృషి చేద్దామని వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. వీరుల ప్రాణ త్యాగాలతో నిర్మించబడిన మన భారత దేశం మహోజ్వలంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో వరుసగా నాల్గవ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుగుచుండడం హర్షదాయకమన్నారు. రాయచోటి పట్టణంలో తక్కువ కాలంలోనే పోలీసు పరేడ్ గ్రౌండ్,తదితర అభివృద్ధి కార్యక్రమాలు రూపుదిద్దుకుని, స్వాతంత్ర్య వేడుకలు చక్కగా నిర్వహించాలన్న తన కల కొనసాగుతుండడం చాలా సంతోషదాయక మన్నారు. స్వాతంత్ర్య ఫలాలుఅందరికీ దక్కి,సామాజిక పరంగానూ, విద్యాపరంగాను అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం గత జగన్ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను రాష్ట్రంలో తీసుకు వచ్చిందన్నారు. నియోజక వర్గ ప్రజలకు శ్రీకాంత్ రెడ్డి 79 వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలును శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

# మద్యం విక్రయాలు నిషేధం

### - స్వాతంత్ర దినోత్సవ నాడు మద్యం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు

**గాలివీడు ఆగస్టు 14:–** స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా శుక్రవారం గాలివీడు మండలంలో మద్యం విక్రయాలు నిషేధిస్తున్నట్లు ఎస్సై రామక్రిష్ణ తెలిపారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మండలంలో మద్యం అమ్మకాలు విక్రయించరాదన్నారు. మండలంలోని ప్రజలు ఈ విషయాన్ని గమనించాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



# 17 న జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సబ్ జూనియర్స్,సీనియర్స్ జట్ల ఎంపికలు

**రాజంపేట ఆగస్టు 14:-** కడప జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా( కడప ,అన్నమయ్య) జిల్లా స్థాయి సబ్ జూనియర్స్(బాల బాలికలు),సీనియర్స్ (మెన్ , ఉమెన్) ఎంపికలు 17 వ తేది ఆదివారం ఉదయం 9 గంటలకు రాజంపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం నందు ఎంపికలు జరుగుతాయని బాల్ బ్యాట్మెంటన్ జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు క్రిష్ణమూర్తి,వెంకట రమణ తెలిపారు. సబ్ జూనియర్స్ ఎంపికలకు సంబంధించి 02-01-2010 తరువాత పుట్టిన వాళ్ళు అర్హులు అని తెలిపారు.సబ్ జూనియర్స్,సీనియర్స్ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు, క్రీడాకారిణులు అందరూ ఈ నెల29,30,31 వ తేదీలలో ప్రకాశం జిల్లా చేవూరు లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపికలకు వచ్చే క్రీడాకారులు, క్రీడాకారిణులు అందరూ తప్పనిసరిగా మీ పుట్టిన తేది కలిగిన ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్ , బ్లడ్ గ్రూప్,డ్రెస్ కోడ్,షూస్ తప్పనిసరిగా వేసుకొని రావలని మరిన్ని వివరాలకు 94901 81104, 7036907303 నంబర్లకు సంప్రదించాలన్నారు.

# పులివెందుల టిడిపి కార్యాలయం వద్ద సంబరాలు



**పులివెందుల ఆగస్టు 14:-** పులివెందుల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద తెలుగు తమ్ముళ్లు భారీ ఎత్తున సంబరాలు చేసుకున్నారు. పులివెందుల జడ్పిటిసి ఉప ఎన్నికల సందర్భంగా టిడిపి అభ్యర్థి మా రెడ్డి లతారెడ్డి ఘనవిజయం సాధించిన నేపథ్యంలో పులివెందుల లోని తెలుగు తమ్ముళ్లు బాణసంచా పెద్ద ఎత్తున పేల్చి సంబరాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా మా రెడ్డి భరత్ రెడ్డి మాట్లాడుతూ పులివెందుల ప్రజలు తెలుగుదేశం పార్టీకి అందించిన విజయంగా వారు అభివర్ణించారు కూటమి ఆధ్వర్యంలో నారా చంద్రబాబు నాయుడు చేస్తున్నటువంటి అభివృద్ధి కార్యక్రమాల వల్లే ఇదంతా సాధ్యమైందని పేర్కొన్నారు పులివెందుల మండలానికి చెప్పిన ప్రతి హామీని నెరవేరుస్తామని తెలుగు తమ్ముళ్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు. నల్లగారి భాస్కర్ రెడ్డి మహబూబ్ బాషా , కాసిం వల్లి తదితరులు పాల్గొన్నారు

# నవంబర్ నెల దర్శన కోటా విడుదల వివరాలు

**తిరుమల ఆగస్టు 14:-** నవంబర్ నెలకు సంబంధించి టీటీడీ విడుదల చేయు వివిధ దర్శనాల, గదుల కోటా వివరాలు ఈ విధంగా ఉన్నాయి.తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన నవంబర్ నెల కోటాను ఆగస్టు 18న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం ఆగస్టు 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు.ఈ టికెట్లు పొందిన వారు ఆగస్టు 20 నుండి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయి.21న ఆర్జిత సేవా టికెట్ల విడుదల కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్లను ఆగస్టు 21న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్ లైన్ లో విడుదల చేయనుంది.21న వర్చువల్ సేవల కోటా విడుదల వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను ఆగస్టు 21న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.23న అంగప్రదక్షిణం టోకెన్లు అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను ఆగస్టు 23న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.శ్రీవాణి టికెట్ల ఆన్ లైన్ కోటా%౸.శ్రీవాణి ట్రస్టు టికెట్ల ఆన్ లైన్ కోటాను ఆగస్టు 23వ తేదీ ఉదయం 11 గంటలకు టీటీడీ విడుదల చేయనుంది.వృద్ధులు, దివ్యాంగుల దర్శన కోటా%%వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను ఆగస్టు 23న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.25న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదల ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను ఆగస్టు 25న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.తిరుమల, తిరుపతిలలో గదుల కోటా విడుదల%౸%తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను ఆగస్టు 25న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా శ్రీవారి ఆర్జితసేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని కోరడమైనది

# 30 సంవత్సరాల తరువాత పులివెందులలో ప్రజాస్వామ్యం గెలిచింది: ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

● స్వాతంత్ర దినోత్సవానికి ఒకరోజు ముందుగానే పులివెందులలో జడ్పిటిసి ఎన్నికల్లో స్వాతంత్రం వచ్చింది ● టిడిపి కైవసం చేసుకోవడంతో టిడిపి నేతలు అభిమానులు హర్షం



**సింగనమల ఆగస్టు 14:-** పులివెందులలోని అచ్చువెల్లి గ్రామంలో దళిత కాలనిలో జడ్పిటిసి ఎన్నికల ప్రచారం చేస్తున్న సమయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్టీలు చూడకుండా మాజీ ముఖ్యమంత్రి జగన్ ఏరియా అని ఆలోచించకుండా ప్రతి ఒక్కరికి,ప్రతి కుటుంబానికి సంక్షేమం అందిస్తున్నారని గ్రామస్థులు ఆనందంగా చెప్పడం జరిగింది అని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ గుర్తు చేశారు 30 సంవత్సరాల తర్వాత ఓటు ను స్వేచ్ఛగా వేసిన ప్రజలు చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నారు అన్నారు ఎన్నడూ లేని విధంగా జెడ్పిటిసి ఎన్నికల్లో టిడిపి కైవసం చేసుకోవడంతో నూతన తరానికి కొత్త అడుగులు పడుతున్నాయిపులివెందులలోనే జెడ్పిటిసి కైవసం చేసుకోవడంతో వైయస్సార్సీపి పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డికి చేదు అనుభవం కలగడం గెలుపుని జీర్ణించుకోలేక రాష్ట్ర ప్రజలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం. పులివెందల నియోజకవర్గ కేంద్రంలోని వైసీపీ పార్టీ పని అయిపోయిందని ఎమ్మెల్యే బండారు శ్రావణి అన్నారు రాష్ట్రము అభివృద్ధి చెందుతుంటే వైసీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. రాష్ట్రము అభివృద్ధి దిశగా అడుగులు వేసే విధంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ తెలియజేశారు అలాగే జడ్పిటిసిగా ఎన్నికైన లత రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు



# ఘనంగా బాలరాజు కృష్ణంరాజు వర్ధంతి వేడుకలు

**రాజంపేట ఆగస్టు 14:-** పద కవితా పితామహుడు తొలి తెలుగు వాగ్గేయకారుడు అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక గ్రామానికి తాళ్లపాక ముద్దుబిడ్డ కళాబందు బాలరాజు కృష్ణంరాజు వల్లే గుర్తింపు వచ్చిందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతు గుంట రమేష్ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్ , జిల్లా ప్రధాన కార్యదర్శి వై సురేష్ రాజు, క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్ రాజు, జనసేన రాజంపేట పార్లమెంటు సమన్వయకర్త ఎల్లటూరు శ్రీనివాసరాజు, రాజంపేట బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు ప్రముఖ న్యాయవాది కొండూరు శరత్ కుమార్ రాజులు తెలిపారు. బాలరాజు కృష్ణంరాజు వర్ధంతి వేడుకలను ఈరోజు తాళ్లపాక గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బాలరాజు కృష్ణంరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో వక్తలు ప్రసంగిస్తూ అన్నమయ్య తాళ్లపాక లోనే జన్మించారని బాలరాజు కృష్ణంరాజు టీటీడీ వారికి నిరూపించారని చెప్పారు, అప్పటినుంచి ఆయన వర్ధంతి జయంతి ఉత్సవాలు ఇక్కడ నిర్వహిస్తున్నారని తెలిపారు. బాలరాజు కృష్ణంరాజు జాతీయ సాంస్కృతిక కళల రాయబారిగా పనిచేసితాళ్లపాక అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని ఆయన సేవలు మరువలేను గాని కొనియాడారు. అన్నమయ్య జన్మస్థలి తాలపాక గ్రామానికి వన్నెతెచ్చిన ప్రత్యేక గుర్తింపు తెచ్చిన కళామ ముద్దుబిడ్డ డాక్టర్ బాలరాజు కృష్ణంరాజు వర్ధంతి జయంతి వేడుకలు ను కూడా టీటీడీ వారు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఆయన పేరిట ఒక మ్యూజియం ఏర్పాటు స్కాలర్షిప్లను అందజేయాలని తెలిపారు.బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతు గుంట రమేష్ నాయుడు మాట్లాడుతూ తాళ్లపాక అభివృద్ధికి సంబంధించి 16 అంశాలతో కూడిన వినతి పత్రాన్ని తాను తయారుచేసి టిటిడి పాలక మండలి సభ్యులు భాను ప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో టీటీడీ ఈవో శ్యామల రావు దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు ఆయన వెంటనే స్పందించి వారం రోజులు తిరగకసరికే తాళ్లపాక గ్రామానికి ఇంజనీర్లను పంపించి తాళ్లపాక అభివృద్ధి కోసం ఎస్టిమేట్లు తయారు చేయించారని తర్వాత ఆ ప్రతిపాదనను టీటీడీ బోర్డు మీటింగ్లో పెట్టి ఆమోదించడం జరిగిందన్నారు ఇందుకు భాను ప్రకాష్ రెడ్డికి టీటీడీ ఈవోకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఏది ఏమైనప్పటికీ ఎన్ని సంవత్సరాలు తర్వాత తాళ్లపాక అభివృద్ధికి టీటీడీ పాలక మండలి సమావేశంలో ఆమోదించడం ఆనందాయకమన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కృష్ణ యాదవ్, పట్టుపోగుల ఆదినారాయణ,తాళ్లపాక గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# చిట్టి చేతులు చూడ చక్కని చిత్రాలు

- ముద్దులొలికే బొమ్మలతో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

యుసీఐఎల్ మిల్ జనరల్ మేనేజర్ సుమన్ సర్కార్

తుమ్మలపల్లి యూసిఐఎల్ ఆధ్వర్యంలో అంతర్ పాఠశాల చిత్రలేఖన పోటీలు

గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేసిన సంబంధిత అధికారులు




**వేముల ఆగస్టు 14:-**ఏకాగ్రత,పట్టుదల దానికితోడు సృజనాత్మక జతకలిస్తే అద్భుత చిత్రాలు చిన్నారులు గీయగలరని మట్టి ముద్దను సైతం ముద్దులొలికే బొమ్మలుగా మలిచే శక్తి ఆ చిట్టిచేతులకు ఉందనీ యుసీఐఎల్ మిల్ జనరల్ మేనేజర్ సుమన్ సర్కార్ పేర్కొన్నారు.75వడిఏఈ ప్లాటినం జూబ్లీ వేడుకలలో భాగంగా తుమ్మలపల్లి యూసిఐఎల్ (యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్) కర్మాగారం ఆధ్వర్యంలో గురువారం ఉదయం అంతర్ పాఠశాల చిత్రలేఖన పోటీ పోటీలను వారు నిర్వహించారు.ఈ పోటీలలో వేముల మండల పరిధిలోని స్థానిక మబ్బుచింతలపల్లె,రాచకుంటపల్లె,భుమయ్యగారిపల్లె,కె.కె కొట్టాల,కన్నంపల్లె,వెల్పుల మరియు బెస్తవారిపల్లె గ్రామాలలోని అంతర్ పాఠశాల విద్యార్థులు పాల్గొనగా..ఆ విద్యార్థులకు యూసీఐఎల్ యజమాన్యం చిత్రలేఖన పత్రాలు మరియు డ్రాయింగ్ సామగ్రిని అందించారు.అనంతరం పోటీలలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన ప్రతి గ్రామ పాఠశాల నుండి మొదటి మరియు రెండవ బహుమతులను ప్రత్యేకంగా ప్రదానం చేసి,ప్రతిభావంతులైన విద్యార్థులను వారు సత్కరించారు.అన్ని పాఠశాలల సహకారం,ఉత్సాహభరితమైన స్పందనకు యూసిఐఎల్ అధికారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ..సమాజంతో అనుబంధాన్ని మరింతగా పెంపొందించడం,పాఠ్యేతర కార్యక్రమాలను ప్రోత్సహించడం మరియు డిఏఈ ప్లాటినం జూబ్లీని విద్యార్థి కేంద్రిత,సమగ్ర కార్యక్రమాల ద్వారా జరుపుకోవడం ఈ ప్రయత్నంలో భాగమని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాగరాజు,దినేష్,అంజాద్ అలీ,ఎన్.వి.రాజేష్,డా.విపిన్ కుమార్ శర్మ,వాసుదేవ రెడ్డి,సంబశివరెడ్డి,పెద్దారెడ్డి మరియు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ శాఖలో అత్యుత్తమ సేవలకు సేవా పతకాలు ప్రకటించిన ప్రభుత్వం

**అభినందించిన జిల్లా ఎస్.పి శ ఇ.జి అశోక్ కుమార్**



**కడప ఆగస్టు 14 :** పోలీస్ శాఖలో అత్యుత్తమ పనితీరు కనబరచిన పోలీస్ అధికారులు, సిబ్బందికి గుర్తింపుగా ఇచ్చే ప్రతిష్టాత్మక సేవా పతకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిం చింది. జిల్లాకు చెందిన 8 మంది పోలీస్ సిబ్బంది పతకాలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారికిని జిల్లా ఎస్.పి ఇ.జి అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. సేవా పతకాలకు ఎంపికై న వారి వివరాలు: సి.శివశంకరయ్య, ఏ.ఎస్.ఐ, కడప వన్ టౌన్ పి.ఎస్ .ఏ.పి స్టేట్ పోలీస్ ఉత్తమ సేవా పతకంఎం. నాగభూషణం, ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, బద్వేలు రూరల్....ఏ.పి స్టేట్ పోలీస్ సేవా పతకంఎన్.మురళి యాదవ్, ఏ.ఎస్.ఐ, కలసపాడు పి.ఎస్...ఏ.పి స్టేట్ పోలీస్ సేవా పతకండి. శేషశయన రావు, ఏ.ఎస్.ఐ, చక్రాయపేట పి.ఎస్.ఏ.పి స్టేట్ పోలీస్ సేవా పతకం ఎ.వెంకట రమణయ్య, హెడ్ కానిస్టేబుల్, రిమ్స్ పి.ఎస్....ఏ.పి స్టేట్ పోలీస్ సేవా పతకంఎం.వెంకట రత్నం, ఏ.ఆర్.హెచ్.సి 917 డి.ఎ.ఆర్, కడప...ఏ.పి స్టేట్ పోలీస్ సేవా పతకం ఎం.సునీల్, పి.సి 344 , చాపాడు పి.ఎస్. ఏ.పి స్టేట్ పోలీస్ సేవా పతకం ఎస్.గురువయ్య, ఎ.ఆర్.హెచ్. సి 562 , డి.ఏ.ఆర్, కడప ఏ.పి స్టేట్ పోలీస్ సేవా పతకం

# ఖాళీ స్థలాలు అపరిశుభ్రంగా ఉంచవద్దు

**- నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్**



**కర్నూలు కార్పొరేషన్, ఆగస్టు 14 :**నగర పరిధిలో ఉన్న ఖాళీ స్థలాలను యజమానులు అపరిశుభ్రంగా ఉంచరాదని, తక్షణమే పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తొలగించాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ గురువారం ఓ ప్రకటనలో కోరారు. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి దోమలకు, పశువులకు నిలయం మారుతున్నాయన్నారు. దోమలు వృద్ధి చెంది నివాసాల్లోకి ప్రవేశిస్తున్నాయని, క్రిమికీటకాలు, పాములు సంచరంచే అవకాశం ఉందన్నారు. అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థల యజమానులకు ఇప్పటికే నోటీసులు జారీ చేస్తున్నామని, తదనంతరం చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నోటీసులు అందేంత వరకు ఉండకుండా యజమానులు వెంటనే తమ ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

# శారద విద్యానికేతన్ స్కూల్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**వెల్దుర్తి, ఆగస్టు 14 :** శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ప్రతి సంవత్సరం అత్యంత వైభవంగా కర్నూలు జిల్లా మండల కేంద్రమైన వెల్దుర్తి లోని ఎంతో ప్రతిష్టాత్మకమైన శారద విద్యానికేతన్ స్కూల్లో ప్రతి సంవత్సరం ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. ఈ సంవత్సరం కూడా చిన్నారులతో శ్రీకృష్ణ జన్మాష్టమి ఎంతో వైభవంగా నిర్వహించారు. చిన్నారి విద్యార్థిని విద్యార్థులకు చిన్న వయసునుండే భగవద్భక్తి అలబడుతుందని శ్రీకృష్ణ లీలలు అర్ధమవుతాయని తద్వారా వాళ్లు భవద్గీత, భాగవతం లాంటి మహోన్నత గ్రంథాలను మానవీయ విలువలను క్రమశిక్షణను, దైవభక్తిని చిన్న వయసునుండే అర్థం చేసుకుని జీవితంలో ఎదిగే అవకాశాలుంటాయని శారద విద్యానికేతన్ కరస్పాండెంట్ జల ప్రతాప్ తెలిపారు.

# ఆత్మవిమర్శ చేసుకునే సమయమిది !

భారతదేశం 79వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్న వేళ..పాలకులు, ప్రభుత్వసంస్థలు ఆత్మవిమర్శచేసుకుని ముందుకు సాగాల్సి ఉంది. మనం నిజాయితీగా పాలన చేస్తున్నామా అని కేంద్ర, రాష్ట్ర పాలకులు ఆలోచన చేయాలి. ఇన్నేళ్లయినా ఇంకా దరిద్రం తొలగిపోలేదు. ఇన్నేళ్లయినా ఇంకా పేదలు పేదలుగా ఉండి పోతున్నారు. పెద్దలు మరింత పెద్దలుగా మారుతున్నారు. ఆస్తులు, అంతస్తులు, డబ్బులు కొద్ది మంది వద్దే పరిమితం అవుతున్నాయి. ఇలా ఎందుకు జరుగుతుందో ఆలోచన చేయాలి. పేదల ఆకలి తీర్చే పేరుతో దుబారాలు చేస్తున్నారు. రాజకీయ నేతలు తమ విలాసాలకు ప్రజాధానం వృధా చేస్తున్నారు. పెన్షన్లు పంచడానికి విమానాలు, ప్రత్యేక హెలికాప్టర్లు ఎక్కి ఊరేగుతున్నారు. 43 ఏళ్ల క్రితం కిలో రెండు రూపాయల బియ్యం ఇస్తే... ఇప్పుడు దాని ధర రూపాయికి పడిపోయింది. ఇలా అన్ని సరుకుల ధరలు పడిపోయాయా అంటే లేదు. పేదలు ఇంకా ఉన్నారంటే పాలకుల అసమర్థతగానే చెప్పుకోవాలి. సామాజిక సంక్షేమ పథకాల దుర్వినియోగం వంటి ఆరోపణలతో ఇటీవల ప్రజాస్వామ్య సమగ్రతపై నీలినీడలు కమ్మేశాయి. పాలన సక్రమంగా సాగడం లేదనడానికి ఈ పథకం ఒక్కటి చాలు. ఇకపోతే 79 ఏళ్ల తరవాత కూడా స్వేచ్ఛగా ఓటేయలేకపోతున్నాం. మనం ఓటేయడానికి వెళ్లే సరికి ఆ ఓటు ఎవరో ఒకరు వేసి పోతున్నారు. ఇదంతా కేవలం ఎన్నికల సంఘం అనుసరిస్తున్న లోపభూయిష్ట విధానంగానే చూడాలి. ఎందుకంటే పక్కాగా ఓటరు కార్డు నేటికీ అమల్లోకి రాలేదు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటేయాలన్న ఆంక్షలు లేవు. ఈ రెండు అమలయితే ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది. ఒకటి పక్కాగా ఓటరుకార్డు ఉండాలి. ప్రతి ఒక్కరూ విధిగా ఓటేయాలి. ఈ రెండు అంశాలపై ఎన్నికల సంఘం దృష్టి పెట్టాలి. ఆధార్, పాన్ కార్డు తరహాలో ఓటుకు పక్కా పర్మినెంట్ నంబరు ఉంటే ఇక దొంగ ఓట్ల ప్రసక్తి రాదు. 79వ




స్వాతంత్ర్య దినోత్సవంజరుపుకుంటున్న వేళ ఎన్నికల సంఘం ఈ రెండు అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. పాలకులు తామే నిరంతరంగా అధికారంలో ఉండేందుకు నానాగడ్డీ కరుస్తున్నారు. అదే ఇప్పుడు దొంగ ఓట్లు, బూతుల క్యాప్చర్ వంటి సమస్యలకు దారితీస్తోంది. దీనిని నివారించగలగాలి. దేశంలో ఓటరు జాబితాల తయారీ, సవరణ కసరత్తును చేపట్టే అధికారం ఎన్నికల సంఘాని ఉంది. ఇది నిరంతర ప్రక్రియ కూడా. ఓటరు జాబితాను ఏటా సవరించడంలో తప్పు లేదు. అయితే పర్మినెంట్ ఓటరు కార్డు ద్వారా చనిపోయిన వారి పేర్లు తొలగించేందుకుమాత్రమే సవరణ జరగాలి. 18 ఏళ్లు నిండిన వారు విధిగా ఓటరుగా నమోదు చేయించే ప్రక్రియ రావాలి. అంతే తప్ప ఓటరు జాబితా సవరణను పెద్ద తతంగంగా చేయరాదు. పర్మినెంట్ ఓటర్ కార్డు వస్తే..నిరంతరంగా మార్పులు చేర్పులు చేయాల్సిన అసరం రాకపోవచ్చు. ప్రపంచం లోనే అతిపెద్ద ప్రజాస్వామ్యదేశంగా భారతదేశం ఖ్యాతిని పొందింది. లక్షలాది మంది స్వేచ్ఛగా, నిష్పాక్షికమైన ఎన్నికల ద్వారా సమర్థులైన నాయకులను ఎన్నుకునే అవకాశం మనదేశంలోనే ఉంది. శక్తివంతమైన ఎన్నికల పక్రియకు చాలా కాలంగా ప్రశంసలు పొందింది. అయితే, ఓటర్ల జాబితాలో అవకతవకలు, జెర్రీ మాండరింగ్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ట్యాంపరింగ్ వంటి ఆరోపణలు తరచూ వస్తున్నాయి. ఇవన్నీ తప్పకుండా సమీక్షించాల్సిన అసవరం ఉంది. భారత ప్రజాస్వామ్యంపై వాటి ప్రభావం, ఎన్నికల పక్రియలో ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు తక్షణ సంస్కరణలను పరిశీలించాల్సిందే. ఇటీవల బీహార్‌లో ఓటర్ల సవరణ సందర్భంగా పెద్ద ఎత్తున ఓటర్ల జాబితా తారుమారు జరిగాయనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి. నకిలీ ఓటర్లు లేదా చెల్లని చిరునామా గల ఓటర్లు, ఒకే అడ్రస్‌లో నమోదు చేసుకున్న బల్క్ ఓటర్లు, గుర్తించలేని ఫోటోలు ఉన్న ఓటర్లు, నకిలీలు, మొదటిసారి ఓటర్లను నమోదు చేసే ఫారం 6 దుర్వినియోగం వంటివాటిపై ఇసి నిష్పక్షపాతంగా విచారణ చేయాలి. ఇవన్నీ చక్కబెట్టుకుం టూనే.. స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత భారత ఎన్నికల కమిషన్ పైన ఉంది. అయితే తరచూ వస్తున్న ఇలాంటి ఆరోపణలపై స్పందించకపోవడంతో తీవ్రవిమర్శలు ఎదుర్కొంటోంది. ఇది ఎన్నికల కమిషన్ నిష్పాక్షికత, పారదర్శకత పట్ల అనుమానాలను లేవనెత్తుతోంది. స్పష్టంగా చదువ గలిగే ఓటర్ల జాబితాను అందించేందుకు నిరాకరించడం మరిన్ని అనుమానాలను రేకెత్తిస్తోంది. ఒక పార్టీకి అనుకూలంగా నియోజకవర్గ హద్దులను తారుమారు చేసే పద్ధతిపైనా ఇసి దృష్టి సారించాలి. తమకు అనుకూలమైన ఫలితాలు రాబట్టేందుకు నియోజకవర్గాల రూపురేఖలు మార్చేందుకు ఆయా రాష్ట్రాల్లో ఉన్న పాలకులు వ్యూహాత్మకంగా కొత్త ఓటర్లను చేర్చడమో, తొలగించడమో చేస్తున్నట్లు తరచూ ఆరోపణలు వస్తున్నాయి. ఓటర్ల జనాభాలో చిన్నమార్పు ఫలితాలను నిర్ణయించే అవకాశం ఉంటుంది. డీలిమిషన్ పక్రియలో పారదర్శకత లేకపోవడం, ఈ సమస్య పరిష్కారానికి ఇసి విముఖత చూపించడం వల్ల, అధికార పార్టీ ఎన్నికల సరిహద్దులు తనకు అనుకూలంగా మార్చి, పాలనా పక్రియపై తన ప్రభావం చూపుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. భారత ఎన్నికలలో ఇవిఎం ట్యాంపరింగ్ ఆరోపణలు ఎంతో కాలంగా వివాదా స్పదంగా మారాయి. ఈ మధ్య ఓటర్ల జాబితా తారుమారు కీలక అంశం అయింది. అయితే ఇవిఎంల ట్యాంపరింగ్‌కు కచ్చితమైన ఆధారాలు లేవు. ఓట్ల లెక్కింపులో పారదర్శకతను నిర్ధారించే వివి పాట్‌లను విస్తృతంగా ఉపయోగించాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను ఎన్నికల కమిషన్ పట్టించుకోకపోవడం ఎన్నికల వ్యవస్థపై నమ్మకాన్ని క్షీణింపజేస్తోంది. అలాగే ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను దుర్వినియోగం చేస్తున్నదనే ఆరోపణలు ఉన్నాయి. ప్రత్యక్ష నగదు బదిలీ, సబ్సిడీతో ఆహారం, ఇళ్ల నిర్మాణ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను ఓటర్లను, ముఖ్యంగా గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాలను ఆకట్టుకునే సాధనాలుగా మారాయి. ఇలాంటి ఉచిత పథకాలపైనా ఇసి దృష్టి సారించాలి. ఈ పథకాలు పేదల స్థితిగతులను మెరుగుపరచేందుకే అని చెబుతున్నా అధికార,ప్రతిపక్షపార్టీలు మాత్రం వ్యూహాత్మకంగా ఎన్నికలే లక్ష్యంగా ప్రకటనలు చేస్తున్నాయి. ఓటర్ల జాబితా తారుమారు, జెర్రీ మాండరింగ్, ఇవిఎంలపై అనుమానాలు, సంక్షేమ పథకాల దుర్వినియోగాల ప్రభావం భారత ప్రజాస్వామ్య పక్రియ చట్టబద్ధతకు తీవ్ర ముప్పును కలిగిస్తున్నాయి. ఎన్నికల కమిషన్ నిష్పాక్షికంగా వ్యవహరించలేకపోతే ప్రజాస్వామ్యం లేదనే చెప్పాలి. ఎన్నికల వ్యవస్థ పక్షపాత ధోరణితో ఉందన్న ఆరోపణలకు ఇసి జవాబుదారీగా ఉండాలి. సమస్యలపై ఆరోపణలు రాగానే నిజాయితీగా నిలబడాలి. విమర్శలకు జవాబు ఇవ్వాలి. అప్పుడే మన ప్రజాస్వామ్యం బలపడుతుంది. భారతదేశ ప్రజాస్వామ్య పరిరక్షణకు తక్షణ సంస్కరణలు అవసరం అన్న విషయం గుర్తిస్తేనే మనం మరింత బలంగా మనుగడ సాధించగలం.

---

# అక్రమ ఆక్రమణలతో వరద విపత్తు



భారీ వర్షాలతో రెండు తెలుగు రాష్ట్రాలు మళ్లీ విపత్తును ఎదుర్కొంటున్నాయి. ఏడాది క్రితం నాటి వరద బీభత్సం మళ్లీ ఇప్పుడు కనిపిస్తోంది. గత ఏడాది సెప్టెంబరు 1న మున్నేరు వరదవిలయంతో ఖమ్మం జిల్లా కేంద్రం ఛిన్నాభిన్నం కాగా, ఇప్పుడు అదే మున్నేరులో వరద నీరు పెరుగుతోంది. ప్రస్తుతం మున్నేరులో పది అడుగుల వద్ద నీరుంది. గత ఏడాది మున్నేరుకు వరదలు వచ్చి ఖమ్మం నగరం జలమయం అయింది. కృష్ణానదికి ఉపనది అయిన మున్నేరుకు రిటైనింగ్ వాల్ నిర్మించకపోవడం, వరద పరిస్థితిపై ప్రజలను అప్రమత్తం చేయకపోవడం జలప్రళయానికి దారితీసిందని చెబుతున్నారు. మున్నేరుకు సమీపంలోని మొత్తం 25 కాలనీల్లో ఇళ్లల్లో 10 అడుగుల ఎత్తులో నీరు చేరింది. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో మున్నేరు వాగు కట్టకు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ. 100 కోట్లు మంజురైనా అధికారుల అలసత్వం వల్ల ఆ పనులు పూర్తి కాలేదు. ఆ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని మున్నేరు వాగు ఉప్పొంగడానికి దారితీసే ఆకేరు వాగు ఎగువనున్న చెరువులను ఎప్పటికప్పుడు పరిశీలించి వరద పరిస్థితిని ముందుగా పసికట్టగలిగితేనే ముప్పు తప్పుతుందని చెబుతున్నారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌లో గత ఏడాది బుడమేరుకు వరదలు వచ్చాయి. బుడమేరు ప్రవాహం సజావుగా ఉప్పుటేరు మీదుగా సముద్రంలోకి వెళ్లే అవకాశం లేకపోవడంతో కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాలు ప్రమాదం అంచున నిలుస్తున్నాయి. 2005లో బుడమేరు ఉగ్రరూపం దాల్చి కొల్లేరులోకి చేరడంతో దాదాపు 44 లంక గ్రామాలు విపత్తుతో అల్లాడాయి. అప్పట్లో వారం రోజులపాటు విజయవాడ నగరం ముంపులో ఉండిపోయింది.ఆంధ్రప్రదేశ్‌లో గత రెండు మూడు రోజులుగా భారీ వర్షాలకు నదుల్లో వరద నీరు ఉప్పొంగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ప్రకాశం బ్యారేజికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. బుధవారం ఉదయానికి 2 లక్షల క్యూసెక్కుల నీరు చేరింది. బ్యారేజి గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడగులు కాగా, ప్రస్తుత నీటి మట్టం 589.20 అడుగులుగా నమోదైంది. దీంతో ప్రాజెక్టులో 26 గేట్లు ఎత్తి నీరు విడుదల చేస్తున్నారు. ఈ పరిస్థితులన్నిటికీ ముఖ్య కారణం అక్రమ ఆక్రమణలు. నదీ ప్రవాహం ముందుకు సాగకుండా నిర్మాణాలు వెలుస్తుండటంతో భారీ వర్షాలు కురిసేటప్పుడు ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి.దేశంలోని ఇతర రాష్ట్రాల పరిస్థితి కూడా ఇలాగే ఉంటోంది. దేశ వ్యాప్తంగా 1953 నుంచి 2018 మధ్యకాలంలో వరదల కారణంగా రూ. 4 లక్షల కోట్ల ఆస్తినష్టంతోపాటు లక్షమందికి పైగా ప్రాణాలు కోల్పోయారని నివేదికలు చెబుతున్నాయి. దేశంలో నాలుగు కోట్ల హెక్టార్ల భూమికి వరదల ముప్పు పొంచిఉందని జాతీయ వరదల సంఘం 1980 లోనే హెచ్చరించింది. ఈ మేరకు వరదలను ఎదుర్కోడానికి 207 సిఫార్సులు చేసింది. కానీ ఇంతవరకు ఎలాంటి ప్రణాళికలు చేపట్టలేదు. ముంబై, చెన్నై వంటి నగరాలు ఏటా భారీ వర్షాలకు తెప్పలుగా తేలిపోతున్నాయి. చెన్నైలో 1943, 1976, 1985, 1998, 2002, 2005, 2015లో భారీ వర్షాలతో వరదలు ముంచెత్తాయి. 2015లో చెన్నై సబర్బన్ ప్రాంతాల్లో 432 మంది ప్రాణాలు కోల్పోగా, 3.04 మిలియన్ మంది వరద బాధితులయ్యారు. మొత్తం రూ. 25,913 కోట్ల వరకు నష్టం వచ్చింది.వరదల కారణంగానే 1953 2017 మధ్య కాలంలో తమిళనాడులో రూ. 27,326 కోట్ల వరకు నష్టం ఏర్పడింది. ఈ మధ్యకాలంలో 3705 మంది ప్రాణాలు కోల్పోయారు. ముంబై, అహ్మదాబాద్, కోల్‌కతా, బెంగళూరు, సూరత్ తదితర నగరాలు పదేపదే భారీ వర్షాలతో వచ్చిన వరదలకు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. ఈ విపరీతాలకు మూల కారణం జలవనరులు ఆక్రమణలతో హరించుకుపోవడమే. అహ్మదాబాద్‌లో కొన్నేళ్ల క్రితం 190 చదరపు కిలోమీటర్ల పరిధిలో 603 చెరువులు ఉండగా, 2001 నాటికి ఆ సంఖ్య 137కు పడిపోయింది. హైదరాబాద్ నగరంలో ఒకప్పుడు వేల చెరువులుండేవి. కానీ రానురాను అవి హరించుకుపోయాయి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 134 సరస్సులు ఆక్రమణల పాలైనట్టు గుర్తించారు. ఈ సరస్సులు చుట్టూ 14,061 ఆక్రమణలు బయటపడ్డాయి. మొత్తం ఆక్రమణల్లో 85 శాతం కేవలం 30 నీటివనరుల్లోనే గుర్తించగా, 15 శాతం 104 సరస్సుల చుట్టూ ఉన్నట్టు కనుగొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక తెలంగాణలో హైడ్రా సంస్థ ఏర్పాటుతో అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపడం ప్రారంభమైంది. ప్రభుత్వ భూములు, చెరువుల కట్టడాలు, ఎఫ్‌టిఎల్ (ఫ్లడ్‌లెవెల్) జోన్‌లలోని అక్రమ కట్టడాలని కూల్చివేస్తోంది. అయినా ఇంకా చేపట్టవలసిన చర్యలు చాలా ఉన్నాయి. దేశంలో నగరాలు అత్యంత ఆధునీకరణకు నోచుకుని మరింత విస్తరించడం మంచిదే అయినా దానికి తగ్గట్టు మౌలిక సౌకర్యాల విస్తరణ చేపట్టడం కూడా అంతే ముఖ్యం.వరదలువంటి ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునేలా నగరాలను హెచ్చరికల వ్యవస్థలతో చక్కగా తీర్చిదిద్దాలి. సమస్యలన్నిటికీ మూలకారణమవుతున్న అక్రమ నిర్మాణాలను నివారించగలగాలి. దీనికి ప్రజలనుంచి కూడా సహకారం అవసరం. కొంతమంది అక్రమార్కులు కోర్టులను ఆశ్రయించి అక్రమ నిర్మాణాల తొలగింపును అడ్డుకోవడం మనం చూస్తున్నాం. హైదరాబాద్ లోని హైడ్రా చేపట్టే అక్రమ నిర్మాణాల తొలగింపునకు ఇలాంటి ఉదంతాలే ఆటంకం కల్పిస్తున్నాయి. ఇదిలా ఉండగా భారీ వర్షాల వల్ల ముంచుకొచ్చిన వరద నీటిని క్రమబద్ధీకరించి, నిల్వ చేసుకునే ఏర్పాట్లు లోపించడమే నగరాలు వరద విపత్తుకు బలవుతున్నాయి.

---

# శ్రామిక గమన-శీలతతోనే ఎక్కువ ఉపాధి

ఆర్థిక పరిభాషలో శ్రామిక గమనశీలత అంటే కార్మికులు వివిధ ఉద్యోగాలు (వృత్తి గమనశీలత) లేదా విభిన్న భౌగోళిక స్థానాల (భౌగోళిక గమనశీలత) మధ్య సులభంగా వెళ్ళగలగడం. ఈ కీలకమైన భావన ఆర్థిక వ్యవస్థలో శ్రమవనరులు ఎంత సమర్థవంతంగా కేటాయించబడుతున్నాయో తెలపడంతోపాటు, ఉత్పాదకత, ఆర్థికవృద్ధి వంటి అంశాలను ప్రభావితం చేస్తుంది. విద్య, శిక్షణ, సామాజిక, కుటుంబ సంబంధాలు, గృహ ఖర్చుల లభ్యత, ప్రభుత్వ విధానాలు మొదలైన అనేక అంశాలు శ్రామిక గమనశీలతను ప్రభావితం చేస్తాయి. తక్కువ శ్రామిక గమనశీలత కొన్ని ప్రాంతాలలో నిరంతర నిరుద్యోగం, ఇతర ప్రాంతాలలో కార్మిక కొరతలకు దారితీస్తుంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఒ) 2024 అంచనాల ప్రకారం, 2022లో ప్రపంచవ్యాప్తంగా 167.7 మిలియన్ల అంతర్జాతీయ వలస కార్మికులు ఉన్నారు.వారు ప్రపంచ శ్రామికశక్తిలో 4.7%. ప్రపంచ అంతర్జాతీయ వలస జనాభాలో 15 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయస్సు గల కార్మికులు దాదాపు 66% ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా వృత్తిపరమైన గమనశీలతను ప్రభావితంచేసే అంశాలు చూసినప్పుడు నైపుణ్యాలు, విద్య, వేతన వ్యత్యాసాలు, శిక్షణ అవకాశాలు, బదిలీ నైపుణ్యాలు, వృత్తిపరమైన నిబంధనలు, పని వాతావరణాలకు అనుగుణంగా ఉండే సామర్థ్యం మొదలైనవి. మరోవైపు భౌగోళిక గమనశీలతను వేతన వ్యత్యాసాలు, జీవన వ్యయం, గృహనిర్మాణం, మార్కెట్, సామాజిక, సాంస్కృతిక సంబంధాలు, ప్రభుత్వ విధానాలు, రాజకీయ స్థిరత్వం, పౌరస్వేచ్ఛలు, వాతావరణం, ప్రకృతి వైపరీత్యాలు, సాంకేతిక పురోగతి మొదలైనవి ప్రభావితం చేస్తాయి.విజువల్ క్యాపిటలిస్ట్ ప్రచురించిన డేటా ప్రకారం ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో అంతర్జాతీయ వలసదారులు అమెరికాలో 52.4 మిలియన్లకు పైగా ఉన్నారు. దీని వలన అది అధిక గమనశీలత కలిగిన దేశంగా మారింది. మెక్సికో, -అమెరికా వలస కారిడార్ ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉంది. మెక్సికోలో జన్మించిన 10 మిలియన్లకు పైగా ప్రజలు మైగ్రేషన్ డేటా పోర్టల్ ప్రకారం అమెరికాలో నివసిస్తున్నారు. యునైటెడ్ కింగ్‌డమ్ కూడా వలస కార్మికుల రాకపోకలలో గణనీయమైన పెరుగుదలను చూసింది. 2023లో 2,83,000 మంది వలస కార్మికులు వచ్చారు. ఇది మునుపటి సంవత్సరం కంటే 48% ఎక్కువ. కెనడా కూడా అధిక స్థాయిలో శ్రామిక గమనశీలత అనుభవిస్తోంది, 2023లో 1,45,000 మంది వలస కార్మికులు వచ్చారు, ఇది 7% ఎక్కువ. ఇతర ముఖ్యమైన దేశాలు జర్మనీ, జపాన్, రిపబ్లిక్ ఆఫ్ కొరియా కూడా వలస కార్మికులను ఆకర్షించడంలో బలమైన ధోరణులను చూపిస్తున్నాయి.వాస్తవానికి, పోటీతత్వ ప్రపంచ శ్రామికశక్తికి కార్మిక మార్కెట్ సరళత చాలా అవసరం. ఎందుకంటే ఇది ఉద్యోగ సృష్టిని ప్రోత్సహిస్తుంది. విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తుంది. శ్రామిక శక్తి గమనశీలతను పెంచుతుంది. కార్మిక సంస్కరణలను



అమలు చేసిన దేశాలు ఆర్థిక వృద్ధిలో గణనీయమైన మెరుగుదలను చూపిస్తున్నాయి. సౌకర్యవంతమైన కార్మిక విధానాలను కలిగి ఉన్న దేశాలు మార్కెట్ డిమాండ్లకు బాగా సర్దుబాటు చేయగలవు, మాంద్యాలను తగ్గించగలవు. మరింత స్థితిస్థాపక ఆర్థిక వ్యవస్థను పెంపొందించగలవు. పైగా ఈ దేశాలు వేగవంతమైన నియామకం, మెరుగైన పోటీతత్వం, సాంస్కృతిక నిరోధకత, ఆర్థికవృద్ధి, ఉద్యోగసృష్టి వంటి ప్రయోజనాలను కూడా కలిగి ఉన్నాయి. 2025లో ఉద్యోగ సౌలభ్యం, ఉపాధి ఒప్పందాలు, వేతన సరళత ఆధారంగా, మొదటి ఐదు దేశాలు 96/100 స్కోరుతో డెన్మార్క్, 95/100 స్కోరుతో సింగపూర్, 94/100 స్కోరుతో యునైటెడ్ స్టేట్స్, 92/100 స్కోరుతో న్యూజిలాండ్, 80/100 స్కోరుతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ). కార్మిక మార్కెట్ సరళత విషయానికి వస్తే ఈ దేశాలు ముందున్నాయి. ఐక్యరాజ్య సమితి (యుఎన్ఒ) వరల్డ్ పాపులేషన్ ప్రాస్పెకట్స్ 2024 డేటా ఆధారంగా, 2023లో అత్యధిక నికర వలస రేట్లు కలిగిన మొదటి ఐదు దేశాలు, పాకిస్తాన్ –1.62 మిలియన్లు, సూడాన్ –1.35 మిలియన్లు, భారతదేశం –979,000, చైనా 568,000 బంగ్లాదేశ్ 550,000. అనేక దేశాలు తమ పౌరులు ఇతర దేశాలకు వలస వెళ్లడం వల్ల స్థూల దేశీయోత్పత్తి (జిడిపి)లో తగ్గుదలని ఎదుర్కొంటున్నాయి. వీటిలో భారతదేశం, చైనా ఎక్కువ జనాభాను కలిగి ప్రభావితమయ్యాయి. ఈ దేశాల పౌరులు గణనీయమైన సంఖ్యలో వలస వెళ్తున్నారు, దీని వలన సమర్థ శ్రామిక శక్తి, మానవ మూలధనం కోల్పోతున్నారు. భారతదేశంలో భౌగోళిక (ప్రాంతాల వారీగా గమనశీలత), వృత్తిపరమైన (ఉద్యోగాలు/ వృత్తుల వారీగా గమనశీలత) రెండూ సాంప్రదాయకంగా చాలా తక్కువగా ఉన్నాయి.

# గుట్టుగా సచిన్ కుమారుడి నిశ్చితార్థం..!



భారత మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్ ఓ ఇంటివాడు కాబోతున్నాడా.. ఇన్ ఫాక్ట్ ఆ దిశగా తొలి అడుగు వేసేశాడా.. మీడియాలో ఇందుకు సంబంధించిన ఒక అంశం హల్చల్ చేస్తోంది. తాజాగా ఒక ప్రైవేట్ కార్యక్రమంలో అర్జున్ నిశ్చితార్థం జరిగిందని కథనాలు వెలువడ్డాయి. వ్యాపారవేత్తల కుటుంబానికి చెందిన సానియా చందోక్ అనే యువతితో అర్జున్ ఎంగేజ్మెంట్ జరిగిందని సోషల్ మీడియాలో కోడై కూస్తోంది. సానియాతో అర్జున్ ఉన్న ఫోటోలను షేర్ చేస్తూ పలువురు కంగ్రాట్స్ చెబుతున్నారు. అయితే దీనికి సంబంధించి అటు టెండూల్కర్ ఫ్యామిలీ కానీ, ఇటు చందోక్ ఫ్యామిలీ గానీ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో ఈ అంశం హాట్ టాపిక్ గా మారింది. ముంబైకి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త రవి ఘాయ్ మనవరాలే ఈ సానియా.. వీళ్లకు చాలా వ్యాపారాలు ఉన్నాయి. హాస్పిటాలిటీ, ఫుడ్ ఇండస్ట్రీలో సంస్థలు ఉన్నాయి. ప్రముఖ కాంటినేంటల్ హెూటల్, బ్రూక్లీన్ క్రీమరీ సంస్థలను ఈ కుటుంబమే నిర్వహిస్తోంది. ఇక అర్జున్ తోపాటు అతని సోదరి సారాతో సానియా కలిసి ఉన్న ఫోటోలను నెటిజన్లు సోషల్ మీడియాలో విపరీతంగా షేర్ చేస్తూ, కంగ్రాట్స్ చెబుతున్నారు. ఏదేమైనా త్వరలోనే దీనిపై స్పష్టత వచ్చే అవకాశముంది. ది గ్రేట్ సచిన్ కొడుకైనప్పటికీ, అర్జున్ కెరీర్ అంతంతమాత్రంగానే నడుస్తోంది. 26వ పడిలో ఉన్నప్పటికీ, ఇప్పటివరకు అంతర్జాతీయంగా అరంగేట్రం చేయలేదు. నిజానికి ఐపీఎల్లోనే తను ఏమీ నిరూపించుకోలేదు. మెగా టోర్నీలో ముంబై ఇండియన్స్ తరపున ఆడుతున్నాడు. బేసిగ్గా లెఫ్టార్మ్ పేసర్ అయినప్పటికీ, బ్యాటింగ్ కూడా చేయగలడు. 2023లో ముంబై తరపున అరంగేట్రం చేసిన అర్జున్.. ఆ సీజన్ లో నాలుగు మ్యాచ్ లే ఆడి నిరాశపర్చాడు. ఆ తర్వాత సీజన్ కు తనను ముంబై రిటైన్ చేసుకోగా, కేవలం ఒక్క మ్యాచ్ లోనే ఆడి వికెట్ లెస్ గా నిలిచాడు. ఇక 2025లో తనను తిరిగి ముంబై జట్టే రూ.30 లక్షలకు కొనుగోలు చేసింది. ముంబై టీమ్ మెంటార్ గా సచిన్ ఉండటంతోనే అర్జున్ ను ఆ జట్టు కొనుగోలు చేసిందనే చర్చ కూడా ప్రచారంలో ఉంది. ఇక డొమెస్టిక్ క్రికెట్ లో గోవాకు ఆడే అర్జున్.. 17 ఫస్ట్ క్లాస్ మ్యాచ్ ల్లో 37 వికెట్లు తీశాడు. 532 పరుగులు కూడా సాధించాడు. అలాగే 24 టీ20లు ఆడి 27 వికెట్లతో పాటు 119 పరుగులు కూడా చేశాడు. అలాగే 18 లిస్ట్ ఏ (వన్డే)లు ఆడి, 25 వికెట్లు తీశాడు. 102 పరుగులు చేశాడు. తన ఆటను చూస్తే, సమీప భవిష్యత్తులో టీమిండియాకు ఆడే అవకాశం లేదని పలువురు విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# వన్డేలకు రోహిత్ శర్మ రిటైర్మెంట్ పలకనున్నాడా..?



ఇదివరకే టెస్టులు, టీ20ల నుంచి రిటైరైన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ కూడా వన్డేల నుండి రిటైర్మెంట్ తీసుకోబోతున్నారా తాజా నివేదికలో విషయాలు అభిమానుల్లో ప్రశ్నల్ని రేకెత్తించాయి. ఇద్దరు దిగ్గజ ఆటగాళ్లు మూడు ఫార్మాట్లలో భారత జట్టుకు కెప్టెన్లుగా వ్యవహరించారు, ఇప్పుడు వారు కేవలం వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతున్నారు. టీ20, టెస్టుల తర్వాత ఇక వన్డే జట్టు పగ్గాలు కూడా యువ ఆటగాళ్ల చేతుల్లోకి వెళ్తాయని రిపోర్ట్ చెబుతోంది. రోహిత్- కోహ్లీ 2027 వన్డే ప్రపంచ కప్ తరువాత రిటైర్మెంట్ ప్రకటిస్తారని ఇప్పటివరకూ అంతా భావించారు. టీ20 ప్రపంచ కప్ 2024 గెలిచిన తర్వాత రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఈ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికారు. ఇంగ్లాండ్ పర్యటనకు ముందు, రోహిత్- విరాట్ కోహ్లీ ఒక వారం వ్యవధిలోనే సుదీర్ఘ ఫార్మాట్ టెస్టులకు వీడ్కోలు పలికారు. దాంతో యువ జట్టు శుభ్‌మాన్ గిల్ సారథ్యంలో ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లి సత్తా చాటింది. అంతగా అనుభవం లేని ఆటగాళ్లు జట్టులో ఉన్నా సిరీస్ ను 2-2తో డ్రా చేసుకుంది. భారత తదుపరి టోర్నమెంట్ ఆసియా కప్, కాగా సెప్టెంబర్‌లో టీ20 ఫార్మాట్‌లో ఇది నిర్వహిసస్తారు. టీమిండియా తదుపరి వన్డేలు ఆస్ట్రేలియాతో ఉన్నాయి. ఇది అక్టోబర్‌లో షెడ్యూల్ చేశారు. తాజా ఓ మీడియా నివేదిక ప్రకారం, ఈ సిరీస్ వీరిద్దరికీ చివరి వన్డే సిరీస్ అవుతుంది. .మీడియా నివేదికలో, %దీజజ×% వర్గాల సమాచారం ప్రకారం, ప్రస్తుత కెప్టెన్ రోహిత్ శర్మ, మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ ఆస్ట్రేలియా పర్యటన తర్వాత కూడా జట్టులో కొనసాగాలనుకుంటే, వీరిద్దరూ విజయ్ హజారే ట్రోఫీలో ఆడాల్సి ఉంటుంది. డిసెంబర్ చివరిలో ఈ ట్రోఫీ ప్రారంభమవుతుంది.ఇద్దరూ ఈ సంవత్సరం ప్రారంభంలో రంజీ ట్రోఫీ మిగిలిన మ్యాచ్‌లలో ఆడారు. టెస్ట్‌లో పేలవమైన ప్రదర్శన తర్వాత, %దీజజ×% అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడని సమయంలో ఆటగాళ్లు దేశవాళీ టోర్నమెంట్‌లను మిస్ చేయకూడదని నిర్ణయించడమే అందుకు కారణం. ఇందులో కూడా రోహిత్ శర్మ, కోహ్లీలు అంతగా రాణించలేదు. ఈ క్రమంలో ఇద్దరూ కీలకమైన ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్‌కు కొన్ని రోజుల ముందు వారం రోజుల వ్యవధిలో రిటైర్మెంట్ తీసుకున్నారు.ఆ నివేదికలో పేర్కొన్న సమాచారం ప్రకారం, ఈ ఇద్దరు దిగ్గజ ఆటగాళ్లు భారత క్రికెట్‌కు రెండు దశాబ్దాలుగా ఎంతో చేశారు. కానీ ఇప్పుడు యువ ఆటగాళ్లకు అవకాశం కల్పించడం, అదే సమయంలో వయసు మీద పడిన.. ప్రదర్శన బాగోలేని వారిని జట్టు నుంచి తప్పించడమై సరైన నిర్ణయమని సెలెక్టర్లు భావిస్తున్నారు. 2027 వన్డే ప్రపంచ కప్‌ను దృష్టిలో ఉంచుకుని జట్టును సిద్ధం చేయాలంటే ఇలాంటి నిర్ణయాలు తప్పవని సన్నాహాలు చేస్తున్నారు. ఈ నివేదిక ప్రకారం, రోహిత్ శర్మ, కోహ్లీ రెండేళ్ల తరువాత జరగనున్న వన్డే ప్రపంచ కప్ జట్టు కూర్పులో సెట్ అవ్వరు. అంటే వారు ఆస్ట్రేలియాతో సిరీస్ తో పాటు దేశవాళీలో ఆడి రాణిస్తేనే వన్డే వరల్డ్ కప్ జట్టులో చోటు దక్కించుకుంటారు. లేనిపక్షంలో రిటైర్మెంట్ ప్రకటించాలని మేనేజ్ మెంట్ నుంచి వారికి సంకేతాలు వెళ్లినట్లు సమాచారం. నివేదికలో, వర్గాల సమాచారం ప్రకారం, రోహిత్ శర్మ కోరుకుంటే, అతను కెప్టెన్‌గా ఆస్ట్రేలియాలో తన వన్డే కెరీర్‌ను ముగించవచ్చు. ఇద్దరూ టెస్ట్, టీ20లలో కూడా తమ చివరి మ్యాచ్‌ను కలిసి ఆడారు. ఇద్దరూ చివరిసారిగా ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో ఆడారు, ఇందులో భారత్ విజయం సాధించింది.వన్డే క్రికెట్ ప్రపంచ కప్ 2027 అక్టోబర్ నుండి నవంబర్ మధ్య దక్షిణాఫ్రికా, నమీబియా మరియు జింబాబ్వేలలో నిర్వహించబడుతుంది. విరాట్ నవంబర్ 5న 37 సంవత్సరాలు పూర్తి చేసుకుంటాడు. 2027 ప్రపంచ కప్ నాటికి అతనికి 39 ఏళ్లు వస్తాయి. రోహిత్ శర్మ గత ఏప్రిల్ 30న తన 38వ పుట్టినరోజు జరుపుకున్నాడు, అతను 2027 నాటికి 40 సంవత్సరాలు పైబడతాడు.

# చెన్నై సూపర్ కింగ్స్ చాలా లక్కీ: ఏబీ డివీలియర్స్

సౌతాఫ్రికా యువ బ్యాటర్ డెవాల్డ్ బ్రెవిస్ ఆస్ట్రేలియాపై సూపర్ సెంచరీ సాధించాడు. ఆస్ట్రేలియా వేదికగా మరారా క్రికెట్ గ్రౌండ్‌లో ప్రత్యర్థి జట్టుతో జరుగుతున్న రెండో టీ20లో ఈ సఫారీ కుర్రాడు అద్భుతంగా ఆడాడు. కేవలం 41 బంతుల్లోనే తన కెరీర్ లో తొలి సెంచరీ నమోదు చేసి ఔరా అనిపించాడు. బ్యాటింగ్‌కు దిగిన మొదటి 25 బంతుల్లో హాఫ్ సెంచరీ చేసిన.. బ్రివిస్ ఆ తర్వాత ఆడిన తక్కువ బంతుల్లో సెంచరీ పూర్తి చేశాడు. మొత్తంగా 56 బంతుల్లో 12 ఫోర్లు, 8 సిక్సర్లతో చెలరేగి 125 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఈ సెంచరీ తో తాను ఒక స్టార్ బ్యాటర్ అని నిరూపించుకుంటూ డెవాల్డ్ బ్రెవిస్. అయితే ఈ సఫారీ కుర్రోడు బ్యాటింగ్ కు ఫిదా అయిన దిగ్గజ బ్యాటర్ ఏబీ డివిలియర్స్ ఓ ఆసక్తికరమైన పోస్ట్ చేశాడు. ఈ యువ క్రికెటర్ పై ప్రశంసలు కురిపిస్తూనే ఇతడిని ఐపీఎల్ వేలంలో వదిలేసిన జట్లకు చురకలు అంటించాడు. కాంట్రాక్ట్ ను వదులుకున్న 9 ఐపీఎల్ జట్టు వారి దురదృష్టకరమని అన్నాడు. కేవలం చెన్నై సూపర్ కింగ్స్ జట్టు చాలా లక్కీ అని డివిలియర్స్ పేర్కొన్నాడు. వేలంలో డివాల్డ్ బ్రెవిస్ ని తీసుకోవడానికి ఐపీఎల్ లోని ఇతర జట్టుకు కూడా అవకాశం వచ్చిందని డివిలియర్స్ అన్నాడు. కానీ అతనిపై ఎవరు ఆసక్తి చూపకపోవడంతో చెన్నై సూపర్ కింగ్స్ అతడిని వేలంలో కొనుగోలు చేసింది. అయితే అతను ఐపీఎల్ లో పెద్ద మాస్టర్ అయ్యే అవకాశం ఉందని ఏబీ డివిలియర్స్ తన ఎక్స్ ఖాతాలో చెప్పుకొచ్చాడు.ఐపీఎల్ గత 18వ ఎడిషన్ లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు దారుణంగా విఫలమైంది. అయితే ఆ జట్టులో బ్రివిస్ ఒక వరంలా దొరికాడు. జూనియర్ ఎబి డివిలర్స్ గా అతనికి పేరు ఉంది. మెగా ఆక్షన్ లో ఒక్క జట్టు కూడా తనపై ఆసక్తి చూపలేదు. కానీ ఐపీఎల్ 2025 సీజన్ మధ్యలో బ్రెవిస్ ను చెన్నై తీసుకొని పెద్ద జాక్పాట్ కొట్టేసింది. ఆ సీఎస్కే జట్టులో చేరినప్పటి నుంచి ఈ దక్షిణ ఆఫ్రికా యువ క్రికెటర్ చెలరేగి ఆడడం మొదలెట్టాడు. అదే ఫామ్‌ను ఇప్పుడు అంతర్జాతీయ క్రికెట్ లోనూ కొనసాగిస్తున్నాడు బ్రెవిస్.

# లియాండర్ పేస్ తండ్రి కన్నుమూత



హాకీ దిగ్గజం, ప్రముఖ టెన్నిస్ ప్లేయర్ లియాండర్ పేస్ తండ్రి వేస్ పేస్ (80) కన్నుమూశారు. ఆగస్టు 12న తీవ్ర అనారోగ్యంతో కోల్‌కతాలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేరిన ఆయన, చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. గత కొంతకాలంగా పార్కిన్సన్ వ్యాధితో బాధపడుతున్నట్టు సమాచారం. 1972 ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన భారత హాకీ జట్టులో వేస్ పేస్ సభ్యుడిగా ఉన్నారు. కుమారుడు లియాండర్ పేస్ టెన్నిస్‌లో అద్భుత విజయాలు సాధించి అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకున్నారు. తుదిశ్వాస విడిచిన వేస్ పేస్ 1972 ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలుచుకున్న భారత హాకీ సభ్యుడు. వెస్‌కు గత ఏప్రిల్‌లో 80 ఏళ్లు నిండాయి. మాజీ హాకీ దిగ్గజాన్ని కోల్పోవడంతో క్రీడా ప్రపంచం విచారంలో మునిగిపోయింది. హాకీతో పాటు, అతను క్రికెట్, ఫుట్‌బాల్ , రగ్బీ కూడా ఆడాడు. అద్భుతమైన క్రీడా వృత్తికి అతీతంగా మార్గదర్శకుల్లో ఒకరిగా వెస్‌ను అభిమానులు గుర్తుంచుకుంటారు. గోవాలో జన్మించినప్పటికీ, ఆయన తన జీవితంలో ఎక్కువ భాగం కోల్‌కతాలో గడిపాడు. తన క్రీడా జీవితం తర్వాత అతడు స్పోర్ట్స్ మెడిసిన్ చదివాడు. అతడు స్పోర్ట్స్ అడ్మిన్‌స్ట్రేషన్‌లో కూడా పనిచేశాడు. అతడి ముఖ్యమైన సేవలలో ఒకటి డోపింగ్ నిరోధక అధికారిగా భారత క్రికెట్ నియంత్రణ మండలి లో ఉంది. ఆసియా క్రికెట్ కౌన్సిల్ డేవిస్ కప్ జట్టుతో కూడా అతడు పనిచేశాడు. 1996-2002 వరకు రగ్బీ ఫుట్‌బాల్ యూనియన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా కూడా పనిచేశాడు. ఏథెన్స్ 2004 ఒలింపిక్స్‌లో భారత హాకీ జట్టుకు జట్టు వైద్యుడిగా కూడా పనిచేశాడు. ముఖ్యంగా, వెస్ కుమారుడు లియాండర్ కూడా 1996 అట్లాంటా ఒలింపిక్స్‌లో కాంస్యం గెలుచుకున్నాడు.“నిజమైన క్రీడా దిగ్గజం డాక్టర్ వెస్ పేస్ మరణించారు. మైదానంలో, వెలుపల ఆయన సాధించిన విజయాలు తరతరాలకు స్ఫూర్తినిచ్చాయి. 1972 మ్యూనిచ్ ఒలింపిక్స్ కాంస్య విజేత జట్టు సభ్యుడిగా, ఆయన భారతదేశం గర్వపడేలా చేశారు.

# లక్నో జట్టును రూ. 7,090 కోట్లకు కొంటే పిచ్చోడిలా చూశారు



## లక్నో జట్టు ఓనర్ సంజీవ్ గోయెంకా



ఐపీఎల్ 2022 సీజన్‌కు ముందు లక్నో సూపర్ జెయింట్స్‌ను రూ. 7090 కోట్లకు కొనుగోలు చేసినందుకు అందరూ తనను పిచ్చోడిలా చూశారని ఆ జట్టు ఓనర్ సంజీవ్ గోయెంకా అన్నారు. కానీ ప్రస్తుతం ఆ జట్టు విలువ రూ. 13,147 కోట్లకు చేరిందని చెప్పారు. ది హండ్రెడ్ లీగ్‌లో కూడా తాను కొనుగోలు చేసిన ఫ్రాంచైజీ విలువ ఇలానే పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఐపీఎల్ 2022 సీజన్‌కు ముందు బీసీసీఐ కొత్త రెండు జట్ల కోసం టెండర్లు ఆహ్వానించగా.. సంజీవ్ గోయెంకా రూ. 7090 కోట్లకు బిడ్ వేసి లక్నో టీమ్‌ను దక్కించుకున్నాడు. మరోవైపు గుజరాత్ టైటాన్స్‌ను సీవీసి క్యాపిటల్స్ అనే సంస్థ రూ. 5,625 కోట్లకే కొనుగోలు చేసింది. లక్నో అదనంగా రూ. 1500 కోట్లు ఖర్చు చేయడంపై అప్పట్లో చాలా మంది విమర్శలు గుప్పించారు. ఆ తర్వాత నాలుగు సీజన్లు ఆడిన లక్నో.. రెండు సార్లు ప్లేఆఫ్స్ చేరింది. అనంతరం సంజీవ్ గోయెంకా తన ఫ్రాంచైజీ సామ్రాజ్యాన్ని విస్తరించారు. సౌతాఫ్రికా 20 లీగ్‌లో డర్బన్ సూపర్ జెయింట్స్, హండ్రెడ్ లీగ్ మాంచెస్టర్ ఒరిజనల్స్ జట్టును కొనుగోలు చేశారు. ఫుట్‌బాల్ లీగ్‌లోనూ సంజీవ్ గోయెంకా పెట్టుబడి పెట్టారు. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో గోయెంకా చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి.’ఐపీఎల్‌లో లక్నో జట్టును రూ. 7090 కోట్లకు కొనుగోలు చేసినప్పుడు ఈ ప్రపంచం నన్ను పిచ్చోడిలా చూసింది. కానీ మూడేళ్లలో ఆ జట్టు విలువ రూ. 13,147 కోట్లకు పెరిగింది. ఐపీఎల్ వంటి టోర్నీ ప్రపంచంలో మరెక్కడా లేదు. హండ్రెడ్ లీగ్ కూడా ఇదే విధంగా ఆదరణ పొందుతుంది. ఆ నమ్మకం నాకుంది. ఇది కేవలం క్రీడతోనే కాకుండా, ఫార్మాట్‌తో పాటు ముఖ్యంగా జట్టుతో ఒక మానసిక బంధాన్ని ఏర్పరుచుకోవడం. అయితే ఇది రాత్రికి రాత్రి జరగదు. ఐపీఎల్ ఈ స్థాయికి చేరుకోవడానికి 18 ఏళ్లు పట్టింది.’అని సంజీవ్ గోయెంకా చెప్పుకొచ్చాడు. ది హండ్రెడ్ లీగ్‌లోని మాంచెస్టర్ ఒరిజినల్స్ జట్టులోని 70 శాతం వాటాను రూ. 855 కోట్లకు సంజీవ్ గోయెంకా కొనుగోలు చేశారు. దాంతో ఆ జట్టు పేరును మాంచెస్టర్ సూపర్ జెయింట్స్‌గా మార్చనున్నారు.

# మా టీం స్వార్థంతోనే ఆడుతుంది

**• పాకిస్తాన్ మాజీ పేసర్ షోయబ్ అక్తర్**



వెస్టిండీస్‌తో జరిగిన కీలకమైన మూడో వన్డేలో పాకిస్తాన్ జట్టు ఘోర పరాజయం పాలైంది. 200 పరుగులకు పైగా భారీ తేడాతో ఓటమిని చవిచూడటంతో, మాజీ క్రికెటర్ల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాకిస్తాన్ మాజీ పేసర్ షోయబ్ అక్తర్ ఈ ఓటమిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా జట్టులో ఆటగాళ్ల వ్యక్తిగత ప్రయోజనాల గురించి ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సంచలనంగా మారాయి. వెస్టిండీస్‌తో పేలవమైన ప్రదర్శన కనబరిచిన పాకిస్తాన్ జట్టుపై అక్తర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. “మా కాలంలో మేమంతా ఒక జట్టుగా ఆడేవాళ్లం. దేశం కోసం గెలవడానికి ప్రయత్నించేవాళ్లం. ఒకరిపై ఆధారపడకుండా అందరూ తమ వంతు కృషి చేసేవాళ్లు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. గత 10-15 ఏళ్లుగా ఆటగాళ్లు కేవలం తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసమే ఆడుతున్నారు. వారి సగటును పెంచుకోవడానికి మాత్రమే చూస్తున్నారు” అని అక్తర్ ఘాటుగా విమర్శించారు. “మీరు దేశం కోసం మ్యాచ్‌లు గెలవాలనే తపన చూపించాలి. ఇప్పటికైనా మీరు మారాలి. పరిస్థితులకు అనుగుణంగా ఆడడం నేర్చుకోవాలి. బంతి బాగా కదులుతున్నప్పుడు జాగ్రత్తగా ఆడాలి. మీరు వచ్చి ఆడే పిచ్ అది కాదు. ఆ పిచ్‌ను మీరు ఎక్కడికీ తీసుకెళ్లలేరు” అంటూ పాక్ బ్యాట్స్‌మెన్‌ల ఆటతీరును ఎత్తిచూపారు. ఈ మ్యాచ్‌లో పాక్ కెప్టెన్ మహ్మద్ రిజ్వాన్ డకౌట్ కాగా, బాబర్ అజామ్ కేవలం 9 పరుగులకే అవుట్ అయ్యారు. దీంతో పాకిస్తాన్ జట్టు కేవలం 92 పరుగులకే ఆలౌట్ అయ్యింది. ఈ ఓటమితో వన్డే సిరీస్‌ను 2-1 తేడాతో కోల్పోయింది. అయితే, అంతకుముందు జరిగిన టీ20 సిరీస్‌ను పాకిస్తాన్ గెలుచుకోవడం గమనార్హం.

# తనస్టైల్‌తో అదరగొట్టిన కూలీ


## విలనిజం పండించిన అక్కినేనినాగార్జున -కథ కన్నా..కథనంతో సాగించిన తీరు అద్భుతం




రజనీకాంత్ సినిమా అంటే హైప్ సర్వసాధారణం. దానికి తోడు 'కూలీ' సినిమాలో విలన్‌గా చేసింది నాగార్జున. వీరిద్దరితోపాటు అమీర్‌ఖాన్, ఉపేంద్ర స్పెషల్ ఎట్రాక్షన్. ఇక తలైవా సినిమా అంటే అనిరుథ్ మ్యూజిక్‌లో ఏ రేంజ్‌లో రెచ్చిపోతాడో తెలిసిందే. ముఖ్యంగా బ్లాక్‌బస్టర్స్ ఖైదీ, విక్రమ్, లియోల తర్వాత లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో వచ్చిన సినిమా. అన్నింటినీ మించి రజనీకాంత్‌ని లోకేష్ కనకరాజ్ డైరెక్ట్ చేసిన తొలి సినిమా. ఈ కారణాలు చాలు... 'కూలీ'పై అంచనాలు పెరగడానికి. ప్రేక్షకులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న 'కూలీ' గురువారం థియేటర్లలోకి అడుగుపెట్టాడు. రజనీకనపిస్తే చాలు...కథ ఎలా ఉన్నా అభిమానులు సినిమా చూస్తారు. సైమన్(అక్కినేని నాగార్జు) పేరు మోసిన స్మగ్లర్. విశాఖ షిప్‌యార్డ్‌ని అడ్డాగా చేసుకొని తన కార్యకలాపాలు కొనసాగిస్తుంటాడు. స్మగ్లగూడ్స్, బంగారం ఇల్లీగల్‌గా ఎగుమతీ, దిగుమతులు అతని వృత్తి. అతని అనుంగు అనుచరుడు దయాళ్(సౌబిన్ షాహిర్). సైమన్ ఇల్లీగల్ యాక్టివిటీస్ అన్నీ ఇతని కనుసన్నల్లోనే జరుగుతుంటాయి. మహాక్రూరుడు. ఇదిలావుంటే.. మరణించిన జంతువుల క్రిమేషన్ కోసం రాజశేఖర్(సత్యరాజ్) ఓ ఎలక్ట్రిక్ ఛైర్‌ని తయారు చేస్తాడు. ఇలాంటి ఛైర్ కారణంగా మంచితోపాటు- చెడు కూడా జరిగే అవకాశం ఉందంటూ ప్రభుత్వ ప్రతినిథులు అభిప్రాయపడతారు. దాంతో ఆ ఛైర్‌ని మార్కెట్‌లోకి తెచ్చేందుకు గవర్నమెంట్ పర్మిషన్ ఇవ్వదు. తన శ్రమంతా వృధా అయిపోతుందనుకొని రాజశేఖర్ బాధపడుతున్న సమయంలో అతనికి సైమన్ నుంచి కబురు వస్తుంది. తాను చంపిన శవాలను బూడిద చేసేందుకు ఆ ఛైర్ కావాలంటాడు సైమన్. సహకరించపోతే కూతుళ్లను చంపుతానని బెదిరిస్తాడు. దాంతో కుటుంబం కోసం తప్పక సైమన్‌తో చేయి కలుపుతాడు రాజశేఖర్. సైమన్ చంపిన శవాలను ఆ కుర్చీ సహాయంతో బూడిద చేస్తుంటాడు. తన కుమార్తె ప్రీతి(శ్రుతిహాసన్) రాజశేఖర్‌కు ఈ విషయంలో సహాయం చేస్తుంటుంది. ఇదిలావుంటే.. ఉన్నట్టుండి రాజశేఖర్ మరణిస్తాడు. ఆ మరణవార్త విన్న రాజశేఖర్ ప్రాణస్నేహితుడు దేవా(రజనీకాంత్) షాక్ అవుతాడు. రాజశేఖర్‌ది సహజ మరణం కాదని, అతన్ని కొట్టి చంపారని దేవాకు తెలుస్తుంది. అంతేకాక, రాజశేఖర్ కుమార్తెలు ముగ్గురూ కూడా ప్రమాదంలో ఉన్నారని దేవాకు తెలుస్తుంది. దాంతో తన స్నేహితుడి పిల్లలకు దేవా అండగా నిలుస్తాడు. అసలు రాజశేఖర్‌ని చంపిందెవరు? రాజశేఖర్ పిల్లల్ని దేవా ఎలా కాపాడాడు? అసలు ఈ దేవా ఎవరు? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానమే మిగతా కథ. ఒక సాధారణ కథా వస్తువుకు, చక్కని కథనాన్ని జోడించి, జనరంజకంగా చెప్పడానికి ప్రయత్నించాడు దర్శకుడు లోకేష్ కనకరాజ్. ప్రథమార్ధం ఆడియన్స్ ముందు కొన్ని ప్రశ్నలుంచి, ద్వితీయార్థంలో ఆ చిక్కుముళ్లను ఒక్కొక్కటిగా విప్పుకుంటూ సినిమాను ముగించాడు. రజనీకాంత్ క్యారెక్టరైజేషన్ నెక్ట్సలెవల్లో డిజైన్ చేశారు లోకేష్. తనది కాని సమస్యలోకి ఎంటరై, ప్రమాదాలతో ఆడుకుంటూ.. రాజశేఖర్(సత్యరాజ్) కుమార్తెలను కాపాడుకుంటూ వెళ్తున్న దేవాను మనం ఫస్టాఫ్‌లో చూస్తాం. సెంకాడాఫ్‌కు వచ్చే సరికి అసలది తన సమస్యే అని తెలుస్తుంది. అదేంటనేది ఈ కథలో కీ పాయింట్. అయితే.. సినిమాలోని కొన్ని సన్నివేశాలు కృతకంగా అనిపించినా...మొత్తం సినిమా అయితే ఆకట్టుకునేలాగే ఉంది. దేవాగా రజనీకాంత్ నటనకు అభిమానులు ఉర్రూతలూ గిపోవడం ఖాయం. పవర్‌ఫుల్ యాక్షన్ ఎలిమెంట్స్‌తో మరోవైపు ఎమోషన్స్‌తో అదరగొట్టేశారు సూపర్‌స్టార్. ముఖ్యంగా ఫ్లాష్‌బ్యాక్ యాక్షన్ సీక్వెన్స్‌లో వింటేజ్ తలైవాను చూసి తమిళ జనం ఊగిపోవడం ఖాయం. ఇక విలన్ సైమన్‌గా నాగార్జున ఆకట్టుకున్నారు. అందరికీ తెలిసిన ఈ పాయింట్‌కు బలమైన పాత్రలను జోడించి.. కథను మలుపులు తిప్పి.. సాంకేతిక హంగులు జోడించి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ప్రేక్షకులంతా ఎంతో ఆసక్తిగా ఎదురు చూసిన దేవా ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌ను సింపుల్‌గా మాటలతో సరిపెట్టేయడం నిరుత్సాహపరుస్తుంది. ఇక సైమన్ (కళగశసిషళ) పాత్రను ముగించిన తీరు.. చాలా సింపుల్‌గా తేల్చిపారేశారు. పతాక ఘట్టాల్లో దాహాగా ఆమీర్ పాత్రను పరిచయం చేసిన తీరు ఆకట్టుకున్నా.. 'విక్రమ్'లో రోలెక్స్ పాత్రతో పోల్చి చూసినప్పుడు ఆ స్థాయి ఎలివేషన్‌ను తాకలేకపోయింది.టైటిల్ పాత్రలో రజనీకాంత్ ఆద్యంతం అలరిస్తారు. తన వయసుకు తగ్గ పాత్రలోనే కనిపిస్తూ.. ఎక్కడా తనలోని స్టైల్‌ను, గ్రేస్‌ను మిస్ చేయకుండా ప్రేక్షకుల్ని మెప్పించే ప్రయత్నం చేశారు. ఆయన్ని ఢీ కొట్టే ప్రతినాయకుడిగా, విలన్ సైమన్ పాత్రలో నాగార్జున జీవించేశారు.


# పరదా సినిమా అందరినీ అకట్టుకుంటుంది

## నటి అనుపమా పరమేశ్వరన్ విశ్వాసం



'పరదా' సినిమాతో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు నటి అనుపమ పరమేశ్వరన్. ఆమె ప్రధానపాత్రలో ప్రవీణ్ కంద్రేగుల దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఆగస్టు 22న విడుదలకు సిద్ధమైంది. దీని ప్రచారంలో భాగంగా వరుస ఇంటర్వ్యూలు ఇస్తూ అనుపమ తన కెరీర్‌కు సంబంధించిన విషయాలను పంచుకుంటున్నారు. తాజాగా ఆమె మాట్లాడుతూ గతంతో పోలిస్తే ఇప్పుడు తాను ఎంతో మారినట్లు- చెప్పారు. ఇండస్ట్రీలో కొనసాగడం చాలా కష్టం. ఒక్కోసారి హీరోయిన్స్ అడిగే చిన్న చిన్న విషయాలను కూడా చిత్రబృందం సీరియస్‌గా తీసుకుంటుంది. గతంలో ఇలాంటి సంఘటనలు చాలా ఎదుర్కొన్నాను. వాళ్లకు నచ్చని విషయాలు చెబితే వెంటనే పొగరు అని అంటారు. చిత్రీకరణ అనుకున్న సమయానికి ఎందుకు ప్రారంభించలేదని అడిగితే యాటిట్యూడ్ ఉందని అంటారు. గతంలో ఇలాంటివి నేను ఎన్నో చూశాను. ఉదయం 7 గంటలకల్లా రెడీ అయితే.. 9.30 వరకు చిత్రీకరణ ప్రారంభించరు. కో స్టార్స్ ఆలస్యంగా వస్తారని తెలిసినా.. నేను మాత్రం ఏడు గంటలకల్లా సిద్ధంగా ఉండాలి. వాళ్ల కోసం గంటన్నర ఎదురుచూడాలి. ఇదే విషయాన్ని టీ-మ్‌ను అడిగితే పొగరు ఎక్కువైంది అని అంటారు. అలా ఎవరైనా అంటే ఒకప్పుడు బాధపడేదాన్ని.. ఇప్పుడు పట్టించుకోవడం మానేశాను అన్నారు. ఆ గంటన్నరలో సినిమాకు సంబంధించిన ఎన్నో విషయాలు చర్చించుకోవచ్చు. ఇదే విషయం దర్శకనిర్మాతలతో చెబితే 'నా డబ్బులు కదా నీకెందుకు' అంటారు. ఒకవేళ ఇదే విషయం హీరోలు చెబితే వాళ్లకు ఇలాంటి సమాధానం చెప్పరు. ఇండస్ట్రీల్రో మాత్రమే కాదు.. బయట కూడా ఇదే పరిస్థితి ఉంది. మహిళలను ఇలానే చూస్తారని అనుపమ పరమేశ్వరన్ తెలిపారు. 'పరదా' కచ్చితంగా హిట్ కావాలని తాను కోరుకుంటు-న్నట్లు- చెప్పారు. కమర్షియల్‌గా హిట్ అయితేనే భవిష్యత్తులో ఇలాంటి చిత్రాలు మరిన్ని వస్తాయని అన్నారు.

# మృణాల్ కి కౌంటర్ ఇచ్చిన బ్యూటీ



మృణాల్ ఠాకూర్ ప్రస్తుతం తెలుగుతో పాటు హిందీ ఇతర భాషల్లోనూ వరుస సినిమాలు చేయడం వల్ల బిజీ హీరోయిన్‌గా పేరు సొంతం చేసుకుంది. సుదీర్ఘ కాలం పాటు ఇండస్ట్రీలో స్ట్రగుల్స్ ఎదుర్కొన్న మృణాల్ ఠాకూర్ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంది. సోషల్ మీడియాలో ఆమె రెగ్యులర్‌గా ఏదో ఒక కారణం వల్ల వివాదాస్పదం అవుతూనే ఉంటుంది. తాజాగా మృణాల్ ఠాకూర్ గతంలో చేసిన ఒక వ్యాఖ్య కారణంగా తీవ్రంగా విమర్శలు ఎదుర్కొంటూ వార్తల్లో నిలుస్తోంది. దాదాపు పదేళ్ల క్రితం మృణాల్ ఒక కార్యక్రమంలో భాగంగా అర్జిత్ తనేజాతో మాట్లాడుతున్న సమయంలో కండలు తిరిగిన అమ్మాయిని పెళ్లి చేసుకుంటావా అంటూ ప్రశ్నించింది. అదే సమయంలో ఆమె బిపాసా ను బాడీ షేమింగ్ చేసింది. సొంత బ్రాండ్ ఉన్న సచిన్ కాబోయే కోడలు బాడీ షేమింగ్ వ్యాఖ్యలతో మృణాల్ వివాదాస్పదం ఆ సమయంలో మృణాల్ కి పెద్దగా ఫేమ్ లేదు, ఆ వ్యాఖ్యలను జనాలు పెద్దగా పట్టించుకోలేదు. ఎప్పుడైతే ఆమెకు ఫేమ్ వచ్చిందో, ఎప్పుడైతే ఆమె సినిమాలు జనాల్లోకి వస్తున్నాయో అప్పటి నుంచి బిపాసా గురించి మృణాల్ చేసిన వ్యాఖ్యలు సైతం మళ్లీ వార్తల్లోకి రావడం మొదలు అయింది. జనాలు ఆమె యొక్క వ్యాఖ్యలను తిరిగి షేర్ చేయడం ద్వారా వివాదాస్పదం అయింది. ఒక అమ్మాయి అయ్యి ఉండి మరో అమ్మాయి గురించి అలాంటి వ్యాఖ్యలు చేయడం ఎంత వరకు కరెక్ట్ అంటూ విమర్శలు చేసిన వారు చాలా మంది ఉన్నారు. బిపాసా వంటి స్టార్ హీరోయిన్, ఆమె ఫిజిక్ ఎంతో మందికి ఆదర్శంగా ఉంటుంది. అలాంటి హీరోయిన్‌ను ఎలా మీరు బాడీ షేమింగ్ చేస్తారు అంటూ ట్రోల్స్ మొదలు అయ్యాయి. బిపాసా సోషల్ మీడియా పోస్ట్ వైరల్ మృణాల్ వ్యాఖ్యల గురించి ఇన్ని సంవత్సరాలు పట్టించుకోని బిపాసా ఎట్టకేలకు స్పందించింది. బాడీ షేమింగ్ గురించి మృణాల్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ అన్నట్లుగా బిపాసా సోషల్ మీడియా ద్వారా స్పందించింది. బలమైన మహిళలు ఒకరిని ఒకరు ప్రోత్సహించుకుంటారు, అందమైన స్త్రీలు మనం బలంగా ఉండాలి అనుకుంటారు.

# ఇద్దరు హీరోల చిత్రం వార్-2

## హృత్రిక్‌తో పోటీపడి నటించిన ఎన్టీఆర్




ఈ ఏడాది ప్రేక్షకులు అత్యంత ఆసక్తిగా ఎదురు చూస్తున్న భారతీయ సినిమాల్లో 'వార్ 2' ఒకటి. హృత్రిక్ రోషన్ సినిమా అయినా, ఎన్టీఆర్ ఉండడంతో కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. ప్రముఖ నిర్మాణ సంస్థ యశ్‌రాజ్ ఫిల్మ్స్; స్పై యూనివర్స్‌లో భాగంగా రూపొందిన ఈ ఫ్రాంఛైజీలోకి ఎన్టీఆర్; రావడంతో తెలుగు వారికి మరింత ప్రత్యేకంగా మారింది. అత్యంత భారీ చిత్రం 'బ్రహ్మాస్త్ర తర్వాత అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించిన ఈ యాక్షన్ థ్రిల్లర్ అద్భుతమనే చెప్పాలి. మాజీ ఏజెంట్ కబీర్ (హృతిక్ రోషన్) దేశం దృష్టిలో ఓ ద్రోహి. రా విభాగానికి చీఫ్ అయిన కల్నల్ సునీల్ లూథ్రా (అశుతోష్ రాణా)కి ఒకప్పుడు నమ్మిన బంటు-. అలాంటి కబీర్ రా కళ్లుగప్పి అజ్ఞాతంలో గడుపుతుంటాడు. ఓ కాంట్రాక్ట్‌లో భాగంగా జపాన్‌లో అత్యంత శక్తిమంతమైన ఓ వ్యక్తిని అంతం చేస్తాడు. ఆ తర్వాత అతనిపై కలి కార్టెల్ అనే ఓ అజ్ఞాతమైన అసాంఘిక శక్తి కన్నేస్తుంది. కబీర్‌ని తన కార్టెల్‌లో భాగం చేసుకుని భారతదేశాన్ని గుప్పెట్లోకి తీసుకోవాలనేది కలి పన్నాగం. ఆ కార్టెల్ మొదట కబీర్‌కి ఓ టాస్క్ అప్పజెబుతుంది. తనకి గాడ్ ఫాదర్ లాంటి సునీల్ లూథ్రాని అంతం చేయాలనేదే ఆ టాస్క్. చెప్పినట్టే ఆ పనిని పూర్తి చేస్తాడు కబీర్. దాంతో కబీర్‌ని ఎలాగైనా పట్టుకోవాలని రా కొత్త చీఫ్ విక్రాంత్ కౌల్ (అనిల్ కపూర్), భారత ప్రభుత్వం సోల్జర్ విక్రమ్ చలపతి (ఎన్టీఆర్) నేతృత్వంలో ఓ బృందాన్ని రంగంలోకి దింపుతుంది. ఆ బృందంలో లూథ్రా కూతురు వింగ్ కమాండర్ కావ్య లూథ్రా (కియారా అద్వాణీ) కూడా ఒకరు. మరి కబీర్ కోసం విక్రమ్ బృందం మొదలుపెట్టిన వేట ఎలా సాగింది? కబీర్ దేశద్రోహిగా ఎందుకు మారాడు? అతనికీ, కావ్యకీ ఉన్న సంబంధం ఏమిటి? కబీర్... లూథ్రాని చంపడం వెనక ఇతర కారణాలేమైనా ఉన్నాయా? కబీర్‌కి విక్రమ్ ఎవరో తెలిశాక ఏం చేశాడు? కలి కార్టెల్ వెనకున్న అజ్ఞాత శక్తులు ఎవరు? తదితర విషయాలు ఆసక్తికరంగా మలిచారు. ఈ సినిమా ప్రకటించినప్పటి నుంచీ ఈ కథలో హీరో ఎవరు? విలన్ ఎవరనే ప్రశ్నే ఎక్కువగా అభిమానుల నుంచి వ్యక్తమైంది. అయితే ఇది హీరో విలన్ల కథ కాదు, ఇద్దరు హీరోల కథ అని ఆరంభ సన్నివేశాలతోనే చెబుతూ సినిమాని మొదలుపెట్టాడు దర్శకుడు. ఇద్దరు హీరోల పరిచయ సన్నివేశాలు విజిల్స్ కొట్టిస్తాయి. జపాన్‌లో హృతిక్ ఫైట్, నౌకలో ఎన్టీఆర్ యాక్షన్ ప్రథమార్ధంలో కీలకం. కబీర్ కోసం సోల్జర్ విక్రమ్ వేట మొదలు పెట్టినప్పటి నుంచి అసలు సిసలు వార్ మొదలవుతుంది. వారిద్దరూ ఒకరికొకరు ఎదురుపడటం, ఆ నేపథ్యంలో యాక్షన్ సన్నివేశాలు థ్రిల్‌ని పంచుతాయి. ముఖ్యంగా స్పెయిన్‌లో సాగే ఛేజింగ్, విరామానికి ముందు ఆకాశంలో విన్యాసాలు కట్టిపడేస్తాయి. విరామానికి ముందు సన్నివేశాల్లో మలుపు ద్వితీయార్ధంపై ఆసక్తిని రేకెత్తిస్తాయి. ప్రథమార్ధంలో యాక్షన్ హంగామానే ఎక్కువగా అనిపించినా, ద్వితీయార్ధంలో కథలో భావోద్వేగ కోణాన్నీ ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. విక్రమ్‌కీ, కార్టెల్‌కీ మధ్య సన్నివేశాలు ద్వితీయార్ధానికి హైలైట్. ఇవన్నీ ఒకెత్తయితే, పతాక సన్నివేశాలు మరో ఎత్తు. రా విభాగం దావోస్‌లో ఒక పక్క ప్రధానిని రక్షించడం, మరోవైపు విక్రమ్, కబీర్ కలిసి చేసే అంతిమ పోరాటం ప్రేక్షకుడిని లీనం చేస్తాయి. పతాక సన్నివేశాల్లో భావోద్వేగాలూ ఆకట్టుకుంటాయి. కథని ముగించిన తీరు కూడా మెప్పిస్తుంది. కబీర్ పాత్రలో హృతిక్ కనిపించడం కొత్త కాదు. 'వార్'కి కొనసాగింపుగా, ఆ పాత్రని అంతే సమర్థంగా ఇందులో పోషించాడు. యాక్షన్ హీరోగా ఆయన ÷-టసైల్, ఎన్టీఆర్‌తో కలిసి చేసిన పోరాటాలు, సలామ్ అనాలి పాటలో డ్యాన్సలు ఆకట్టుకుంటాయి. ఎన్టీఆర్ యాక్షన్ అవతారం ఈ సినిమాకి మరొక ప్రధాన ఆకర్షణ. ఇందులోని విక్రమ్ పాత్రలో ఒదిగిపోయారు. కియారా అద్వాణీ ఊపిరి ఊయలగా పాటలో తన అందంతో కట్టిపడేస్తుంది. అశు తోష్ రాణా, అనిల్ కపూర్, వరుణ్ బదోలా పాత్రలూ మెప్పిస్తాయి. సినిమా మొత్తం ప్రధానంగా హృతిక్, ఎన్టీఆర్ చుట్టూనే సాగుతుంది. దాంతో మిగిలిన పాత్రలకి పెద్దగా ప్రాధాన్యం దక్కలేదు.

# కేవలం 50లకే సితారే జమీన్ పర్ స్ట్రీమింగ్




బాలీవుడ్ నటుడు, మిస్టర్ ఫర్ఫెక్ట్ ఆమిర్‌ఖాన్ ప్రధాన పాత్రలో నటించిన 'సితారే జమీన్ పర్' చిత్రం ప్రస్తుతం ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతున్న విషయం తెలిసిందే. పాపులర్ స్ట్రీమింగ్ ఫ్లాట్‌ఫామ్ అయిన యూట్యూబ్ లో కేవలం రూ.100లకే ఈ సినిమా ప్రస్తుతం పేపర్-వ్యూ మోడల్‌లో స్ట్రీమింగ్ అవుతుంది. అయితే తాజాగా ఈ సినిమాపై మరో బంఫర్ ఆఫర్‌ని ప్రకటించింది చిత్రయూనిట్. ఇండిపెండెన్స్ డే కానుకగా.. ఈ సినిమాను కేవలం రూ.50లకే అందుబాటులో ఉంచుతున్నట్లు- ప్రకటించింది. దీంతో ఈ సినిమాను చూడాలనుకునేవారు యూట్యూబ్‌లో కేవలం రూ.50 చెల్లిస్తే సరిపోతుంది. ఈ ఆఫర్ ఆగష్టు 15 నుంచి 17 వరకు ఉంటుందని తెలిపింది. ఆర్ఎస్ ప్రసన్న దర్శకత్వం వహించిన ఈ సినిమాలో జెనీలియా కథానాయికగా నటించారు. ఆమిర్‌ఖాన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఆమిర్‌ఖాన్, అపర్ణ పురోహిత్ ఈ చిత్రాన్ని నిర్మించారు.

# పుష్ప పాటకు బాలయ్య స్టెప్పులు



బాలయ్య మరోసారి తన ఎనర్జీతో అభిమానులను ఉర్రూతలూగించారు. ప్రముఖ నిర్మాత, 'ఆహా' ఓటీటీ అధినేత అల్లు అరవింత్ కలిసి ఓ కార్యక్రమంలో పాల్గొన్న బాలయ్య, వేదికపై తెగ సందడి చేశారు. ఈ ఈవెంట్‌లో బాలయ్య, అరవింద్ సహా పలువురు ప్రముఖులు ఫుల్ ఫార్మల్ డ్రెస్‌లో స్టేజ్ పై కనిపించారు. మరింత విశేషం ఏంటంటే, వీరంతా మెడలో నిమ్మకాయల హారాలు ధరించి కనిపించారు. ఇక ఈ కార్యక్రమంలో పుష్ప2కి సంబంధించిన ఎనర్జిటిక్ పాట ప్లే అయ్యే క్రమంలో, బాలయ్య తనదైన స్టైల్‌లో తొడకొడుతూ, చిల్ అవుతూ ఆడియన్స్‌కి వినోదం పంచారు. ఇక వేదికపై ఉన్నవారందరూ 'పుష్ప' సినిమా సిగ్నేచర్ మూవ్‌ను రిపీట్ చేస్తూ సర్‌ప్రైజ్ చేశారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'బాలయ్య బాబు తగ్గేదేలే!' అంటూ నెటిజన్లు కామెంట్లు- పెడుతున్నారు. 'ఆహా'సలో బాలయ్య హోస్ట్‌గా బాగా హిట్ అయిన టాక్ షో 'అన్‌స్టాపబుల్ విత్ ఎన్బీకే' కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ షో ద్వారా బాలయ్య టీ-వీ ఆడియన్స్‌కూ మరింత దగ్గరయ్యారు. ఈ నేపథ్యంలో, బాలయ్య - అల్లు అరవింద్ ఒకే వేదికపై కనిపించడం ఫ్యాన్స్‌కు హుషారు తెప్పించింది. వీరిద్దరూ కలసి ఓ సినిమా చేయాలన్న డిమాండ్ సోషల్ మీడియాలో ఊపందుకుంటోంది.

Editer : Gunnala Anil Reddy, Address : Krushi Nagar, Sharelingampalli Mandalam, Ranga Reddy(Dist) Telangana Cell : 9705043131,8096660656